ప్రతిపక్షం

www.prathipaksham.in

ఐసీసీ వరల్డ్ కప్ అండర్ 19 షెడ్యూల్ విడుదల 12

గురువారం 20.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 240 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu

ఏపీలో మరో భారీ ఎన్‌కౌంటర్!

ఏడుగురు మావోయిస్టుల మృతి

మృతులలో పార్టీ కీలక అగ్రనేతలు

- 50 మంది మావోయిస్టుల అరెస్టు
- ముగ్గురు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు
- 23 మంది ప్లాటూన్ మెంబర్లు
- 19 మంది ఏరియా కమిటీ మెంబర్లు
- ఐదుగురు డివిజనల్ కమిటీ మెంబర్లు
- మిగిలినవారంతా లొంగిపోతేనే మేలు
- ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్‌చంద్ర లడ్డా

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, విశాఖపట్నం

నవంబర్ 19: ఏపీ రంపచోడవరం అటవీ ప్రాంతంలో మరోసారి ఎదురు కాల్పులు జరిగాయి. బుధవారం తెల్లవారుజామున భద్రతా బలగాలు, మావోయిస్టుల కు మధ్య జరిగిన ఎదురుకాల్పులలో ఏడుగురు మావోయిస్టులు చనిపోయారని ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్‌చంద్ర లడ్డా వెల్లడించారు. మిగిలిన మావోయిస్టులు లొంగిపోవడం మంచిదన్నారు. ఈ ఎన్‌కౌంటర్ మృతులలో ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. శ్రీకాకుళానికి చెందిన జోగారావు అలియాస్ టెక్ శంకర్, జ్యోతి, సురేష్, లోకేష్, షైను, అనిత, షమ్మిలుగా గుర్తించారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ ఇంకా కొనసాగుతోంది. మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఏడీజీ పేర్కొన్నారు. విజయవాడలో ఏర్పాటు చేసిన

..:: మిగతా 2లో

ఆన్‌లైన్‌లో మహిళా ఉత్పత్తులు

> చీరల పంపిణీకి ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. ప్రతి మండల కేంద్రంలో కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులను తప్పక ఆహ్వానించాలని సూచించారు. నవంబరు 19 నుంచి డిసెంబరు 9 వరకు గ్రామీణ ప్రాంతాలలో చీరల పంపిణీ పూర్తి చేయాలన్నారు. పట్టణ ప్రాంతాలలో మార్చి 1 నుంచి 8వ తేదీ వరకు చీరలు పంపిణీ చేయాలని సీఎం ఆదేశించారు. అర్హులైన ప్రతి మహిళకు చీర అందుతుందని ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

- అమెజాన్‌తో ఒప్పందానికి సంప్రదింపులు
- తెలంగాణ సంస్కృతికి అనుగుణంగా చీరలు
- కోటి మందికి పంపిణీ చేయాలని నిర్ణయం
- ఈ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలి
- ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలి
- ప్రతి నియోజకవర్గానికి ఓ ప్రత్యేకాధికారి నియామకం
- డిసెంబరు 9 వరకు చీరల పంపిణీ పూర్తి కావాలి
- మార్చి 1 నుంచి పట్టణ ప్రాంతాలలో ప్రారంభం
- చీరల పంపిణీ ప్రారంభోత్సవంతో సీఎం రేవంత్
- ఘనంగా దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి
- విగ్రహం వద్ద సీఎం, డీసీఎం, మంత్రుల నివాళులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 19 : తెలంగాణవ్యాప్తంగా మహిళా సంఘాలు ఉత్పత్తి చేస్తున్న వివిధ వస్తువులను ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకు వెళ్లేందుకు అమెజాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహానికి ముఖ్యమంత్రి బుధవారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇందిరా మహిళాశక్తి చీరల పంపిణీని ప్రారంభించారు. సచివాలయం నుంచి జిల్లాలలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. తెలంగాణ ఆడ బిడ్డలకు పుట్టింటివాళ్లు అన్నదమ్ములు సారె చీరె పెట్టడం సాంప్రదాయమని, అలాగే రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డను తోబుట్టువుగా భావించి తమ ప్రజా ప్రభుత్వం ప్రతి మహిళకు చీర అందిస్తుందని అన్నారు. కోటి మంది మహిళలకు చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. చీరల పంపిణీకి ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి మండల కేంద్రంలో కార్యక్రమాన్ని

..:: మిగతా 2లో

మూడు విడతలుగా 'పంచాయతీ'

- ఎన్నికలకు సిద్ధమవుతున్న సర్కారు
- డిసెంబరు రెండో వారంలోగా పూర్తి
- త్వరలో రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటన
- జాబితాల సవరణకు కొత్త షెడ్యూల్ విడుదల

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 19 : పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా సవరణకు మరోసారి షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల 20 నుంచి 23 వరకు ఓటర్ల జాబితాలను సవరించాలని నిర్ణయించింది. 20న దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ, తప్పుల సవరణ, 22న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం, 23న తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ ఉంటాయి. రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికలను మూడు విడతలలో నిర్వహించేలా

..:: మిగతా 2లో

భవిష్యత్ తరాలకు 'విజన్'తో మేలు

- రాష్ట్ర ప్రగతి, భవిష్యత్తు ప్రపంచానికి చూపేందుకే
- 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పన
- నగరంలో పెద్ద పండుగలా గ్లోబల్ సమ్మిట్
- 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధనే ముఖ్యం
- వార్ రూమ్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 19 : యువ రాష్ట్రం తెలంగాణ గత రెండేండ్లలో సాధించిన ప్రగతి, రాష్ట్ర భవిష్యత్తును ప్రపంచానికి చూపడమే తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన ప్రజాభవన్ లో అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో కలిసి ఏర్పాటు చేసిన 2047 విజన్ డాక్యుమెంట్ వార్ రూమ్ సమావేశ మందిరంలో ప్రసంగించారు. '3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్య సాధన సీఎం రేవంత్ రెడ్డి తో పాటు యావత్ క్యాబినెట్ కల. ఆ కల సాధనకు

..:: మిగతా 2లో

ప్రకృతి వ్యవసాయంలో భారత్ ప్రపంచానికి కేంద్రం

ప్రకృతి వ్యవసాయంలో భారత్ ప్రపంచానికి కేంద్రంగా మారుతుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఇది స్వదేశీ విధానమని, సంప్రదాయంగా వస్తోందని చెప్పారు. రైతులు యేడాదికి ఒక ఎకరం చొప్పున క్రమంగా ప్రకృతి వ్యవసాయం వైపు మారాలని సూచించారు. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో బుధవారం పర్యటించిన ప్రధాని మోడీ, అక్కడ నుంచే పీఎం- కిసాన్ 21వ విడత నిధులను విడుదల చేశారు.

..:: 11లో

పౌరుల సహకారం కీలకం

- ప్రజలు సహకరిస్తేనే నేరాలను తగ్గించగలం
- యూరిన్ కిట్స్ తో గంజాయి బ్యాచ్ కు చెక్
- మహిళలకు పూర్తి భరోసా, తగిన రక్షణ
- డ్రంక్ అండ్ డ్రైవ్ పై పోలీసుల ప్రత్యేక దృష్టి
- 'ప్రతిపక్షం' ఇంటర్వ్యూలో కరీంనగర్ సీపీ గౌస్ ఆలం

..:: 5లో

మెట్రో, మూసీలకు సహకరిస్తాం

- అదనంగా 160 కిమీ మేర మెట్రో విస్తరణ
- నిధులు ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది
- ప్రతిపాదనలు పరిశీలించి నిర్ణయం
- కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 19 : మెట్రో రైల్ విస్తరణ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం ఖర్చును భరించుకోవాలని యోచిస్తున్నట్టు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. హైదరాబాద్‌లో అదనంగా 160 కిలోమీటర్ల మేర మెట్రో లైన్లను నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందినట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లో జరిగిన దక్షిణాది రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రులు, అధికారుల ప్రాంతీయ సదస్సులో

..:: మిగతా 2లో



బిహార్ సీఎంగా నేడు నితీశ్ ప్రమాణం

బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బుధవారం నాడు జరిగిన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో తమ నేతగా నితీశ్‌ను ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. అనంతరం గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ వద్దకు వెళ్లిన నితీశ్ కుమార్ రాజీనామా సమర్పించారు.

11

రాజేంద్ర ప్రసాద్ దత్త పుత్రుడిని కలవనున్న రాష్ట్రపతి

భారతదేశ తొలి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్‌దత్త పుత్రుడు బసంత్ పాండో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలవనున్నారు. ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేసామని అధికారులు తెలిపారు.

11

హసీనా కోసం ఇంటర్‌పోల్ సాయం

ఐసీటీ తీర్పు నేపథ్యంలో బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం ఆమెను భారత్ నుంచి స్వదేశానికి రప్పించేందుకు చర్యలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే ఇంటర్‌పోల్ సాయం కోరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

11

రాహుల్ గాంధీకి 272 మంది ప్రముఖుల లేఖ

భారత ప్రజాస్వామ్యం, దాని మూల స్తంభాల మీద దాడి జరుగుతోందంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి 272 మంది ప్రముఖులు లేఖ రాశారు.

11

భారత్, రష్యాది దశాబ్దాల స్నేహం

- వివిధ రంగాలలో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం
- రష్యా బృందంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 19 : భారత్, రష్యా దేశాల మధ్య దశాబ్దాలుగా స్నేహబంధం కొనసాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో వివిధ రంగాలలో పెట్టుబడులు పెట్టేందుకు రష్యా బృందం ఆసక్తి చూపడాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానిస్తుందని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ప్రజాభవన్ లో ఆయన గ్లోబల్ ట్రేడ్ మరియు టెక్నాలజీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, వీటీబీ రష్యన్ బ్యాంక్ ప్రతినిధులతో చర్చించారు. వ్యవసాయం, విద్యుత్తు, టెక్నాలజీ రంగాలలో దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని చెప్పారు. ఒక సీజన్ లో 1.40 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి చేసి దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని వివరించారు. ఫార్మా, ఐటీ రంగాలకు హబ్ గా తెలంగాణ రాష్ట్రం నిలిచిన విషయాన్ని లెక్కలతోవివరించారు. మైనింగ్ రంగంలోనూ తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని 100 సంవత్సరాల పైబడిన చరిత్ర కలిగిన ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి, 45 వేల మంది ఉద్యోగులతో కొనసాగుతున్న విషయాన్ని వివరించారు. 1940 నుంచి ప్రభుత్వ రంగ సంస్థలకు హైదరాబాద్ కేంద్రంగా కొనసాగుతుందని, వ్యూహాత్మకంగా హైదరాబాద్ సురక్షిత ప్రాంతమని తెలిపారు. సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్, ప్రతినిధి బృందంలో వోల్గా భాష, రష్మీ సలూజ, సంజయ్ కౌశిక్, మోనికా బానట్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో మరో భారీ ఎన్‌కౌంటర్!

మొదటిపేజీ తరువాయి

మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ నుంచి ఏపీకి రావడానికి మావోయిస్టులు ప్రయత్నిస్తున్నారు. పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసి కదలికలను గమనిస్తున్నాం. సోమవారం ఒక ఆపరేషన్‌తో సహా 18న ఉదయం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. సెంట్రల్ కమిటీ మెంబర్ హిడ్మాతో పాటు మరో ఐదుగురు మావో యిస్టులు హతమయ్యారు.

50 మంది మావోయిస్టులు అరెస్టు

మరోవైపు ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో 50 మందిని అరెస్టు చేశారు. వీరిలో స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్లు ముగ్గురు, ప్లాటూన్ మెంబర్లు 23 మంది, డివిజినల్ కమిటీ మెంబర్స్ 5, ఏరియా కమిటీ మెంబర్స్ 19 మంది ఉన్నారు. ప్రజలకు ఎక్కడా హానీ జరగకుండా ఈ అరెస్టులు చేశారు దొరికిన మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఎన్‌కౌంటర్ తర్వాత కొందరు మావోయిస్టులు పారిపోయారు. వారిని కూడా పట్టుకునేందుకు బృందాలు రంగంలోకి దిగాయి అని ఏడీజీ తెలిపారు. నిఘా వర్గాల సమాచారం మేరకు పోలీసులు కూంబింగ్ చేపట్టి.. మావోయిస్టుల కదలికలను గమనించారు. నవంబర్ 17న ఒక ఆపరేషన్ ప్రారంభించాం. 18న ఉదయం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో సెంట్రల్ కమిటీ మెంబర్ హిడ్మాతో పాటు మరో ఐదుగురు మావోయిస్టులు హతమయ్యారు.ఇక ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో 50 మంది మావోయిస్టులను అరెస్టు చేశామన్నారు. వీరిలో స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్లు ముగ్గురు, ప్లాటూన్ మెంబర్లు 23 మంది, డివిజినల్ కమిటీ మెంబర్లు ఐదుగురు, ఏరియా కమిటీ మెంబర్స్ 19 మంది ఉన్నట్లు తెలిపారు. పట్టుబడ్డ మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

భవిష్యత్ తరాలకు 'విజన్'తో మేలు

మొదటిపేజీ తరువాయి

ప్రతి ఒక్కరం ఆలోచిస్తున్నాం అడుగులు వేస్తున్నాం, ఈ లక్ష్య సాధనలో అందరినీ భాగస్వాములు చేసి సమగ్ర డాక్యుమెంట్ రూపొందించే బాధ్యతను సీఎం రేవంత్ రెడ్డి తనకు అప్పగించారని డిప్యూటీ సీఎం వివరించారు. 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ఐఎస్బీతో అధికారికంగా ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా ఇప్పటికే వివిధ శాఖల నుంచి నోడల్ ఆఫీసర్లను నియమించి వారి ద్వారా వచ్చిన సమాచారం మేరకు ఐఎస్బీ బృందం ప్రాథమిక కసరత్తు పూర్తి చేసింది, గ్లోబల్ సమ్మిట్ వచ్చేనెల 8, 9 తేదీలలో జరగనుంది, తక్కువ సమయం అందుబాటులో ఉన్నందున పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి విజన్ డాక్యుమెంట్ ను తుది దశకు తీసుకురావాలి' అని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పన అనేది చరిత్రలో లిఖించదగిన అంశమని డిప్యూటీ సీఎం వివరించారు. సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, సీఎస్ రామకృష్ణారావు, స్పెషల్ జయేష్ రంజన్, సంజయ్ కుమార్, వికాస్ రాజ్, ఉన్నతాధికారులు శ్రీధర్, మహేష్‌దత్ ఎక్కా, సందీప్ కుమార్ సుల్తాన్య, నవీన్ మిట్టల్, హరీష్,, బుద్ధ ప్రకాష్, కృష్ణ భాస్కర్, ముషారఫ్ అలీ, నాగిరెడ్డి, చౌహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో మహిళా ఉత్పత్తులు

మొదటిపేజీ తరువాయి

పండుగ వాతావరణంలో నిర్వహించాలని, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులను తప్పక ఆహ్వానించాలని సూచించారు. నవంబరు 19 నుంచి డిసెంబరు 9 వరకు గ్రామీణ ప్రాంతాలలో చీరల పంపిణీ పూర్తి చేయాలన్నారు. పట్టణ ప్రాంతాలలో మార్చి 1 నుంచి 8వ తేదీ వరకు చీరలు పంపిణీ చేయాలని సీఎం ఆదేశించారు. అర్హులైన ప్రతి మహిళకు చీర అందుతుందని ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

మహిళల గౌరవం పెంచాలనే

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ మహిళల గౌరవం పెంచాలనే ఉద్దేశంతోనే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చీరల పంపిణీ చేపడుతోందని అన్నారు. రేషన్ కార్డు ఉన్న మహిళలందరికీ చీరలు అందిస్తున్నామని తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థిక క్రమశిక్షణతో బ్యాంక్‌లు రుణాలు ఇచ్చేందుకు సంఘాల దగ్గరకు వస్తున్నాయని తెలిపారు. 98 శాతం రుణ చెల్లింపుతో సంఘాలు తమ క్రమశిక్షణను చాటుతున్నాయని కొనియాడారు. ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీపైనా కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలన్నారు. ఆకాశమే హద్దుగా మహిళలు ఎదగాలనే ఉద్దేశంతో చీరలకు ఆకాశం రంగు చీరలకు ఎంచుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ కార్యదర్శి శేషాద్రి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకిచ్చిన హామీల అమలుకు కృషి

- త్వరలో ముఖ్యమంత్రితో మాట్లాడతా: మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 19 : తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై బుధవారం నాడు తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ ప్రతినిధులు మంత్రి పొన్నం ప్రభాకర్ తో చర్చించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ తానూ తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ సభ్యుడినే అని, హామీల అమలు భాధ్యత తనపైన ఉన్నదని అన్నారు. ఇప్పటికే ఆలస్యం అయిందని, తప్పకుండా ముఖ్యమంత్రితో త్వరలోనే మాట్లాడి హామీల అమలు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫోరమ్ రాష్ట్ర కమిటీ నేతలు డా.చీమ శ్రీనివాస్ చైర్మన్. సురేందర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి జగన్ యాదవ్. వీరస్వామి. భాను ప్రకాశ్ రెడ్డి. జానకి రెడ్డి. పుట్నాల కృష్ణ.ఇందర్ కుమార్.మాణిక్యం. జగన్. శ్రీధర్ తస్దితరులు పాల్గొన్నారు.

మెట్రో, మూసీలకు సహకరిస్తాం

మొదటిపేజీ తరువాయి

ఆయన మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, ఏపీ పురపాలక శాఖ మంత్రి నారాయణతో కలిసి ఖట్టర్ విలేకరులతో మాట్లాడారు. 'మెట్రో విస్తరణ ప్రతిపాదనల సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నాం. ఏ లైన్లకు ఆమోదం తెలపాలనే దానిపై మార్చి నాటికి కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది' అని చెప్పారు. ప్రస్తుతం ఎల్ అండ్ టీ భాగస్వామ్యంతో ఉన్న హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసేందుకు ప్రాథమికంగా అంగీకారానికి వచ్చిన నేపథ్యంలో, కేంద్ర భాగస్వామ్యంతో మెట్రోను విస్తరించడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో కూడా మెట్రో ప్రాజెక్టులకు డిమాండ్ ఉందని మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. ఆ ప్రతిపాదనలను కూడా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. అమరావతిని ప్రధాన నగరంగా అభివృద్ధి చేసే ఆలోచన కూడా ఉందని, ప్రస్తుత ప్రణాళికల ఆధారంగా అవసరమైన నిధులు అందిస్తామని హామీ ఇచ్చారు.

మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి

మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనలపైనా ఖట్టర్ మాట్లాడారు. "మొదటి దశలో 9 కిలోమీటర్ల మేర రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేస్తాం. నీటి నాణ్యతను పర్యవేక్షించేందుకు ప్రతి 5 కిలోమీటర్లకు ఒక మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ) ఏర్పాటుకు ఆమోదం తెలిపాం. మూసీ ప్రక్షాళనకు అమృత్ పథకం, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) ద్వారా నిధులు సమకూరుస్తాం" అని వివరించారు. ఇదే సమయంలో, పట్టణాభివృద్ధికి కేటాయించిన నిధులను రాష్ట్రాలు సక్రమంగా ఎందుకు వినియోగించుకోవడం లేదని అధికారులను ప్రశ్నించారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మూసీ నది నీటి నాణ్యతను పరీక్షించేందుకు ఒక టెస్టింగ్ ల్యాబొరేటరీకి ఆమోదం లభించిందని, హైదరాబాద్ మెట్రోకు 50:50 వాటా పద్ధతిపై చర్చలు జరిగాయని ధ్రువీకరించారు.

మూడు విడతలుగా 'పంచాయతీ'

మొదటిపేజీ తరువాయి

సర్కారు ప్లాన్ చేస్తున్నది. దీంతో ఒక్కో విడత పోలింగ్‌కు ఐదు రోజులలోపే గ్యాప్ ఉండనున్నది. ఈ లెక్కన డిసెంబర్ రెండో వారంలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియను ముగించనున్నట్లు తెలుస్తున్నది. డెడికేటెడ్ కమిషన్ పంచాయతీ ఎన్నికల కోసం గతంలోనే రెండు విధాలుగా రిజర్వేషన్లను ఖరారు చేసింది. ఇందులో ఒకటి బీసీలకు 42 శాతం ఉండగా, ఇంకో దాంట్లో అన్ని రిజర్వేషన్లు కలిపి 50 శాతం లోపు ఉండేలా రెడీ చేసింది. ఇప్పటికే సిద్ధంగా ఉన్న 50 శాతంలోపు రిజర్వేషన్ల జాబితాను మరోసారి పరిశీలించి ప్రభుత్వానికి నివేదించనున్నది. వాస్తవానికి పంచాయతీ ఎన్నికలు పార్టీల గుర్తుపై జరగవు. ఆయా అభ్యర్థులకు పార్టీలు మద్దతు మాత్రమే ఇస్తాయి. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేసే స్థానాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించింది.

మిగతా పార్టీలపై ప్రభావం

బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ పరంగా తీసుకున్న నిర్ణయం మిగతా పార్టీలన్నింటిపై ప్రభావం చూపనున్నది. అనివార్యంగా ఇతర రాజకీయ పార్టీలు కూడా అదే మార్గాన్ని అనుసరించక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. అసెంబ్లీలో బీసీలకు రిజర్వేషన్ల సందర్భంగా అన్ని పార్టీలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపాయి. ఇప్పుడు ఆ రకంగా అమలు చేయపోతే .. ఆ పార్టీలకు బీసీలు దూరమయ్యే అవకాశం ఉంటుంది. బీసీలకు స్థానిక సంస్థల్లో చట్ట ప్రకారం ఇప్పటికే 2223 శాతం రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి. దీనిని చట్టపరంగా 42 శాతంకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసింది. చివరకు హైకోర్టు స్టే ఇచ్చింది. సుప్రీంకోర్టు కూడా హైకోర్టు ప్రకారం నడుచుకోవాలని సూచన చేసింది. ఈ క్రమంలో వచ్చే మార్చిలోగా పంచాయతీల్లో పాలక వర్గాలు కొలువుదీరక పోతే ఫైనాన్స్ కమిషన్ నుంచి రావాల్సిన దాదాపు రూ.3 వేల కోట్లు ల్యాప్స్ కానున్నాయి. ఫలితంగా పంచాయతీ ఎన్నికల్లో 50 శాతంలోపే రిజర్వేషన్లతో ఎన్నికలకు ప్రభుత్వం వెళ్తున్నది.

సచివాలయంలో మెగాహార్ట్ హెల్త్ క్యాంప్

- పరీక్షలు నిర్వహించిన రెనోవ హాస్పిటల్ సిబ్బంది

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 19 : వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం నాడు సచివాలయంలోని అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును ప్రారంభించారు. దాదాపు 40 మంది రెనోవ హాస్పిటల్ సిబ్బంది బీపీ,జీ ఆర్‌బీఎస్ , ఈసీజీ,2డిఈకో పరీక్షలను నిర్వహించారు . కార్డియాలజీ , జనరల్ ఫీజిషన్ సేవలను ఉచిత కన్సల్టేషన్ సేవలను ఉద్యోగులకు అందించారు . సచివాలయ ఉద్యోగులు, అధికారులు కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు పెద్ద ఎత్తున హాజరై పరీక్షలను నిర్వహించుకొని, డాక్టర్ల సలహాలు సూచనలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ ఉద్యోగులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఎంపీ బలరాం నాయక్ పాల్గొని క్యాంపు జరుగిన పనితీరును అభినందించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీగిరి శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ప్రేమ్, కార్యవర్గ సభ్యులు, రెనోవా హాస్పిటల్స్ డైరెక్టర్ టీవీ నగేష్ , డా. సోహెబ్ అహ్మద్, డాక్టర్ జవహర్ కార్డియాలజిస్టులు, మిస్టర్ రవీంద్రనాథ్ సీఈఓ డాక్టర్ శివకుమార్, కుమారి నితిజ్ఞ హర్కరా, ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ స్టేట్ ఐటీ హెడ్ రాఘువేందర్ రెడ్డి హాజరయ్యారు..

బీసీ కోటా పెంచాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదు

- కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను దగా చేసింది: ఆర్ కృష్ణయ్య
- నగరంలో బీసీల భారీ ప్రదర్శన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 19 : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలనీ డిమాండ్ చేస్తూ వేలాదిమంది విద్యార్థులు హస్తినాపురం చౌరస్తా నుంచి ఎల్బీనగర్ వరకు బుధవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పగిళ్ల సతీష్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలా వెంకటేష్ నాయకత్వం వహించారు. ఐక్య వేదిక అధ్యక్షులు అనంతయ్య, రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు రాజేందర్ సమన్వయము చేశారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బీసీలను మోసం చేస్తుందని విమర్శించారు. కేసు హైకోర్టులో నడుస్తుండగా ఎన్నికలు జరగవలసిన అవసరం ఏముందని ప్రశ్నించారు. సమస్య పరిష్కారానికి అనేక ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నప్పటికీ ఏ ప్రయత్నం చేయడం లేదన్నారు. అఖిల పక్షం సమావేశం ఏర్పాటు చేసి ప్రధానమంత్రి కలవడానికి ప్రయత్నం చేయడం లేదన్నారు. ఇండియా కూటమికి 240 మంది ఎంపీలు ఉన్నా, బీసీ రిజర్వేషన్ల సమస్యపై పార్లమెంట్ లో ప్రశ్నించలేదన్నారుఈ ప్రదర్శనలో పగిళ్ళ సతీష్, నీల వెంకటేష్, అనంతయ్య, రాజేందర్, రాజ్ కుమార్, అజయ్, అంజి గౌడ్, శివ యాదవ్, అఖిల్, ప్రేం, ప్రవీణ్, వంశీ, అరుణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు నూతన దిశ

- ప్రజాభవన్‌లో వుమన్ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్
- మంత్రి సీతక్క సారథ్యంలో మేధావుల సమాలోచన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 19 : ప్రజాభవన్‌లో తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉమెన్ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ ఘనంగా జరిగింది. మంత్రి డా. దానసరి అనసూయ సీతక్క జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. మహిళా కమిషన్ చైర్పర్సన్ నేరెళ్ల శారద, బాలల హక్కుల కమిషన్ చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, ఉమెన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్పర్సన్ బండ్రు శోభారాణి, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్, సీనియర్ ఐఏఎస్ అధికారులు సీతాలక్ష్మి, అనిత రామచంద్రన్, జి సృజన, శ్రుతి ఓజా, ఐఅండ్ పీఆర్ కమిషనర్ ప్రియాంక ఆల, హైదరాబాద్ కలెక్టర్ హరి చందన,అదనపు డీజీ. శుభిలష్ బిస్త్‌తో పాటు పలువురు మహిళా ఐపీఎస్ లు, బాలల హక్కుల కమిషన్ సభ్యులు, నిపుణులు, మేధావులు, సామాజికవేత్తలు పాల్గొన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు, వివక్ష నిర్మూలన, లింగ సమానత్వం, మహిళల భద్రత, ఆరోగ్యం, పోషకాహారం వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. నిపుణుల అభిప్రాయాలు, సూచనలు, అనుభవాలను ప్రభుత్వం తెలుసుకుని భవిష్యత్ విధానాల్లో ప్రతిబింబింపజేయాలనే ఉద్దేశంతో రౌండ్ టేబుల్ నిర్వహించారు.

'స్కిల్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా'గా తెలంగాణ

- ఏఐ'తో ఉద్యోగాలు పోతాయన్నది అపోహే
- సంక్షోభంతో పాటే కొత్త అవకాశాలు: మంత్రి శ్రీధర్ బాబు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 19 : తెలంగాణను స్కిల్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని మంత్రి అన్నారు. తెలంగాణ యువతను పరిశ్రమల భాగస్వామ్యంతో అత్యుత్తమ నైపుణ్యమున్న మానవ వనరులుగా తీర్చిదిద్దేలా కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్ ను సిద్ధం చేస్తున్నామన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్ఐసీ)లో నిర్వహించిన టెక్నాలజీస్ హ్యాకథాన్ 2025ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెక్నాలజీ రోజురోజుకీ వేగంగా మారుతుందని, ఆ మార్పులను అందిపుచ్చుకోగలిగితేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. రెండేళ్లలోనే 40 శాతానికి పైగా అంతర్జాతీయ కంపెనీలు జనరేటివ్ ఏఐ ను తమ కోర్ వర్క్‌లో భాగం చేసుకున్నాయన్నారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయన్నది అపోహే, అది కేవలం ఉద్యోగాల స్వరూపాన్ని మాత్రమే మారుస్తుందన్నారు. ఆటోమేషన్ వల్ల 85 మిలియన్ జాబ్స్ పోతే, కొత్తగా 97 మిలియన్ల స్కిల్ బేస్డ్ ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరం తేల్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సంక్షోభంతో పాటే కొత్త అవకాశాలు కూడా వస్తాయని, అందుకు సంసిద్ధంగా ఉండాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో ఈఎస్ఐసీ డైరెక్టర్ డా.రామేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ టార్గెట్ దిశగా అడుగులు వేస్తున్నాం కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధిని తెలియజేయడమే తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ లక్ష్యం. ఆర్ఆర్ఆర్ నిర్మాణం, రెండేళ్లలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులకు సంబంధించిన అంశాలను డాక్యుమెంట్‌లో పొందుపరచాలని సీఎస్‌లు, సెక్రటరీలకు సూచించాం.

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రాష్ట్రీయం

సింగరేణి భవన్ ఎదుట ధర్నా

- జాగృతి కవిత, హెచ్ఎంఎస్ నాయకుల అరెస్టు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 19 : హెచ్ఎంఎస్, జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాదు సింగరేణి భవన్ ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. భవన్ ముందు బైఠాయించారు. పోలీసు బలగాలు సింగరేణి భవన్ వద్దకు చేరుకొని కవితతో పాటు హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఇతర నాయకులను అరెస్ట్ చేసి, పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా కవిత, రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ తమ అరెస్టులు అప్రజాస్వామికం అని మండిపడ్డారు సింగరేణి ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కారం కాక ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా సొంత ఇంటి కల నెరవేర్చాలని, మారు పేర్లు వెంటనే మార్చాలని పెరక్స్ ఇన్కంటాక్స్ యాజమాన్యమే చెల్లించాలని, కొత్త బావులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, విజిలెన్స్ వద్ద పెండింగులో ఉన్న డిపెండెంట్ కేసులకు పరిష్కారం చేయాలని సింగరేణి భవన్ ముట్టడికి పిలుపునిచ్చామని తెలిపారు. ఉద్యోగాలు తగ్గించేందుకే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. విజిలెన్స్ వేధింపులు అధికమయాయని దీనితో ఉద్యోగులు తీవ్ర ఆందోళన గురవుతున్నారని పేర్కొన్నారు. ఆకాశరామన్న ఉత్తరాలతో కూడా ఉద్యోగులపై విచారణ చేపట్టడం ఏమిటని మండిపడ్డారు తమ అక్రమ అరెస్టులకు నిరసనగా ఈనెల 21న సింగరేణి వ్యాప్తంగా నల్లబదులతో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

సిటీ కళాశాలలో స్త్రీ శక్తి దివస్ వేడుకలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 19 : ఏబీవీపీ సిటీ కళాశాల శాఖ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి స్త్రీ శక్తి దివాస్ వేడుకలు జరపడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల ఎబివిపి అధ్యక్షుడు అనిల్ మాట్లాడుతూ 'ఒక చంకన బిడ్డ చూడు, ఒక వంకన ఖడ్గమాడు రణమున రయమున వెళ్ళే హయమున ఝాన్సీని చూడు' అన్నట్లుగా 23 యేండ్ల చిరు ప్రాయంలోనే తన బుద్ధి కుశలత, కార్య కౌశలం, నిరుపమాన శౌర్య పరాక్రమాలతో వీర నారీమణిగా చరిత్ర పుటలలో స్థానం సంపాదించుకున్నారన్నారు. వీర వనిత ఝాన్సీ లక్ష్మి బాయి నేడు ఆమె చరిత్ర ఎందరికో స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కాలంలో ప్రతి ఒక్క స్త్రీ ఝాన్సీ లక్ష్మీబాయి అడుగుజాడలలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు శంకర్ , శిరీష , రామ్ కుమార్, కళాశాల సెక్రటరీ శివమణి మరియు విద్యార్థి నాయకులు అంజి, సాగర్, రాహుల్, గణేష్, మరియు తదితర విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

రూ.15,627కోట్లతో నేషనల్ హైవేలు

- రాష్ట్రంలో 5 కొత్త జాతీయ రహదారులు

ప్రతిపక్షం బ్యూరో కరీంనగర్, నవంబర్ 19: తెలంగాణలో నాలుగు కొత్త జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. మొత్తం 271 కి.మీ మేర రహదారులను రూ.10,034 కోట్లు ఖర్చుతో ఎన్హెచ్ఏఐ నిర్మించనుంది. అటవీ, పర్యావరణ, రైల్వే అనుమతులన్నీ పూర్తయ్యాయి.కొత్తగా నిర్మించబోయే జాతీయ రహదారుల నిర్మాణం: హ్యామ్ మోడల్ లో ఉండాలని కేంద్రం సూచించింది. ఇంతకు ముందు నాలుగు వరుసలకు టెండర్లు పిలిచినప్పటికీ, ట్రాఫిక్ సర్వే నివేదికల ప్రకారం ఆరు వరుసలకు మార్చారు. రహదారుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం హ్యామ్ మోడల్ను ద్రుతంగా అమలు చేస్తోంది. ఈ విధానం మహారాష్ట్రలో విజయవంతం కావడంతో, ఆ మోడల్పై అధ్యయనం చేసి రాష్ట్రంలోనూ అమలు చేస్తున్నారు. మొత్తం రూ. 15,627 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. వీటికి సంబంధించి జనవరి, ఫిబ్రవరి మాసంలో టెండర్లు తెరవనున్నారు.

రాష్ట్రంలో ఇవే కొత్త నేషనల్ హైవే'లు

- మహబూబ్నగర్ - గూడెబల్లూర్, దూరం: 80 కి.మీ అంచనా వ్యయం: రూ.2,662 కోట్లు, భూసేకరణ: 465.7 హెక్టార్లు.
- జగిత్యాల - మంచిర్యాల హైవే (EPC మోడల్), దూరం: 68 కి.మీ. అంచనా వ్యయం: రూ.2,550 కోట్లు, భూసేకరణ: 317 హెక్టార్లు.
- ఆర్మూర్ - జగిత్యాల జాతీయ రహదారి దూరం: 64 కి.మీ, అంచనా వ్యయం: రూ.2,338 కోట్లు, భూసేకరణ: 288.3 హెక్టార్లు.
- జగిత్యాల - కరీంనగర్ హైవే దూరం: 59 కి.మీ, అంచనా వ్యయం: రూ.2,484 కోట్లు, భూసేకరణ: 306.7 హెక్టార్లు.
- సంగారెడ్డి గిర్మాపూర్-యాదాద్రి తంగడపల్లి వరకు 160 కి.మీ ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగాన్ని ఆరు వరుసలుగా అభివృద్ధి చేసేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది.

మావోయిస్టులు లొంగిపోవాలి

- దేశం మారుతోందన్న మల్లోజుల వేణుగోపాల్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 19 : మావోయిస్టులు ప్రభుత్వాలకు లొంగిపోవాలని మాజీ మావోయిస్టు మల్లోజుల వేణుగోపాల్ పిలపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో జరుగుతున్న వరుస ఎన్కౌంటర్ల నేపథ్యంలో మల్లోజుల వీడియో సందేశం పంపారు. ఎన్కౌంటర్లో హిడ్మా సహా ఆరుగురు చనిపోవడం బాధాకరం అని పేర్కొన్నారు. మావోయిస్టులు లొంగిపోవాలని కోరుతున్నానని చెప్పారు. మారిన పరిస్థితుల దృష్ట్యా సాయుధ పోరాటం కొనసాగించలేమని, ప్రజలలో చేరి పోరాటం చేయాలని కోరుతున్నానన్నారు. ఇటు ప్రజలలో ఉండి రాజ్యాంగబద్ధంగా పోరాటం సాగించాలని పరిస్థితులు మారుతున్నాయని అన్నారు. దేశం కూడా మారుతోందని, ఎన్కౌంటర్లలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. లొంగిపోవాలనుకునే మావోయిస్టులు తనను ఫోన్ నంబర్ 8856038533 కు సంప్రదించవచ్చని మల్లోజుల సూచించారు.

మేడ్చల్లో ఆర్ఎంపీ డాక్టర్ల ఆరాచకాలు

- ఏడాది క్రితం వైద్యం వికటించి కార్మికుడి మృతి
- ఘటనపై విచారణ జరిపి ఏడాది తరువాత ఆర్ ఎం పి డాక్టర్ రాజు ను రిమాండ్
- డీఎంహెచ్ఓ వ్యవస్థ ఉన్నట్టా లేనట్టా

ఆర్ఎంపీ నేరెళ్ల రాజు గౌడ్ (ఫైల్ ఫోటో)

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 19: ఏడాది క్రితం కార్మికుడు మృతి చెందిన ఘటనలో నిందుతుడు ఖరారైన ఆర్ ఎం పి వైద్యుడిని పోలీసులు మంగళవారం రిమాండ్ కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రానికి చెందిన రాజు ఛత్రియ పొట్ట గూటి కోసం కొరకు పని కోసం వలస వచ్చి గుండ్లపచంపల్లి మున్సిపాలిటీ పరిధి గోసాయిగూడలో నివాసం ఉంటున్నాడు. ఛత్రియ గతేడాది నవంబర్ 24న జ్వరం రావడంతో వైద్యం చేయించుకుందామని మిత్రులతో కలిసి మేడ్చల్ మున్సిపల్ పరిధి కిష్టాపూర్ లో గల ఆర్ ఎం పి నేరెళ్ళ రాజు (40) దగ్గరికి వెళ్ళాడు. అతడిని పరీక్షించిన ఆర్ ఎం పి రాజు సైనకొబాలమిన్ 500 ఎంజీ ఇంజక్షన్ ను ఇచ్చాడు. ఇంజక్షన్ అనంతరం ఆసుపత్రిలోనే కూర్చోమని చెప్పాడు. కొద్దిసేపు అనంతరం రాజు ఛత్రియకు వాంతులు ప్రారారంభమయ్యాయి. దీంతో ఆందోళన గురైన ఆర్ ఎం పి రాజుగౌడ్ అతడిని దగ్గరలో ఉన్న మెడిసిటి ఆసుపత్రికి వెళ్లాలని రిఫర్ చేశాడు. మెడిసిటి ఆదుపత్రికి చేరేలోపే రాజు ఛత్రియ మృతి చెందాడు. ఆర్ ఎం పి డాక్టర్ చేసిన వైద్యం వికదించడంతోనే రాజు ఛత్రియ మృతి చెందాదని అతని సంభందీకులు మేడ్చల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు జరిపిన విచారణలో రాజు ఛత్రియ మృతికి ఆర్ ఎం పి డాక్టర్ కారణమని తేలడంతో, ఈ మేరకు అతనిని అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్ కు తరలించారు. ఏడాది తరువాత కూడా పోలీసులు రాజు ఛత్రియ మరణానికి కారణమైన ఆర్ ఎం పి డాక్టర్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినందుకు సీఐ సత్యనారాయణకు మేడ్చల్ ప్రజలందరూ ప్రశంసలు తెలిపారు.

కేటీఆర్ విఫల నాయకుడు

- స్థానిక సంస్థలలో తమదే విజయం
- చెన్నూరులో 600 కోట్లతో అభివృద్ధి
- ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా
- మంత్రి వివేక్ వెంకటస్వామి

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, నవంబర్ 19 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఓ ఫెయిల్యూర్ లీడర్ అని, ఆయన నాయకత్వంలో ఏ ఒక్కటి కూడ గెలిచిన దాఖలాలు లేవని మంత్రి జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆయన నాయకత్వంలో పార్టీ పూర్తిగా పతనావస్థకు చేరుకుందని ఎద్దేవా చేశారు. రెండు రోజులుగా జిల్లాలతో పాటు చెన్నూర్ నియోజకవర్గంలో మంత్రి విస్తృతంగా పర్యటిస్తున్నారు. మందమర్రి బొక్కలగుట్ట వద్ద రూ.20 లక్షలతో ఓపెన్ జిమ్కు శంకుస్థాపన చేశారు. సింగరేణి స్టోర్స్ వద్ద ఐదెకరాల స్థలంలో 30లక్షలతో వైకుంఠదామం పనులను ప్రారంభించారు. అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం కోలుకోలేని విధంగా దెబ్బతిందని ఆరోపించారు. విచ్చలవిడిగా కుంభకోణాలు చేసి కేసీఆర్ కుటుంబం కోట్లు గడిచిందని అన్నారు. రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిన సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజలకు జవాబుదారీగా పని చేయడమే తన కర్తవ్యమని తెలిపారు. ఆయా శాఖల అధికారులు కూడ మంచి సేవలందించి ప్రజల మన్ననలు పొందాలని చెప్పారు. త్వరలోనే నియోజకవర్గ వ్యాప్తంగా కార్యకర్తలతో పెద్ద సమావేశం ఏర్పాటు చేస్తానని తెలిపారు.

'ఉప్పల్' కారిడార్ దసరా నాటికి పూర్తి

- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 19 : ఎట్టి పరిస్థితులలోనూ ఉప్పల్ - నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ 2026 దసరా నాటికి పూర్తి చేసి తీరుతామని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న గతుకుల రోడ్డు మార్గంలో వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. 5.5 కి.మీ గాను 1.5కి.మీ రోడ్డు నిర్మాణం పూర్తయిందనీ,మేడారం జాతర ప్రారంభం వరకు నాణ్యమైన బి.టి రోడ్డు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి వెల్లడించారు. బిటి రోడ్డు పనులు,ఎలివేటెడ్ కారిడార్ పనులు పొద్దున,రాత్రి షిఫ్టుల వారిగా శరవేగంగా కొనసాగుతున్నాయనీ ఇచ్చిన మాట ప్రకారం,రాజకీయాలకు అతీతంగా 2026 దసరా నాటికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ ప్రారంభిస్తామని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పునరుద్ఘాటించారు.

450 గజాల పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా

ప్రతిపక్షం, సిటీబ్యూరో, నవంబర్ 19: రంగారెడ్డి జిల్లా సరూర్నగర్ మండలం కర్మన్ ఘాట్ లోని సాయి గణేశ్ నగర్లో పార్కును హైడ్రా కాపాడింది. 1979లో మొత్తం 176 ప్లాట్లతో సాయి గణేష్నగర్ లేఔట్ వేశారు. దాదాపు 450 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. ఇటీవల కొంతమంది వ్యక్తులు ఈ పార్కు స్థలంపై అనధికార గది నిర్మాణం చేపట్టారు. వారిని ప్రశ్నించిన కాలనీ వాసులను ఆక్రమణదారులు బెదిరించారు. కాలనీ నివాసితులు హైడ్రా కి ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు స్వీకరించిన హైడ్రా అధికారులు వెళ్లి పరిశీలించారు. పార్కు స్థలంపై చిన్న గది, గోడ వంటి అక్రమ నిర్మాణాలు ఉన్నట్టు గుర్తించారు. సంబంధిత వ్యక్తులు సమర్పించిన పత్రాలను పరిశీలించగా, ఆ నిర్మాణం సబ్రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదు కాని పూర్తిగా అక్రమ నిర్మాణం అని నిర్ధారించారు. హైడ్రా అధికారులు స్వయంగా ఆ అక్రమ గోడను తొలగించి, అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రాకు కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

- జిల్లా -గ్రంథాలయ సంస్థ చైర్మన్ 'కేడం'
- త్వరలో నూతన లైబ్రరీ ప్రారంభిస్తామని వెల్లడి



ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 19 : గ్రంథాలయాలు సాహిత్య,సాంస్కృతిక, సాంకేతిక పరిజ్ఞానానికి కేంద్రాలని, వాటిని పాఠకుల సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని హుస్నాబాద్ శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో బుధవారం కవి, గాయక సమ్మేళనం నిర్వహించారు. ఇటీవల మృతిచెందిన ప్రజాకవి అందెశ్రీ ఆత్మశాంతికి మౌనం పాటించి, నివాళులు అర్పించారు. అనంతరం కేడం లింగమూర్తి మాట్లాడుతూ హుస్నాబాద్ లో అతి త్వరలోనే అతి పెద్ద లైబ్రరీని ప్రారంభిస్తామని తెలిపారు. గ్రంథాలయాల వల్లనే సమాజంలో చైతన్యం వస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రంథాలయాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. పాఠకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే ఎన్నో పుస్తకాలు, మెటీరియల్ గ్రంథాలయాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం ప్రజాకవి గడిపె బాలయ్యను, రిటైర్డ్ ఉద్యోగి కుమార్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డీఎస్పీ అయిలేని శ్రీనివాసరెడ్డి, సీనియర్ న్యాయవాది చిత్తారి రవిందర్ ఎం.ఈ.ఓ. మనీలా, మాజీ ఎం.పి.పి. ఆకుల వెంకట్, మాజీ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనితాదేవి, జనజాగృతి అధ్యక్షులు ముక్కెర సంపత్ కుమార్, స్ఫూర్తి అధ్యక్షులు పందిళ్ళ శంకర్, కవులు, కళాకారులు, విద్యావేత్తలు అనగోని తిరుపతయ్య, తక్కళ్లపల్లి రాజు గోపాలావు, బి.లింగారెడ్డి, సీతారాంరెడ్డి, తిప్పర్తి శ్రీనివాసులు, తాడూరి సురేష్, కొలుగూరి అశోక్, మెడికల్ ఆఫీసర్ డా. మురళీకృష్ణ, కళ్ళెం లక్ష్మణ్, వేముల తిరుపతి రెడ్డి, K. నారాయణ, దూడం నాగభూషణం, బ్రాంచ్ లైబ్రేరియన్ చిట్యాల బాలయ్య, సహాయకురాలు నేరెళ్ల లావణ్య, పాఠకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ను సమర్ధవంతంగా నియంత్రించాలి

- జాయింట్ కమిషనర్ గజారావు భూపాల్

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, నవంబర్ 19 : ట్రాఫిక్ నియంత్రణను సమర్ధవంతంగా నియంత్రించాలని జాయింట్ కమిషనర్ గజారావు భూపాల్ అన్నారు. బుధవారం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలో నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ వద్ద చేపడుతున్న పనులను సైబరాబాద్ సంయుక్త కమిషనర్ గజారావు భూపాల్ (ఐపిఎస్), అదనపు డిసిపి వీరన్న, మేడ్చల్ ట్రాఫిక్ ఏసిపి వెంకటయ్య తదితర పోలీసు అధికారులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా జరుగుతున్న ఫ్లైఓవర్ పనుల పురోగతిని స్థానిక ట్రాఫిక్, పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ గజారావు భూపాల్ స్థానిక పోలీస్, ట్రాఫిక్ పోలీసులకు పలు సూచనలు చేశారు. ఫైవ్ ఓవర్ పూర్తి అయ్యేంతవరకు ట్రాఫిక్ నియంత్రణను సమర్ధవంతంగా నియంత్రించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సంయుక్త కమిషనర్ ను బాచుపల్లి పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు కలిసి తాము ట్రాఫిక్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.

“

సాగు తీరు మారాలి.. అన్నదాత బతుకు బాగుపడాలన్నదే తమ సంకల్పం. ఇవాళ 46.85 లక్షల మంది రైతులకు 'అన్నదాత సుఖీభవ..-పీఎం కిసాన్' కింద రెండు విడతల్లో కలిపి రూ.14 వేలు చొప్పున జమ చేశాం. అలాగే సీఎం చంద్రబాబు వ్యవసాయాభివృద్ధికి పంచసూత్రాలు ప్రకటించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ సాయం వంటి మార్గదర్శకాలు సూచించారు.

- ఏపీ మంత్రి నారా లోకేశ్

ఓపెన్ వాయిస్

ఉప ఎన్నికలకు పడుతున్న దారులు

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మీద సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన తర్వాత ఆసక్తికర చర్చ మొదలైంది. తెలంగాణ రాష్ట్రంలో గులాబీ పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి వెళ్లిన ఎమ్మెల్యేల పై వేటు పడటం ఖాయంగా కనిపిస్తోంది. ఎమ్మెల్యేల మీద వేటుపడితే తెలంగాణ రాష్ట్రంలో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయి. ఇటీవల పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో బీజేపీ ఎమ్మెల్యే అక్కడి అధికార పార్టీలో చేరారు. అతడి వ్యవహారం సుప్రీంకోర్టు దాకా వెళ్ళింది. సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. శాసనసభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది ఒక రకంగా గులాబీ పార్టీకి అనుకూలంగా మారింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల మీద గులాబీ పార్టీ పదే పదే సుప్రీంకోర్టు మెట్లు ఎక్కింది . దీంతో సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు ప్రకారం వారం రోజులలోగా తెలంగాణ స్పీకర్ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల వ్యవహారం మీద ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా స్పీకర్ ఎమ్మెల్యేల మీద వేటు వేస్తే, ఆ స్థానాలలో ఉప ఎన్నికలు వస్తాయి. ఉప ఎన్నికలలోనూ కచ్చితంగా ఆ ఎమ్మెల్యేలకు అధికార కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. ఇచ్చుకోవడం మాత్రమే కాదు వారిని గెలిపించుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గెలిచి జోరు మీద ఉన్న అధికార పార్టీ ఈ స్థానాలలో ఎలాంటి అస్త్రాలను ప్రయోగిస్తుంది? అనేది ఆసక్తికరంగా మారింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రతిపక్ష గులాబీ పార్టీ మొదట జోరు చూపించింది. ఆ తర్వాత రేవంత్ రెడ్డి ఎంట్రీ ఇవ్వడంతో ఒక్కసారిగా వెనక్కి తగ్గింది. ఆ తర్వాత పరిస్థితి మొత్తం మారిపోయింది. ఒకవేళ ఉప ఎన్నికలు వస్తే రేవంత్ రెడ్డి ఈసారి కూడా గులాబీ పార్టీ గతంలో చేసిన తప్పులను తెరపైకి తీసుకొచ్చే అవకాశం ఉంది. 2014 నుంచి మొదలుపెడితే 2023 వరకు గులాబీ పార్టీ అనేక పర్యాయాలుగా ఫిరాయింపులను ప్రోత్సహించింది. టీడీపీ నుంచి మొదలు పెడితే వామపక్షాల వరకు ఏ పార్టీని కూడా వదిలిపెట్టలేదు. ఒక రకంగా రాష్ట్రంలో ప్రతిపక్షం అనేది ఉండకుండా కేసీఆర్ చూసుకున్నారు. ఇదే విషయాన్ని రేవంత్ రెడ్డి ప్రజలలోకి తీసుకెళ్తారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటు పది నియోజకవర్గాలలో ఉప ఎన్నికలు రావాలని గులాబీ పార్టీకోరుకుంటుంటే, అధికార కాంగ్రెస్ కూడా అలానే భావిస్తోంది. ఒకవేళ ఈ స్థానాలలో గనక కాంగ్రెస్ గెలిస్తే అప్పుడు పరిస్థితి వేరే విధంగా ఉంటుంది. ఇప్పటికే జూబ్లీహిల్స్ ఎన్నికలలో ఓడిపోయి గులాబీ పార్టీ తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నది. ఉప ఎన్నికలలో అధికార పార్టీకి కాస్త అడ్వాంటేజ్ ఉంటుంది. అలాంటప్పుడు ఈ ఉప ఎన్నికలలో అయ్యే ఖర్చు గులాబీ పార్టీ భరిస్తుందా? జూబ్లీహిల్స్ మాదిరిగా పరిస్థితి ఎదురైతే ఏం చేస్తుంది? ఇప్పుడు ఈ ప్రశ్నలకే సమాధానం లభించాల్సి ఉంది. రాజీనామా చేయించే యోచనలో సీఎం తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే బీఆర్ఎస్ నేతలు త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది అని వ్యాఖ్యలు చేశారు. మళ్లీ కేసీఆర్ సీఎం అవుతారని బెదిరింపులకు దిగారు. దీంతో అలర్ట్ అయిన రేవంత్ రెడ్డి లోక్‌సభ ఎన్నికల సమయంలో ఫిరాయింపులకు తెర తీశారు. దానం నాగేందర్, కడియం శ్రీహరితో మొదలైన ఫిరాయింపులు పది మంది వరకు కొనసాగాయి. బీఆర్ఎస్ టికెట్ పై గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తర్వాత సుప్రీంకోర్టు తలుపు తట్టారు. విచారణ జరిపి త్వరగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు మూడు నెలల గడువు ఇచ్చింది. కానీ, ఇప్పటికీ విచారణ కాకపోవడంతో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో సుప్రీంకోర్టు స్పీకర్ మీద అగ్రహం వ్యక్తం చేసింది. దీంతో తెలంగాణ రాజకీయాలలో ఫిరాయింపు అంశం మళ్లీ వేడెక్కింది. పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. వారిలో కొంతమందికి మాత్రమే రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచన కాంగ్రెస్‌లో నెలకొంది. కానీ, ఈ వ్యూహంలో ప్రమాదం కూడా ఉంది. ఒకరిద్దరు ఓడిపోతే రాజకీయంగా నష్టం. అందరూ ఓడితే ప్రభుత్వ ఇమేజ్ దెబ్బతినే అవకాశాలు ఉన్నాయి. ఈ భయంలోనే సీఎం రేవంత్ రెడ్డి జాగ్రత్త పడుతున్నారని తెలుస్తోంది. ఫిరాయించినవారిలో ఏడుగురి ఎనిమిది మంది తాము ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నామని స్పీకర్‌కు స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఇదే సమయంలో విచారణ ఆధారంగా బీఆర్ఎస్ పిటిషన్‌ను తిరస్కరించే అధికారం స్పీకర్‌కు ఉంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
గురువారం
20.11.2025

ఖాకీ పవర్‌పై సోషల్ మీడియా పెత్తనం?!

పోలీస్ వ్యవస్థ తన గౌరవాన్ని నిలబెట్టుకోవాలంటే, ఈ సంఘటనపై తక్షణమే పారదర్శకంగా విచారణ జరపాలి. కేవలం 'వీడియో ఫేక్ కాదు' అని ధ్రువీకరించి వదిలేయకుండా, అనధికారిక వినియోగానికి కారణమైన ప్రతి ఒక్కరిపై (వీడియో తీసినవారు, అనుమతిచ్చిన సిబ్బంది) నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే, వ్యవస్థ జవాబుదారీతనాన్ని ప్రజలకు నిరూపించగలం. ఈ చర్యల ద్వారా, భవిష్యత్తులో ఏ ఒక్క అధికారి, సిబ్బంది కూడా ప్రభుత్వ వనరులను దుర్వినియోగం చేయడానికి సాహసించకుండా, వ్యవస్థాగత సంస్కరణలు ప్రారంభమవుతాయి.

ఫిరోజ్‌ఖాన్
9640466464

తెలంగాణ పోలీస్ యంత్రాంగం నేర నియంత్రణ విషయంలో అద్భుతమైన పట్టు సాధించినప్పటికీ, ఇటీవలే సామాజిక మాధ్యమాలలో వైరల్ అయిన పోలీస్ పెట్రోలింగ్ వాహనం దృశ్యం, వ్యవస్థాగత లోపాలను బహిర్గతం చేసింది. ప్రజల విశ్వాసాన్ని, పాలనా గౌరవాన్ని పెంపొందించాల్సిన ప్రభుత్వ వాహనం, వ్యక్తిగత ప్రచారానికి వేదికగా మారడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ధనం (ప్రభుత్వ ఆస్తి) అయిన పెట్రోలింగ్ మొబైల్‌ను వినోదం కొరకు వాడుకోవడం, నూతన భారతీయ న్యాయ సంహిత ఉద్దేశానికి వ్యతిరేకంగా, పాలనా వనరుల దుర్వినియోగానికి పాల్పడినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. దీనిని అనుమతించిన ప్రభుత్వ ఉద్యోగులపై నమ్మక ద్రోహం (నేరపూరిత విశ్వాస ఉల్లంఘన) నేరం కింద న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ చర్య అధికారాన్ని విధులకు విరుద్ధంగా వాడుకున్నట్లుగా, శిక్షార్హమైన ఉల్లంఘనగా పరిగణించబడుతుంది. ఇది కేవలం ఒక దృశ్యం కాదు, చట్టాన్ని అమలు చేసే ఖాకీ అధికారంపై సామాజిక మాధ్యమాల మోజు పెత్తనం చేయగలదా అనే ఆందోళన కలిగించే సంఘటనగా మారింది.

విజయం వెనుక విమర్శ

గత ఎనిమిది నెలలుగా, ఆదిలాబాద్ పోలీసులు వైట్ కాలర్ నేరాలు, అక్రమ వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ మోసాలపై ఉక్కుపాదం మోపి, జిల్లాలో పారదర్శక పాలనకు కృషి చేశారు. ఈ కృషి పట్ల ప్రజలలో ఏర్పడిన విశ్వాసం, ఒకే ఒక్క అంతర్గత నిర్లక్ష్యం వల్ల దెబ్బతింది. పోలీస్ మొబైల్ వాహనం పక్కన ఉండి యువకులు 'పవర్' చూపించడం, దాన్ని అప్‌లోడ్ చేయడం అనేది పోలీసు వ్యవస్థలో క్రమశిక్షణ లోపాన్ని సూచిస్తుంది. చట్టాన్ని పటిష్టం చేసే బాధ్యత గల వ్యవస్థే, దాని అంతర్గత నిబంధనలను ఉల్లంఘిస్తే, బయట నేరాలను ఎలా నియంత్రించగలదు? ఇది 'సొంత గుత్తిలో చిల్లు' పడినట్టే.

చట్ట అమలు దుస్తులు, చిహ్నాల గౌరవం

పోలీస్ పెట్రోలింగ్ వాహనం అనేది ప్రభుత్వ ఆస్తి. దీనిని వ్యక్తిగత లేదా వినోద కార్యకలాపాలకు అనధికారికంగా ఉపయోగించడం ప్రభుత్వ నిధులను, వనరులను దుర్వినియోగం చేయడమే. ఈ చర్య కొత్త భారతీయ న్యాయ సంహిత, 2023 స్ఫూర్తికి విరుద్ధం. పాత ఐపిసి లోని సెక్షన్లు ఈ అంశంపై పరోక్షంగా ప్రభావం చూపవచ్చు. చట్టాన్ని మరింత పటిష్టం చేయాలని ప్రభుత్వం ఆశిస్తుండగా, వ్యవస్థలోని సిబ్బంది అధికారిక వనరుల పట్ల నిర్లక్ష్యం వహించడం తీవ్రమైన నేరపూరిత విశ్వాస ఉల్లంఘన కిందికి వస్తుంది. దీనికి కారణమైన, అనుమతిచ్చిన సిబ్బందిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి. పోలీస్ వాహనంపై 'ఆదిలాబాద్ పోలీస్', 'PATROL MOBILE' వంటి గుర్తులు స్పష్టంగా ఉన్నాయి. చట్ట అమలు సంస్థల అధికారిక చిహ్నాలు, దుస్తులు, వాహనాలను కేవలం తమ అధికారిక విధులకు మాత్రమే వాడాలి. పాత ఐపిసి సెక్షన్ 171 (సెక్షన్ 182 - నకిలీ గుర్తులను ధరించడం లేదా ఉపయోగించడం) ప్రకారం, ఒకవేళ డ్యూటీ పట్ల ఉన్న బాధ్యతా రాహిత్యాన్ని స్పష్టం చేస్తుంది. సోషల్ మీడియాకు ఉన్న విస్తృత వ్యాప్తితో ఈ వీడియో తప్పుడు సందేశాన్ని వేగంగా సమాజంలోకి పంపింది. 'ఖాకీ పవర్' అంటే కేవలం సోషల్ మీడియాలో పోజులివ్వడం అనే అపోహను యువతలో కలిగించే ప్రమాదం ఉంది. నేరగాళ్లు చట్టమంటే భయం లేకుండా, పోలీసులను తేలికగా తీసుకునే వాతావరణం ఏర్పడవచ్చు. పోలీస్ ఉన్నతాధికారులు తమ సిబ్బంది సోషల్ మీడియా వినియోగంపై కఠినమైన మార్గదర్శకాలను తక్షణమే విడుదల చేయాలి. అధికారిక హోదాలో ఉన్నప్పుడు లేదా అధికారిక వనరులను వాడుతున్నప్పుడు పాటించాల్సిన క్రమశిక్షణ

అనధికారిక వ్యక్తులు పోలీస్ యూనిఫామ్ లేదా చిహ్నాలను తమ ప్రయోజనం కోసం ఉపయోగిస్తే, అది శిక్షార్హమైన నేరం అవుతుంది. పోలీస్ వాహనాన్ని తమ గ్లామర్ ప్రదర్శనకు వాడుకోవడం ద్వారా, వ్యవస్థ యొక్క గౌరవాన్ని, పవిత్రతను తగ్గించారు. ఈ చర్య వెనుక ఉన్న ఉద్దేశం వినోదం అయినప్పటికీ, చట్టపరంగా ఇది చాలా తీవ్రమైన అంశం.

వ్యవస్థపై ప్రజల విశ్వాసం, భద్రతా కోణాలు

పోలీస్ వాహనం రోడ్డుపై ఉందంటే, అది భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ విధులలో ఉన్నట్టు అర్థం. అలాంటి వాహనం అనధికారిక వీడియో షూటింగ్‌కు అందుబాటులో ఉంటే, ఆ సమయంలో ఆ పరిసర ప్రాంతాలలో పోలీస్ పర్యవేక్షణ లోపించినట్లే. అత్యవసర పరిస్థితులలో ప్రజలు పోలీసు సహాయం కోసం ప్రయత్నిస్తే, ఈ వాహనం ఆ స్థలంలో లేకపోవడం వల్ల ఏమైనా నష్టం జరిగితే, దానికి ఎవరు బాధ్యత వహిస్తారు. నిర్లక్ష్యం ప్రజల భద్రత పట్ల, నియమాలు మరింత పటిష్టంగా ఉండాలి.

జవాబుదారీతనం

పోలీస్ వ్యవస్థ తన గౌరవాన్ని నిలబెట్టుకోవాలంటే, ఈ సంఘటనపై తక్షణమే పారదర్శకంగా విచారణ జరపాలి. కేవలం 'వీడియో ఫేక్ కాదు' అని ధ్రువీకరించి వదిలేయకుండా, అనధికారిక వినియోగానికి కారణమైన ప్రతి ఒక్కరిపై (వీడియో తీసినవారు, అనుమతిచ్చిన సిబ్బంది) నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే, వ్యవస్థ జవాబుదారీతనాన్ని ప్రజలకు నిరూపించగలం. ఈ చర్యల ద్వారా, భవిష్యత్తులో ఏ ఒక్క అధికారి, సిబ్బంది కూడా ప్రభుత్వ వనరులను దుర్వినియోగం చేయడానికి సాహసించకుండా, వ్యవస్థాగత సంస్కరణలు ప్రారంభమవుతాయి.

(వ్యాస రచయిత సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

మొక్కజొన్న రైతుకు దళారీ ఉచ్చు!

జి. అజయ్ కుమార్
9676404318

తెలుగు రాష్ట్రాలలో ఈసారి మొక్కజొన్న సాగు భారీగా పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో 6.8 లక్షల ఎకరాలు, తెలంగాణలో 8.2 లక్షల ఎకరాలలో మొత్తం 14 లక్షల ఎకరాలలో మొక్కజొన్న సాగైంది. దిగుబడులు కూడా ఆశించిన స్థాయిలో ఉన్నాయి. ఈసారి లాభాలు తప్పకుండా వస్తాయని ఆశించిన రైతులకు ప్రస్తుత పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వం క్వింటాలుకు 2,400గా మద్దతు ధర ప్రకటించినా అది అందడం లేదు. వివిధ కారణాలతో మార్కెట్ లో రైతుకు ఇస్తున్న ధర 1,850 - 2,050 మాత్రమే. ఇది కేవలం సాధారణ ధర వ్యత్యాసం కాదు. క్వింటాకు 350 నుంచి 550 వరకు నష్టం. దీనిని 14 లక్షల ఎకరాల సాగుకు లెక్కిస్తే వేల కోట్ల రూపాయలు నష్టాన్ని మిగిలిస్తున్నాయి. ప్రభుత్వం మద్దతు ధరని ప్రకటించి చేతులు దులుపుకుంది. కానీ, పంట కొనుగోలు కేంద్రాలు మాత్రం ప్రారంభం కాలేదు. గిట్టుబాటు ధర దొరకకపోయినా, రైతు పంటను నిల్వ చేసుకొనే సౌకర్యం లేదు. ఇటు అకాల వర్షాలు, తుఫానుల ముప్పు. వర్షం పడితే తేమ శాతం పెరిగి పంట నాణ్యత మరింత దెబ్బతింటుంది. ఈ బలహీన పరిస్థితులనే దళారులు తమ ఆయుధాలుగా మలచుకుంటున్నారు, రైతులను భయభ్రాంతులకు గురిచేసి తక్కువ ధరలకే కొనుగోలు చేస్తున్నారు. ఇది రైతుకు తీరని నష్టాన్ని కలుగజేస్తోంది.

తేమ శాతం – రైతుకు శాపం

పంటలో 14 శాతం తేమ అనే నిబంధన రైతుకు శాపంగా మారింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో ఈ తేమ శాతం సాధ్యం కాదని రైతులు మొత్తుకుంటున్నా, ప్రైమరీ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీలు, మార్కెట్ యార్డులు పంటను తిరస్కరిస్తున్నాయి. ఈ నిబంధనను అదునుగా చూసుకున్న వ్యాపారులు రోజుకో 50-₹100 చొప్పున ధర తగ్గిస్తూ కొనుగోలు చేస్తున్నారు. మొక్కజొన్న పంట పౌల్ట్రీ దాణాకు కీలకం. తెలంగాణ-ఆంధ్రలో తవున్న పెద్ద పెద్ద ఫీడ్ మిల్లులే ధరలను కృత్రిమంగా నియంత్రిస్తున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ధరలు పడిపోవడాన్ని అడ్డుకునే ప్రభుత్వ జోక్యం ఎక్కడా కనిపించకపోవడంతో, పెద్ద కంపెనీల ఒత్తిడి వెనక కుట్ర ఉందనే రైతులలో అనుమానాలు మరింత పెరిగాయి. ధరలు పతనమవుతున్నాయి, దళారుల దోపిడీ పెరుగుతోంది, రైతు కన్నీరు పెడుతున్నాడు, అయినా, మార్కెటింగ్ శాఖ తరఫున తనిఖీలు? పర్యవేక్షణ? దాడులు? ఏదీ ఎక్కడా లేవు. రైతులు రోడ్ల మీదకు వచ్చి ఆవేదన వ్యక్తం చేస్తున్నా, బాధ్యత గల ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం రైతుల ఆవేదనను మరింత రెట్టింపు చేస్తోంది.

ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు

మద్దతు ధర ప్రకటించిన తర్వాత కూడా ప్రభుత్వాలు కొనుగోలు కేంద్రాలు ఎందుకు ఏర్పాటు చేయలేదు? ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటే ధరలు కృత్రిమంగా పడిపోయే అవకాశం ఉంటుందా? తేమ శాతం సమస్యలో రైతుకు ఎందుకు మినహాయింపు ఇవ్వడం లేదు? దళారుల దందాపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? పౌల్ట్రీ కంపెనీల ఒత్తిడి మీద నియంత్రణ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? వంటి ప్రశ్నలు ప్రతీ మొక్కజొన్న రైతు మదిలో మెదులుతున్నాయి. ప్రభుత్వం వెంటనే దృష్టిసారించి తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వెంటనే యుద్ధప్రాతిపదికన ప్రతి మండలానికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, పంట కొనుగోళ్లు మొదలు పెట్టాలి. తేమ శాతం సడలించాలి. 14 శాతం నిబంధన రైతుకు అన్యాయం. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, 17-18 శాతం వరకు అనుమతి తప్పనిసరి చేయాలి. దళారుల దోపిడీపై చర్యలు తీసుకోవాలి. కృత్రిమ ధరల పతనాన్ని నిరోధించేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి, దళారుల దందాపై ఉక్కుపాదం మోపాలి.

కంపెనీల నియంత్రణ

మార్కెట్ ధరలలో పెద్ద కంపెనీల ఆధిపత్యాన్ని నివారించడానికి కఠిన నియంత్రణ వ్యవస్థ తీసుకురావాలి. న్యాయం మాటలలో కాదు, మార్కెట్‌లో దక్కినప్పుడే అన్నదాతకు నిజమైన న్యాయం జరిగినట్టు. రైతే రాజు అని చెప్పడం సులువు కానీ వాస్తవ పరిస్థితులలో రైతుకు న్యాయం జరుగుతున్న సంఘటనలు చాలా తక్కువగా వుంటున్నాయి. దీనికి కారణం నిబంధనలు మాత్రమే కాదు ప్రభుత్వ వైఫల్యాలు కూడా. ఉత్పత్తి పెరిగిన సంవత్సరంలో కూడా రైతుకు నష్టాలు రావడం మార్కెట్ వైఫల్యం మాత్రమే కాదు. ప్రభుత్వ వైఫల్యం కూడా ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని రైతులకు న్యాయం చేయాలని కోరుకుందాం.

(వ్యాస రచయిత వ్యవసాయ నిపుణుడు)

ప్రమాదంలో అమాయక హృదయాలు

మలిపెద్ది పవన్
7093052815

మన సమాజం ఇప్పుడు ఒక సున్నితమైన దశలో ఉంది. పిల్లలు ప్రేమలో పడి చనిపోతున్నారనే వార్తలు చదవడం అంటే మనం ఎక్కడో విఫలమయ్యామనే అర్థం. ప్రేమను అర్థం చేసుకునే వయసు వచ్చే వరకు పిల్లలకు రక్షణ, మార్గనిర్దేశనం అవసరం. ప్రేమించేముందు జీవితాన్ని తెలుసుకోవాలి. ప్రేమకన్నా విలువైనది మన భవిష్యత్తు అని గ్రహించాలి. ఇటీవల బాలబాలికలలో కనిపిస్తున్న కొత్త ఆందోళనాత్మక ధోరణి ఏమిటంటే ప్రేమ పేరుతో అమాయక హృదయాలు నాశనం అవుతున్నాయి. తెలియని వయసులో ఆకర్షణను ప్రేమగా భావించి, తల్లిదండ్రుల మందలింపుతో ప్రాణాలు తీసుకునే సంఘటనలు పెరుగుతున్నాయి. పెద్దల గద్దింపుతో తల్లిదండ్రులపై దాడి చేసే ఘటనలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. హైస్కూల్, ఇంటర్ స్థాయి విద్యార్థులు చాటింగ్, సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకొని భావోద్వేగాల బంధనంలో చిక్కుకుంటున్నారు. మొదట స్నేహం, తర్వాత ఆకర్షణ, చివరికి ఆ ప్రేమను అడ్డుకుంటే ఆవేశంతో ఆత్మహత్య చేసుకునే స్థితికి చేరుతున్నారు.

సోషల్ మీడియా ప్రభావం

ఈ కాలంలో పిల్లల చేతులలో మొబైల్ తప్పనిసరి పరికరమైంది. కానీ, అదే ఇప్పుడు వారి జీవితాలను ప్రమాదంలో పడేస్తోంది. రాత్రిపూట చాటింగ్‌లు, రీల్స్, ఫ్రెండ్ రిక్వెస్టులు ఇవి చిన్న వయసులో మనసును మాయ చేస్తాయి. ప్రేమ అనే పదం అంటే ఏమిటో కూడా తెలియకముందే పిల్లలు అదే జీవితమని భావిస్తున్నారు. పాఠశాలలు లేదా ఇంటిలో అవగాహన లోపం వల్ల పిల్లలు భావోద్వేగాలను నియంత్రించలేకపోతున్నారు. ఒకరి ప్రేమకు పెద్దలు వ్యతిరేకిస్తే, 'నా ప్రేమను అడ్డుకున్నారు' అనే తప్పు భావనతో ఆత్మహత్య చేసుకునే ఘటనలు పెరుగుతున్నాయి. చాలామంది తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడటానికి సమయం కేటాయించడం లేదు. పిల్లలు ఏం అనుకుంటున్నారు! వారు ఎవరితో మాట్లాడుతున్నారు! వారి మానసిక స్థితి ఏమిటి? ఈ విషయాలపై దృష్టి పెట్టడం లేదు. దీని ఫలితంగా పిల్లలు ఇంటిలో ఒంటరితనాన్ని అనుభవిస్తున్నారు. ఆ ఖాళీని నింపే ప్రయత్నంలో తప్పు సంబంధాలకు లోనవుతున్నారు.

సినిమాలు, సిరీస్‌ల తప్పుడు సందేశం

సోషల్ మీడియా, సినిమాలు ప్రేమను ఆకర్షణీయంగా చూపించడం కూడా చిన్న వయసులో మతి పోగొట్టే స్థాయిలో ఉంది. 'ప్రేమ కోసం ఏమైనా చేస్తాం' వంటి డైలాగులు తాత్కాలిక భావనను శాశ్వత నిర్ణయంగా మార్చేస్తున్నాయి. దీని వలన కూడా అనేక విషాదాలు



చోటు చేసుకుంటున్నాయి. తల్లిదండ్రులు స్నేహితుల వలె ఉండాలి. పిల్లలతో మాట్లాడి వారిని అర్థం చేసుకోవాలి. గద్దించకుండా ప్రేమగా దారిచూపాలి. పాఠశాల స్థాయిలో కౌన్సెలింగ్ తప్పనిసరి చేయాలి. మానసిక ఆరోగ్యం, భావోద్వేగ నియంత్రణ, బాధ్యతా సంబంధాలపై అవగాహన క్లాసులు అవసరం. మొబైల్ వినియోగంపై నియంత్రణ ఉండాలి, పిల్లలకు అన్‌లిమిటెడ్ యాక్సెస్ ఇవ్వకూడదు. సమయ పరిమితులు పెట్టాలి. సోషల్ మీడియాపై అవగాహన పెంచాలి. ఏ వీడియోలు చూడాలి, ఏ ఫ్రెండ్ రిక్వెస్టులు అంగీకరించాలనే దానిపై మార్గనిర్దేశనం చేయాలి. ప్రేమలో విఫలమయ్యామని ప్రాణం తీసుకోవడం సమస్య పరిష్కారం కాదని వారిని స్పష్టంగా చెప్పాలి. తల్లిదండ్రులు, గురువులు లేదా కౌన్సెలర్‌తో మాట్లాడడం ద్వారా ఏ సమస్యనైనా ఎదుర్కోవచ్చు. చిన్న వయసులో ప్రేమ అనిపించే భావన తాత్కాలికం మాత్రమే అని పిల్లలకు అర్థం అయ్యేలా వివరించాలి.

(వ్యాస రచయిత జర్నలిస్ట్, గుండాల)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

పౌరుల సహకారం కీలకం

- ప్రజలు సహకరిస్తేనే నేరాలను తగ్గించగలం
- యూరిన్ కిట్స్ తో గంజాయి బ్యాచ్ కు చెక్
- మహిళలకు పూర్తి భరోసా, తగిన రక్షణ
- డ్రంక్ అండ్ డ్రైవ్ పై పోలీసుల ప్రత్యేక దృష్టి
- 'ప్రతిపక్షం' ఇంటర్వ్యూలో కరీంనగర్ సీపీ గౌస్ ఆలం

వడ్లకొండ సదానందం

ప్రతిపక్షం బ్యూరో, ఉమ్మడి కరీంనగర్, నవంబర్ 19: కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంతో 'ప్రతిపక్షం' దిన పత్రిక ప్రత్యేక ఇంటర్వ్యూ చేసింది. ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి నివారణ, మహిళల భద్రత, షీ టీమ్, సైబర్ నేరాల అరికట్టడి, ట్రాఫిక్ నియంత్రణ, డ్రంక్ అండ్ డ్రైవ్ లాంటి పలు అంశాల పై సుధీర్ఘాంగా ఇచ్చారు. గంజాయి, మహిళల భద్రత, సైబర్ నేరాలు -నియంత్రణ పై ప్రత్యేక దృష్టి పెట్టమని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో గంజాయి నిర్మూలన నుంచి మహిళల భద్రత, సైబర్ నేరాల అరికట్టడం వరకు తమ దృష్టి ఉందని తెలిపారు. గంజాయి నిర్మూలన, మాదక ద్రవ్యాలపై పోలీసులు యుద్ధ స్థాయిలో చర్యలు తీసుకుంటున్నారని గౌస్ ఆలం స్పష్టం చేశారు. 'గంజాయి సరఫరా చేసే వారిని మాత్రమే కాదు, దాచేవారిని, ప్రోత్సహించేవారిని కూడా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని అన్నారు. షీ టీమ్‌ల పనితీరును మరింత బలోపేతం చేస్తున్నామని, కాలేజ్‌లు, బస్‌స్టాండ్లు, పబ్లిక్ స్థలాల్లో హరాస్మెంట్‌పై ప్రత్యేక పహారా నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళల నుండి వచ్చే ప్రతి ఫిర్యాదుని అత్యంత సీరియస్‌గా తీసుకుంటామని స్పష్టం చేశారు.

సైబర్ నేరాల మీద

సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక శిక్షణ పొందిన సైబర్ వింగ్‌ను బలోపేతం చేశామని సీపీ చెప్పారు. ప్రజలు ఓటీపీ లు, బ్యాంక్ వివరాలు ఎవరికీ చెప్పొద్దని, అవగాహన కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయని వివరించారు. ట్రాఫిక్ నియంత్రణ, డ్రంక్ అండ్ డ్రైవ్:ట్రాఫిక్ వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి సాంకేతిక పరికరాలను, సీసీ కెమెరాలను వినియోగిస్తున్నట్టు చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై సున్నా పొరపాటు విధానంలో కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నామని అన్నారు. "చట్టం అందరికి సమానం... ప్రాణాలకు ప్రమాదం కలిగించే డ్రైవింగ్‌ను సహించం" అని ఆయన హెచ్చరించారు. పౌరుల సహకారం కీలకం:"పోలీసుల ఒక్కరితో సాధ్యం కాదు... ప్రజలు సహకరిస్తేనే నేరాలను పూర్తిగా తగ్గించగలం" అని కమిషనర్ గౌస్ ఆలం చెప్పారు.

ప్రతిపక్షం: గంజాయి సరఫరాపై మీరు ఏ చర్యలు తీసుకుంటున్నారు?

సీపీ : కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పర్యవేక్షణలో సుమారు 133.8 కిలోగ్రాముల గంజాయిను పోలీసులు స్వాధీనం చేసుకుని దహనం చేశారు.కమిషనర్ గౌస్ ఆలం ఆధ్వర్యంలో అధికారులు డ్రగ్స్ రవాణా (అరికట్టేందుకు చెక్‌పోస్ట్‌లను పెంచారు.. అంతరరాష్ట్ర గంజాయి రవాణాదారుల గ్యాంగ్ అరెస్ట్ కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ఒక ఇంటర్‌స్టేట్ గంజాయి పేడ్లర్ గ్యాంగ్‌ను పోలీసులు పట్టుకున్నారు. కొత్తగా యూరిన్ కిట్ల తో గంజాయి బ్యాచ్ లను పట్టుకునే పనిలో పడ్డామ్.

'షీ-లీడ్స్' స్ఫూర్తి: మహిళా బ్లూ కోల్ట్స్ విప్లవం - కరీంనగర్‌లో వినూత్న పోలీసింగ్ తీరు?

'మేమున్నాం' అనే ధైర్యాన్ని, భరోసాను కేవలం మాటల్లో కాదు, చేతల్లో చూపిస్తున్నారు కరీంనగర్ పోలీసు కమీషనరేట్‌లోని మహిళా పోలీసులు. పోలీసు శాఖలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతూ, కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ఆలం వినూత్నమైన 'షీలీడ్స్' శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేవలం ఆఫీస్ విధులకే పరిమితం కాకుండా, మహిళా పోలీసులను 'విజిబుల్ పోలీసింగ్'లో ముఖ్య భాగస్వామ్యం చేసేందుకు వారికి 'బ్లూ కోల్ట్స్' విధులు కేటాయించడం, ఈ ఆలోచన ఇప్పటికే సత్ఫలితాలనిస్తోంది. ప్రజలకు భద్రతపై మరింత దృఢమైన నమ్మకాన్ని కల్పించడంలో మహిళా బ్లూ కోల్ట్స్ కీలకపాత్ర పోషిస్తున్నారు.అయితే క్షేత్ర స్థాయిలో సంఘటనలు ఎదురైనపుడు సమర్ధవంతంగా ఎదుర్కొనేలా మహిళా పోలీసులను తీర్చిదిద్దడం ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశం అని సీపీ తెలిపారు.

క్షేత్ర స్థాయిలో ఎదుర్కొనే సవాళ్లకు సమగ్ర శిక్షణ

పోలీసు శాఖలో విధులు నిర్వహించాలంటే శారీరక ధృడత్వంతో పాటు మానసికంగా కూడా ధృడంగా ఉండాలని, మనల్ని మనం రక్షించుకునే స్థితిలో ఉన్నపుడే ప్రజలను రక్షించగలం' అని సీపీ గౌష్ ఆలం ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. ఈ నినాదానికి అనుగుణంగానే, దాదాపు 100 మంది మహిళా పోలీసులకు (షీ టీమ్స్ సభ్యులతో సహా) రెండు దశల్లో కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో ప్రత్యేక శిక్షణను అందిస్తున్నామని తెలిపారు.

మహిళా పోలీసులకు కరాటే (అన్ ఆర్మ్డ కంబాట్ కోర్స్) ఇస్తున్నారు ఎందుకు?

ఎస్ ఆత్మరక్షణ విద్యలో సుశిక్షితులుగా తీర్చిదిద్దడం ఈ శిక్షణ ప్రధాన లక్ష్యమని, వీరు తమను తాము రక్షించుకోవడమే కాక, ఆపదలో ఉన్న పౌరులకు రక్షణ కల్పించేలా వీరికి శిక్షణ అందిస్తున్నాం.

ప్రతిపక్షం: * నిరసనకారుల నిర్వహణపై శిక్షణ గురించి?

ధర్నాలు, నిరసనల్లో ముఖ్యంగా మహిళా నిరసనకారులను తరలించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు మెళకువలు పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ సున్నితమైన అంశాలను ఎలా సమర్థంగా, మానవీయంగా నిర్వహించాలో నేర్పిస్తున్నాం.

మానసిక ఒత్తిడి అధిగమనం పై వివరిస్తారా?

కఠినమైన క్షేత్ర స్థాయి విధుల్లో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేందుకు, పోలీసులకు మానసిక ధృఢత్వాన్ని పెంచేలా ఈ శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించామని సీపీ తెలిపారు.

నేరాలను తగ్గించే ప్రక్రియ ఏ విధంగా చేపట్టారు?

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది, ఈ అదాలత్ ద్వారా మొత్తం 1280 కేసులను సామరస్యంగా పరిష్కరించడం జరిగింది.

ఇంటర్-డిస్ట్రిక్ట్ దొంగల పట్టుకోవడంలో మీ విధానం?

సీపీ : కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ నేతృత్వంలో ఇంటర్‌జిల్లా దొంగలను అరెస్ట్ చేశారు. వారు బంగారం, వెండి ఆభరణాలు, నగదు, ఇతర విలువైన వస్తువులు దొంగిలించారని పోలీసులు తెలిపారు.

సీర్ట్ మరియు డ్రగ్ ప్రమాదాలపై చెప్పండి?

71 వాహనాలు స్వాధీనం చేశారు — సీర్ట్ మరియు డ్రగ్ ప్రమాదాలపై హెచ్చరిస్తూ భారీ కార్డన్,సెర్చ్ ఆపరేషన్ ద్వారా 71 వాహనాలు (బైక్లు, ఆటో, కార్లు) వాటికి కావలసిన డాక్యుమెంట్లు లేనటు వంటివి స్వాదీనం చేశారు.

సైబర్ నేరాల గురించి మీరు తీసుకున్న నిర్ణయాలు?

: సైబర్ నేరాల గురించి ప్రజల్లో జాగృతి పెంచాలనే సందేశాన్ని కూడా ఆయన ఇచ్చారు "సైబర్ నేరం జరిగితే 1930 నుండి ఫోన్ చేయండి" అని సూచించారు.

"5ఎస్ " సిస్టమ్‌ను అమలు చేయడం ఎలా మొదలుపెటారు?

కరీంనగర్ పోలీస్ స్టేషన్లలో "5ఎస్ " (Sort, Set in order, Shine, Standardise, Sustain) విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానం ద్వారా ఫైల్స్ నిర్వహణను మెరుగుపరచడం, స్టేషన్‌లలో పెట్టడం, అవగాహన పెంచడం లాంటి అంశాలపై దృష్టి కేంద్రీకరించారు. ఇది పోలీసుల పనిభారాన్ని సమర్థంగా నిర్వహించడంలో, స్టేషన్‌ల వాతావరణాన్ని ప్రజలకు "స్వచ్ఛమైన, సౌకర్యవంతమైన" గా మార్చడంలో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు.

సైకిల్ ర్యాలీ – పోలీస్ వీరుల స్మరణార్థం

పోలీస్ మరణించిన వీరులను స్మరించేందుకు 20 కిమీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సీపీ గౌస్ ఆలం ఈ కార్యక్రమాన్ని ఫ్లాగ్ ఆఫ్ చేశారు. ఈ ర్యాలీలో స్కూల్ విద్యార్థులు, సైక్లిస్టులు, సమాజ నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పెరుగుదల

కరీంనగర్‌లో సైబర్ నేరాల నమోదుల సంఖ్య గతేడాది పెరిగినట్లు పోలీసులు వెల్లడించారు. 2024లో నమోదైన సైబర్ నేరాల కేసులు మొత్తం క్రైమ్ రేట్లో చాలా భాగాన్ని ఆక్రమించాయి.

చోరీలు, దొంగల అరెస్ట్ లు గురించి?

న్యాయపాలకంగా పరిశీలించాలంటే, ఇటీవల 6 మంది దొంగలను అరెస్ట్ చేసి, రూ. 20 లక్షల విలువైన సొత్తులు స్వాధీనం తీసుకున్నట్లు కరీంనగర్ పోలీసులు తెలిపారు. వారి అప్పటి విచారణలో వారు సుమారు 15 నేరాల కోసం బాధ్యులని ఒప్పుకున్నారు, పౌరుల సహకారం కీలకం:"పోలీసుల ఒక్కరితో సాధ్యం కాదు... ప్రజలు సహకరిస్తేనే నేరాలను పూర్తిగా తగ్గించగలం" అని కమిషనర్ గౌస్ ఆలం చెప్పారు.

శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రతిపక్షం,మొయినాబాద్, నవంబర్ 19 : శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు.మొయినాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ లో గల శ్రీ స్వామి నారాయన్ గురుకుల్ ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించిన గురుకుల్ ఒలంపిక్స్ ఆటల పోటీలను రాష్ట్ర ఐటీశాఖ, జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య, యూనియన్ మాజీ మంత్రి వేణుగోపాల చారితో కలిసి జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు.హైదరాబాద్‌లోని అతి పెద్ద, ప్రతిష్టాత్మకమైన ఇంటర్‌స్కూల్ క్రీడల పోటీ, శ్రీ స్వామినారాయణ గురుకుల ఆధ్వర్యంలో జరుగుతుంది. ఈ వార్షిక క్రీడా మహోత్సవం విస్తృతమవుతూ, ఈ సంవత్సరం 153 పాఠశాలలు, 14,162 మందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గురుకుల ట్రస్ట్ గత 77 సంవత్సరాలుగా దేశపు వారసత్వం, సంస్కృతి, విలువలను కాపాడుతూ సేవలందిస్తున్న గౌరవనీయ లాభాపేక్షలేని సంస్థ,దేశవ్యాప్తంగా విదేశాల్లో 65 క్యాంపస్‌లలో, 1,25,000 కంటే ఎక్కువ మంది విద్యార్థులను విద్య , నైతిక విలువలతో తీర్చిదిద్దుతోందన్నారు.భారతదేశంలో హైదరాబాద్, బెంగళూరు, ముంబై, ఢిల్లీ, విజయవాడ, విశాఖపట్నం, నాగ్‌పూర్,రాయ్‌పూర్, అహ్మదాబాద్, సూరత్ తో పాటు యూఎస్ఎ, యూకే, కెనడా, ఆస్ట్రేలియాలలో కూడా గురుకుల్ శాఖలు ఉన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అందెశ్రీ సంతాప సభలో కనకమామిడి యువకులు

- పాశం యాదగిరితో కలిసి నివాళులు ఘటించిన కనకమామిడి సన్నీ, శ్రీధర్

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 19: ఇటీవల మృతిచెందిన రాష్ట్ర గీత రచయిత,ప్రముఖ కవి అందెశ్రీ సంతాప సభ బుధవారం ఘట్ కేసర్ లోని అవుషాపూర్ లో నిర్వహించారు.మొయినాబాద్ మండలం కనకమామిడి గ్రామానికి చెందిన కనకమామిడి సన్నీ,అడ్వకేట్ శ్రీధర్ అందెశ్రీ సంతాప సభలో పాల్గొని తెలంగాణ ఉద్యమకారుడు పాశం యాదగిరితో కలిసి నివాళులు ఘటించారు.ఈ సందర్భంగా పాశం యాదగిరి మాట్లాడుతూ..అందెశ్రీ మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశాడు.తెలంగాణ సమాజానికి,సాహిత్యానికి అందెశ్రీ మరణం తీరని లోటన్నారు.ఆయన రాసిన 'జయ జయహే తెలంగాణ ' గీతం రాష్ట్ర ఉద్యమ సమయంలో కోట్లాది మందికి స్ఫూర్తినింపి నేడు మరణించాక కూడా బ్రతికే ఉన్నాడని ఆయన కొనియాడారు,

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలి

- టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతిపత్రం
- త్వరలో డిఈవో ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తాం

ప్రతిపక్షం, రంగారెడ్డి జిల్లా, నవంబర్ 19: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు జర్నలిస్టులు భారీగా హాజరయ్యారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు గణేష్, ప్రధాన కార్యదర్శి సైదులు, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, మణి కుమార్, రాందాస్, జిల్లా సహాయ కార్యదర్శులు ప్రభాకర్, నర్సింహ్మ, నేషనల్ కౌన్సిల్ సభ్యులు దేవేందర్ , రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఖాజా పాషా, శ్రీనివాస్, తదితరుల తో కలిసి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు అని, జర్నలిస్టులకు నూతన అక్రిడేషన్ కార్డులను ఇవ్వాలని అదేవిధంగా ఇల్లు స్థలాలు హెల్త్ కార్డులు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ కు విన్నవించారు.

ఫీజు రాయితీ ఇవ్వని పాఠశాలపై కఠిన చర్యలు: జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

రంగారెడ్డి జిల్లా పరిధిలో పనిచేస్తు అక్రిడేషన్ కలిగివున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో 50% ఇవ్వాలని గతంలోనే ఆదేశాలు జారీ చేశామని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. త్వరలోనే డిఇఓతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి జర్నలిస్టుల పిల్లలకు స్కూళ్లలో ఫీజు రాయితీ ఇవ్వటానికి నిరాకరిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చారు. జర్నలిస్టులు తమ పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో రాయితీ దక్కని పక్షంలో నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. రాయితీ నిరాకరించిన పాఠశాలలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు చిలువేరు యాదగిరి, జగన్, షాద్నగర్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు రాఘవేందర్, గౌడ్ నరేష్, చేవెళ్ల అధ్యక్షులు రాజు , మహేశ్వరం అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహా, సురేందర్, రాజేందర్ నగర్ అధ్యక్షులు గోపాల్, ఎల్ బి నగర్ అధ్యక్షులు శ్రీ రాములు, జిల్లా ప్రచార కార్యదర్శి నరసింహ రెడ్డి, షాద్నగర్ డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు ఆంజనేయులు గౌడ్ , సాయినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

డబ్బింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ కార్తీక వనభోజనాలు

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 19 : డబ్బింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీకమాసం సందర్భంగా కార్తీక వనభోజనాలు, క్రీడా పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మొయినాబాద్ మండల పరిధిలోని ఎన్కేపల్లి లో గల మెలిగిరి క్రికెట్ గ్రౌండ్ లో టీవీ డబ్బింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వర్మ, గౌతమ్, ఆర్.సి.ఎం.రాజు, అలాగే సినిమా డబ్బింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోగినేని ప్రసాద్ సెక్రటరీ సాహితీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేఎల్ గ్రూప్ సి.ఎండి.కొనతం లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబ్బింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ వారు మ్యూజిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కుజ్జుద్ ద్వారా వారు నన్ను కలిసి ఈ కార్యక్రమానికి మీ సహాయ సహకారాలు అందించాలని నన్ను సంప్రదించారని, వారు చేస్తున్న ఇంత మంచి కార్యక్రమంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారని, క్రీడాలతో మానసికంగా ఉల్లాసంగా ఆరోగ్యంగా ఉంటామని ఆయన పేర్కొన్నారు. ఈ సంఘంలో దాదాపు 800 మంది ఉన్నారని అందరూ కలిసి మంచి కార్యక్రమాన్ని నిర్వహించారని ఆయన తెలిపారు. ఇలాంటి కార్యక్రమానికి మా సహాయక సహకారాలు అందిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. కేఎల్ గ్రూప్ ఆధ్వర్యంలో త్వరలో కేఎల్ క్రికెట్ లీగ్ ప్రారంభించబోతున్నామని ఆయన తెలిపారు. కొద్ది రోజుల క్రితమే యాదగిరిగుట్టలో 40 ఎకరాలలో విల్లా ఫ్లాట్స్ ప్రారంభించామని, అక్కడే ఒక క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు చేసి కేఎల్ క్రికెట్ లీగ్ ద్వారా సినిమా తారలు, టీవీ తారలు, డబ్బింగ్ మ్యూజిక్ సింగర్స్ సెలబ్రిటీలతో తొందర్లోనే కేఎల్ లీక్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించబోతున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ లలిత రాజ్, ట్రెజరర్ వినోద్ కుమార్ రాజు, ఆర్గనైజర్ సెక్రటరీ చిల్లా శ్యాంసుందర్ రెడ్డి, ఈసీ మెంబర్స్ పి.అనురాధ, అడప సాయి ప్రసాద్, జి.సమర సింహారెడ్డి, ఇ.అనిల్ కుమార్ (ఆర్యన్), మాడ సునీల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంటుపై ప్రశ్నిస్తే చంద్రబాబు సహనం కోల్పోతున్నారు. బాధ్యత గల సీఎం స్పందించాల్సిన విధానమిదేనా?. డొంకతిరుగుడు సమాధానాలు మాని ప్రైవేటుపరం కానివ్వమని ఎందుకు చెప్పడం లేదు. సీఎం వైఖరిపై అనుమానాలున్నాయి. అటు ప్రభుత్వ పెద్దలు, పోలీసు వ్యవస్థ తెచ్చిన ఒత్తిడితోనే పరకామణి కేసు ఫిర్యాదుదారు సతీశ్ చనిపోయి ఉంటాడు.

- వైసీపీ నేత బొత్స సత్యనారాయణ

ప్రాంతీయం

గతంలో అప్పు చేశారు.. అభివృద్ధి లేదు

- మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి
- ఎమ్మెల్యే వేముల

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 19: ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మహిళలకు ఉచిత బస్సు, వడ్డీ లేని రుణాలు అందిస్నున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో రూ. 8 లక్షల కోట్లు అప్పు చేశారని, అయినా తెలంగాణ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. పేదలకు సన్నబియ్యం ఇస్తున్నం... ఇందిరమ్మ ఇండ్లను కూడా దశల వారీగా కేటాయిస్తామని, ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే పేదలకు ఉపయోగపడే విధంగా ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షల వరకు పెంచామని తెలిపారు. నల్గొండ జిల్లా కట్టంగూరు తాహసిల్దార్ కార్యాలయంలో మండలంలోని లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... త్వరలో నకిరేకల్ లో 100 పడకల ఆసుపత్రి ప్రారంభిస్తామని, 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. ఉపాధి హామీ పథకం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తీసుకువచ్చిందే... నని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వయో వృద్ధులు సమాజానికి జ్ఞాన బండాగారాలు

- కలెక్టర్ పి ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 19 : వయోవృద్ధులు సమాజానికి జ్ఞాన బండాగారాలు అని జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్లో జిల్లా మహిళా శిశు, వయోవృద్ధులు, వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలు 2025 ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య ,అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన తో ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ వయోవృద్ధులు మన సమాజానికి అపారమైన జ్ఞాన భాండాగారం. వారి అనుభవాలు, మార్గదర్శకాలు భవిష్యత్ తరాల నిర్మాణానికి దిక్సూచి లాంటివి అని అన్నారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన చట్టాల పై సమగ్ర అవగాహన కల్పించాలని సంబంధిత శాఖల అధికారులు,సంఘాల ప్రతినిధులను ఆమె సూచించారు. వయోవృద్ధుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకు వచ్చిన వయోవృద్ధుల సంక్షేమ చట్టం 2007 జిల్లాలో పటిష్టంగా అమలు అవుతుందన్నారు ఈ చట్టం అమలు కోసం జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు ఈ సందర్భంగా ఈ చట్టం ద్వారా పరిష్కరించిన వివిధ కేసుల వివరాలను కలెక్టర్ వెల్లడించారు. వివిధ రంగాలలో పనిచేసిన వయోవృద్ధులు వారి అనుభవాలను భావితరాలకు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలోనారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి , జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు వయోవృద్ధుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో రెహమాన్ ప్రతిభ

- రెండు రజత పతకాలు సాధించిన శ్లోకాస్ శ్రీవాణి హై స్కూల్ విద్యార్థి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 19 : సంగారెడ్డి పట్టణానికి చెందిన శ్లోకాస్ శ్రీవాణి హై స్కూల్ లో ఎనిమిదోవ తరగతి చదువుతున్న విద్యార్థి మహమ్మద్ అబ్దుర్ రహమాన్ సిద్దిఖ్ పెద్దపల్లి జిల్లా సెంచ్నరీ కాలనీ, రాణి రుద్రమదేవి స్టేడియం స్విమ్మింగ్ పూల్ లో నిర్వహించిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర స్థాయి ఈతల పోటీలో మూడో స్థానంలో నిలిచి వివిధ స్టాక్ లో రెండు రజత పతకాలు సాధించిచాడు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాసరావు మహమ్మద్ అబ్దుర్ రెహమాన్ ను అభినందించారు. ఇలాంటి పోటీల్లో రాష్ట్ర దేశస్థాయిలో మరింత ప్రతిభ కనబరిచి మంచి పేరు గడించాలని ఆశిస్తున్నానని తెలిపారు. సంగారెడ్డి జిల్లా ఎస్ జి ఎఫ్ స్విమ్మింగ్ పోటీలలో అత్యధిక పథకాలను సాధించినందుకు గాను జిల్లా ఇన్చార్జ్ శేషు కుమార్ కు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాస్ రావు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. స్విమ్మింగ్ కోచ్, సంగారెడ్డి జిల్లా సిమ్మింగ్ ఇంచార్జ్ శేషు కుమార్ మాట్లాడుతూ అబ్దుర్ రెహమాన్ అండర్ 14 లో బ్రెస్ట్ స్టాక్ 100 మీటర్స్ , ఇండివిజువల్ మెడ్లి 200 మీటర్స్ లో రెండు రజత పథకాలను సాధించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. డి వై ఎస్ ఓ కాసిం బేగ్ సంతోషం వ్యక్తం చేస్తూ మునుముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. డి ఎస్ ఏ సిబ్బంది అభినవ్, దీపిక, పవన్ కళ్యాణ్ స్విమ్మింగ్ పూల్ సిబ్బంది పవన్,కృష్ణ,కుమార్ రెహమాన్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

డిసెంబర్ 1న పటాన్చెరులో

వందేమాతరం 150 వసంతాల సంబురాలు

- 30 వేల మంది విద్యార్థులతో ఒకే సారి ఒకే సమయాన సామూహిక వందేమాతరం గీతాలాపన
- పూర్తిస్థాయిలో ఏర్పాట్లు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 19 : వందేమాతర గీతం రచించి 150 వసంతాలు పూర్తయిన సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు డిసెంబర్ 1న పటాన్చెరు పట్టణంలో 30 వేల మంది విద్యార్థులతో సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం పటాన్చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వందేమాతరం 150 ఏళ్ల సంబరాలు కార్యక్రమం పై వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ప్రిన్సిపాళ్ళు, కరస్పాండెంట్, ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమానికి నినాదంగా మారిన వందేమాతరం గేయం కేవలం పాట మాత్రమే కాకుండా దేశభక్తి, ఐక్యత, త్యాగం, ధైర్యానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు. బంకిమ్ చంద్ర చటర్జీ రాసిన ఈ గేయం స్వాతంత్ర్య సమరయోధుల నుంచి పాఠశాల విద్యార్థుల వరకు, తరతరాలను దేశ ప్రేమతో ప్రేరేపించిందని ఉద్ఘాటించారు. అదే విధంగా వందేమాతరం మన దేశాన్ని ప్రగతి పథంలో నడిపించే నిత్య చైతన్య గేయమని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి పాఠశాల, కళాశాలలకు విద్యార్థినీ విద్యార్థులు, అన్ని శాఖల ఉద్యోగులు, పుర ప్రముఖులు,. ప్రజా ప్రతినిధులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో పటాన్చెరు డిఎస్పి ప్రభాకర్, సిఐ వినాయక్ రెడ్డి,. జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, ఎంపీటీవో యాదగిరి, మండల విద్యా శాఖ అధికారులు రాథోడ్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పంటల కొనుగోళ్లపై కలెక్టర్ విస్తృత సమీక్ష

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 19 : 2025-26 సీజన్‌లో పత్తి, ధాన్యం తదితర పంటల కొనుగోళ్లను పారదర్శకంగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సంబంధిత శాఖలతో విడివిడిగా సమీక్షలు నిర్వహించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశాల్లో పౌరసరఫరాల శాఖ , సహకారశాఖ, వ్యవసాయ, మార్కెటింగ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో 2025-26 సీజన్ పత్తి సాగు, దిగుబడిపై సమగ్ర అంచనా ప్రకారం, పత్తి కొనుగోలు సజావుగా జరిగేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు మార్కెటింగ్ యార్డుల పరిధిలోని 24 జిన్నింగ్ మిల్లుల నుండి సీసీఐ ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు వేగవంతం చేయాలని అన్నారు. పత్తి అమ్మకానికి ఆధార్ ప్రామాణికత తప్పనిసరి అని, చెల్లింపులు రైతుల ఆధార్‌తో అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతాలలోనే జమ అవుతాయని తెలిపారు. జిల్లాలోని అన్ని జిన్నింగ్ మిల్లులను తనిఖీ చేసి యంత్రాలు, వసతులు, భద్రత ప్రమాణాలు సరిగా ఉన్నాయో లీగల్ మెట్రాలజీ శాఖ పర్యవేక్షణలో పరిశీలించాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ అధికారులు మిల్లులను సందర్శించి భద్రత సూచనలు ఇవ్వాలని సూచించారు. రైతుల కోసం తాగునీరు, కనీస వసతులు కల్పించడమే కాకుండా, టోకెన్ సిస్టమ్ అమలు చేసి కొనుగోలు వ్యవస్థను క్రమబద్ధీకరించాలని కలెక్టర్ తెలిపారు. అంతేకాక, రైతులు కిసాన్ కంపాస్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసి నిర్ణీత సమయానికి పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లను కూడా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో 216 ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని తెలిపారు. అన్ని కొనుగోలు కేంద్రాలకు అవసరమైన సాంకేతిక పరికరాలు, ప్యాడి క్లీనర్లు, తార్పాలిన్లు, మాచర్ మిషన్లు, గన్ని సంచులు, లారీలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గోనెసంచులను రైతులకు నేరుగా ఇవ్వకుండా, కొలత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని సూచించారు. పిపిసి సెంటర్ ఇన్‌చార్జీలు కొనుగోలు వివరాలు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, మిల్లర్లు ధాన్యాన్ని వెంటనే స్వీకరించి ఎంట్రీలు చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటాచ్మెంట్‌లో ఉన్న నిర్దిష్ట రైస్ మిల్లర్లకే PPC సెంటర్ నిర్వాహకులు ధాన్యం పంపాలన్నారు. జిల్లాలో ఇప్పటికే సోయా చిక్కుడు - 7, మొక్కజొన్న - 9 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని కలెక్టర్ తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అన్ని పంటల కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రైతులకు ఇబ్బందుల్లేకుండా పంటల కొనుగోళ్లు జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు .

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

– రెవెన్యూ శాఖ పై దృష్టి

రీజినల్ రింగ్ రోడ్, రోడ్ ఓవర్ బ్రిడ్జ్‌లు, నేషనల్ ఇన్వెస్ట్మెంట్ మాన్యుఫాక్చరింగ్ జోన్ (నింజ్) వంటి కీలక ప్రాజెక్టుల భూసేకరణపై కూడా కలెక్టర్ సమీక్షించారు. భూసేకరణలో ప్రజల హక్కులు కాపాడుకునేలా , రైతులకు న్యాయం జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని, మరోవైపు అభివృద్ధి ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. విక్రయ విలువలను ఆధారంగా పరిగణించి భూసేకరణను న్యాయంగా పూర్తి చేయాల్సిందిగా తెలిపారు.ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ బాల సరోజ ,డి ఎం సివిల్ సప్లై అంబదాస్ రాజేశ్వర్ ,సహకారశాఖ అధికారి కిరణ్ కుమార్ , జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ , జహీరాబాద్ ఆర్ డి ఓ దేవుజా , నిమ్జ్ ప్రత్యేక అధికారిని విశాలాక్షి ,మార్కెటింగ్ శాఖ అధికారులు , సంబంధితశాఖ ల అధికారులు తదితరులు పాల్గొన్నారు .

పకడ్బందీగా చీరల పంపిణీ

- కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రతిపక్షం రంగారెడ్డి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులు, మహిళా సమాఖ్య సభ్యులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వారి ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న ప్రతి మహిళా సమాఖ్య సభ్యులకు ఇందిరమ్మ చీరలు అందించే విధంగా ప్రణాళికను సిద్ధం చేసుకొని పంపిణీ చేయాలని, చీరల పంపిణీ కార్యక్రమం విషయం స్థానిక ప్రజాప్రతినిధులకు ముందస్తు సమాచారం అందించి వారిని తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలని, ఎలాంటి వివాదాలకు తావు లేకుండా చీరల పంపిణీ చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం స్ఫూర్తిదాయకం

- చిట్యాలలో 'స్త్రీ శక్తి దివస్'

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 19: భారత వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం నేటి మహిళలకు స్ఫూర్తిదాయకమని ఏబీవీపీ చిట్యాల పట్టణ కార్యదర్శి, మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు కొంపల్లి సూర్య అన్నారు. చిట్యాల లో బుధవారం ఏబీవీపీ నగరశాఖ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా... "స్త్రీ శక్తి దివస్" ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతులు ధైర్యం, ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని అప్పుడే అణిచివేత, వివక్ష తుడిచిపెట్టుకుపోతాయని అన్నారు. భారత సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర అమోఘమని, రుద్రమదేవి, చెన్నమ్మ, అహల్యాబాయి హోల్కర్, రాణి దుర్గావతి వంటి వీరనారులు మహిళా శక్తికి నిదర్శనంగా నిలిచారని అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సంగీత మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో రుద్రమదేవి పోషించిన పాత్ర, బ్రిటిష్ వారి అణచివేతకు ఎదురొడ్డి ప్రాణాలర్పించిన త్యాగం స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షుడు గణేష్, యశ్వంత్, ఫణింద్ర, శశి, కావ్య, మాధురి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విద్యార్థులు దేశభక్తి నినాదాలతో ప్రతిధ్వనింపజేశారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 19: రాష్ట్ర అభివృద్ధియే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. తుంకుంట మున్సిపాలిటీ పరిధిలో బుధవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంకుంట మున్సిపల్ పరిధిలో నేడు చేసే అభివృద్ధి పనులు పూర్తైతే రహదారి సౌకర్యాలు, నీటి పారుదల వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ప్రజల అభ్యర్థనల మేరకు తుంకుంట మున్సిపల్ పరిధిలోని ప్రతి కాలనికి అభివృద్ధి చేసేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రజలకు సేవ చేసే సౌకర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్, మాజీ కౌన్సిలర్ మధుసూదన్ రెడ్డి, మాజీ జెట్పిటిసి సాయిపేట శ్రీనివాస్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి బిక్షపతి, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు నాగమణి, కాంగ్రెస్ నాయకులు బిక్షపతి, లక్ష్మణ్, నర్సింగ్, శేషాంత్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షంలో బీసీ, అధ్యక్ష పదవిలో దళిత నాయకుడిని

కూర్చోబెట్టే దమ్ము కేటీఆర్‌కు ఉందా?

- అవినీతి పరుల పేర్లను బయటపెట్టిన కల్వకుంట్ల కవిత
- నోరు మెదుపని అవినీతి తిమింగలాలు
- పాత ప్రాజెక్టులకు బొక్కలు పెట్టి పేరు మార్చుకోవడం సిగ్గుచేటు
- వనపర్తిలో రెండేళ్ల అభివృద్ధి పనులపై శ్వేతా పత్రంకు మేము సిద్ధం
- పదేళ్ల మీ పాలనలో జరిగిన అభివృద్ధి పనులపై శ్వేత పత్రంతో చర్చకు రండి
- బహిరంగ సవాలు విసిరిన వనపర్తి ఎమ్మెల్యే.తూడి మేఘారెడ్డి

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 19: ప్రతిపక్ష నాయకుడి స్థానంలో బీసీ నాయకుడిని,అలాగే బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవిలో దళిత నాయకుడిని కూర్చోబెట్టే దమ్ముందాని వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు సవాల్ విసిరారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి దాదాపు 10,688 మందికి సీఎం సహాయ నిధి, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఎల్ఓసీ లబ్దిదారులకు మొత్తం రూ.64,32,04.598 విలువ గల చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి కట్టుబడి ఉందని, అభివృద్ధిలో మహిళలను భాగస్వాములను చేశామన్నారు. వనపర్తి నియోజకవర్గంలో సీఎం, మంత్రులు శంకుస్థాపన చేసిన ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఇందిరమ్మ ఇండ్లు, సీసీ రోడ్లు, కాలవలు, తదితర అభివృద్ధి పనుల టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు మొదలయ్యాయని తెలిపారు.పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనపై శ్వేత పత్రం విడుదల చేయాలన్న తన డిమాండ్ కు బీఆర్ఎస్ నాయకులు ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. నియోజకవర్గంలో 23 నెలల కాంగ్రెస్ పాలనలో తాను ఎక్కడ అవినీతికి పాల్పడలేదని, ఎక్కడ తప్పు జరిగిన నా దృష్టి తీసుకొస్తే..సరిదిద్దుకుంటామన్నారు. ప్రజల డబ్బులు ప్రజల కోసమే ఖర్చు పెడుతున్నామన్నారు.గత ప్రభుత్వం చేసిన సుమారు రూ.8 వేల కోట్ల అప్పు కు మిత్తి కట్టుకుంటూ, తాము ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలుచేస్తామన్నారు.భవిష్యత్ లో ప్రజల ఆశీస్సులుతో రానున్న 15 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.బిఆర్ఎస్ పార్టీలో పెద్దపెద్ద అవినీతి తిమింగలాలు ఉన్నాయని స్వయాన కేసిఆర్ కూతురు కల్వకుంట్ల కవిత పేర్లు బయటపెట్టిన ఇప్పటివరకు తేలు కుట్టిన దొంగల్లాగా ఏ ఒక్కరు కూడా నోరు మెదపలేదని,అలాంటి అవినీతి తిమింగలాలు నేడు ప్రజల మధ్యన నీతులు వల్లించడం సిగ్గుచేటని పేర్కొన్నారు.కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులకు నేడు కొందరు నాయకులు అక్కడక్కడ బొక్కలు పెట్టి తామే సాగునీరు అందించామని గొప్పలు చెప్పుకుంటూ వారి పేర్లను మార్చుకోవడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే ఎద్దేవ చేశారు.పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కళాకారులను కష్టాలకు గురిచేస్తే, ప్రజాకవి గద్దర్, అందెశ్రీ లాంటి మహానుభావులకు ప్రభుత్వపరమైన గౌరవ మర్యాదలను అందిస్తూ వారి కీర్తిని నలు దిక్కుల చాటినా ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు.కాంగ్రెస్ పార్టీ గెలిస్తే బుల్డోజర్ పాలన జరుగుతుందని ఎన్ని కల్లబొల్లి మాటలు చెప్పిన ప్రజలు మాత్రం కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని మొన్నటి ఎన్నికలు నిరూపించాయనీ ఎమ్మెల్యే తెలిపారు.రానున్న స్థానిక ఎన్నికల్లో ఏదైనా బంధు ప్రీతితో వేరే వాళ్లకు అవకాశం కలిపిస్తే వారు అభివృద్ధికి ఆటంకాలుగా మారుతారే తప్ప వారి వల్ల జరిగేదేమీ ఉండదని దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే ఓటు వేసి గెలిపించాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,, పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదుని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి రామకృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, శంకర్ నాయక్, తిరుపతయ్య గౌడ్, వనపర్తి పట్టణ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు. సత్యం సాగర్, బ్రహ్మం, నాయకులు లక్కాకుల సతీష్, రఘుపతి రావు తదితరులు పాల్గొన్నారు.



నేను 27 ఏళ్లకు పెళ్లి చేసుకున్నా. వ్యక్తిగత కారణాలతో 36 ఏళ్లకు తల్లి అయ్యా. నా ప్రయాణంలో పెళ్లితో పాటు కెరీర్‌కు సమప్రాధాన్యం ఇచ్చా. నా దృష్టిలో ఆ రెండింటికి పోటీ లేదు. ఓ మహిళ సరైన భాగస్వామి దొరికాకే పెళ్లి చేసుకోవడం తప్పా? వ్యక్తిగత పరిస్థితులతో పిల్లలను ఎప్పుడు కనాలో నిర్ణయించుకోకూడదా?.

-ఉపాసన కామినేని

ప్రాంతీయం

సిలిండర్ పేలుడు బాధితులకు నేతల పరామర్శ

ప్రతిపక్షం చేర్యాల, నవంబర్ 19: సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరుకు చెందిన శెట్టె భాస్కర్ కుటుంబం వంట గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడగా, ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం వారిని సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి బర్న్స్ వార్డ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో గాయపడిన బాధితులను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, రాష్ట్ర యువజన నాయకుడు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డిలు పరామర్శించారు. ఈ సందర్భంలో చేర్యాల మండల పార్టీ అధ్యక్షుడు కొమ్ము రవి, జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె నానిబాబు, చేర్యాల కౌన్సిలర్ ముస్త్యాల యాదగిరి, మాజీ సర్పంచులు సిరిమల్ల నర్సింలు, మాదాసు మల్లేశం, శెట్టె ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి పరామర్శ

సిలిండర్ పేలుడు ఘటనలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించేందుకు చేసిన చర్యలను జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి పర్యవేక్షించారు. సిలిండర్ పేలుడులో గాయపడిన కుటుంబ సభ్యులు తొలుత సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడే ఉన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి వైద్యులతో మాట్లాడి, ఉత్తమ చికిత్స అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి బర్న్స్ వార్డుకు తరలించేలా చర్యలు చేపట్టారు. బుధవారం గాంధీ ఆసుపత్రికి చేరుకున్న ఎమ్మెల్యే, బాధితులకు అవసరమైన ప్రత్యేక వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి అధికారులకు సూచించారు. గ్యాస్ సిలిండర్ పేలుడు వల్ల తీవ్రంగా నష్టపోయిన కుటుంబానికి ప్రభుత్వం తరఫున, తన తరఫున కూడా అవసరమైన సహాయాన్ని అందిస్తానని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు.

బాధితులకు 'అందె' పరామర్శ

సికింద్రాబాద్ లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ బుధవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆసుపత్రి అధికారులతో మాట్లాడి మెరుగైన వైద్య చికిత్స అందించాలని కోరారు. వారి వెంట సీపీఐ నాయకులు ఉన్నారు.

కూతురు పెళ్లికి ఊరందరికీ పట్టుచీరలు

- గ్రామంలో 1300 మంది మహిళలకు అందజేత

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 19: కూతురు పెళ్లి అంగరంగ వైభవంగా నిర్వహించిన ఓ తండ్రి తన పుట్టిన ఊరిలోని మహిళలందరికీ పట్టుచీరలు పంపిణీ చేశాడు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగకు చెందిన తడిసిన ప్రశాంత్ రెడ్డి తన కూతురు వివాహం తరువాత బుధవారం తన స్వగ్రామంలో గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. వ్యాపార రీత్యా హైదరాబాద్ లో స్థిరపడ్డ ప్రశాంత్ రెడ్డి ఇటీవల బహ్రెయిన్ లో తన కూతురు వివాహం చేశారు. మూడు రోజుల కిందట హైదరాబాద్లో వివాహ విందు కూడా ఏర్పాటు చేశారు. ఈ రిసెప్షన్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పెళ్లి పనులు ముగించుకున్న ప్రశాంత్ రెడ్డి కుటుంబం బుధవారం బద్దిపడగలో గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వగ్రామం బద్దిపడగలో విందు ఏర్పాటు చేశారు. ఈ విందు సందర్భంగా నవ దంపతుల చేతుల మీదుగా గ్రామంలోని మహిళలు అందరికీ పాటూ చీరలు అందించారు. గ్రామంలోని మొత్తం 1,300 మంది మహిళలకు పట్టుచీరలు పెట్టారు. తాను పుట్టి పెరిగిన ఊరికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డి తెలిపారు. గ్రామ దేవతలను పూజలు ప్రజలకు సహాయం చేయడం తమ కుటుంబంలో ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. అందులో భాగంగానే ఈ విందు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి

- ఎంపీకి తపస్ నాయకుల వినతిపత్రం

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 19: 2010 సంవత్సరానికి ముందు ఎంపికైన ఉపాధ్యాయులందరిని టెట్ నుండి మినహాయించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు మెదక్ ఎంపీ రఘునందన్ రావుకి వినతి పత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి లోక సభలో చర్చించి నాటి ఉపాధ్యాయులను మినహాయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు జజ్జి ఎల్లం ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుబాషి భాస్కర్ చేగుంట మండల అధ్యక్ష కార్యదర్శులు రావుల వెంకటేష్, కృష్ణమూర్తి, జిల్లా బాధ్యులు రమేష్, కృష్ణమూర్తి, సురేందర్, ప్రవీణ్, సుమతి, మంజుల, సంధ్యారాణి, మంజులత పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 19: భారతదేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జయంతి ఉత్సవాలను బుధవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ స్వర్గీయ ఇందిరా గాంధీ మహిళా సాధికారితకోసం ఎంతగానో కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడి మధుసూదన్ రావు, నాయకులు దుర్గ ప్రసాద్, ఆరిఫ్ అంజద్, నిఖిల్, దయసాగర్, గాడి రమేష్, దేవుల సింగ్ నాయక్, కృష్ణ, మహిళా నాయకురాలు జ్యోతి, హరిత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు ప్రభుత్వాల తీరు

- నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ "వంటేరు"

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 19: మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు ఉందని నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పలు పత్తి మిల్లులో రైతులతో కలిసి బుధవారం పరిశీలించిన గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గం వ్యాప్తంగా రైతులు దాదాపు 40 వేల ఎకరాలలో పత్తిని సాగు చేసుకున్నారని తెలిపారు. ఈ సంవత్సరం పంటలకు సరైన సమయంలో ఎరువులు యూరియా దొరకక, అధిక వర్షాలతో పంటలు పండక రైతులు సతమతమవుతుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సీసీఐ పత్తి కొనుగోలలో మ్యాచుర్ కారణంగా, ఆన్లైన్లో యాప్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆంక్షలు పెడుతూ రైతులను తీవ్రంగా ఇబ్బందుల గురి చేస్తున్నారని పేర్కొన్నారు. రైతుల దగ్గర చిన్న ఫోన్లు ఉంటాయని రిజిస్ట్రేషన్ స్లాట్ రైతులు ఎలా బుకింగ్ చేసుకుంటారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అంతేకాకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా ఒక ఎకరానికి 7 క్వింటాల పత్తి మాత్రమే కొనుగోలు చేయడం చాలా సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జికియోద్దీన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు నవాజ్ మీరా, మైనార్టీ నాయకుడు విరాసత్, మున్సిపల్ మాజీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

'గరీబి హటావో'తో పేదలకు దగ్గరైన ఇందిరాగాంధీ

- టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 19: భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిరస్మరణీయురాలు అని టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి అన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం గజ్వేల్ ఇందిరా పార్క్ నాయిని యాదగిరి, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లా రెడ్డి కాంగ్రెస్ నాయకులు ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం వారు మాట్లాడుతూ ఉక్కు మహిళ భారత తొలి మహిళా ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ గరీభి హటావో అనే నినాదంతో నిరు పేదలకు సంక్షేమ పథకాలు అందించి, ప్రజా రంజక పరిపాలన అందించిన ఘనత ఇందిరాగాంధీ కె దక్కిందన్నారు. ఇదే తరహాలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజా పాలన కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ గోపాల్ రావు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు భవాని, తిరుపతి, సయ్యద్ బాబా, మామిడి కృష్ణ, శాంతం స్వామి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మన్నె కృపానందం, మాజీ కోఆప్షన్ నెంబర్ గంగిశెట్టి రాజు, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బాలింగారి రాజు గౌడ్, మాజీ ఎంపిటిసి పంజాల రాజు గౌడ్, గజ్వేల్ టౌన్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ మిదే నరేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు టిల్లు రెడ్డి, వేణుగోపాల్, నాయిని శ్రీనివాస్, ప్రభాకర్ గౌడ్, కొండ రవి , మామిడి మహేష్, మైనార్టీ నాయకులు జమీర్, గిరిమల్లె రాజు ,మాజీ వార్డ్ మెంబర్ రమేష్ గౌడ్ ,మరియు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 19: ట్రాక్టర్, ఆటో ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధి నాగ్సాన్పల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. పోద్చన్ పల్లి గ్రామానికి చెందిన పచ్చ దేవరాజ్ (17) వృత్తిరీత్యా విద్యార్థి. ఇతను క్యాటరింగ్ పనులకు వెళ్తున్నాడు. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన కొందరితో కలిసి ఆటోలో ఏడుపాయలకు వెళ్లాడు. అక్కడ క్యాటరింగ్ ముగించుకొని తిరిగి ఇంటికి ఆటోలో వస్తుండగా నాగ్సాన్ పల్లి గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటో బోల్తా పడగా ఆటోలో ఉన్న దేవరాజ్ తో పాటు మరికొందరికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి మెదక్లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దేవరాజ్ పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో అర్థరాత్రి సమయంలో మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

- సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 19: చిరు వ్యాపారులు ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే జరిమానాలు విధించడం జరుగుతుందని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని సుభాష్‌రోడ్డు, పాత కూరగాయల మార్కెట్ తో పాటు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఎస్ఐలు ఉమేష్, శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, విజయ్‌భాస్కర్, ట్రాఫిక్ సిబ్బందితో కలిసి సీఐ అవగహన కల్పించారు. ఈ సందర్బంగా సీఐ మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లు ఆక్రమించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డుపై మార్క్ చేసిన లైన్ లోపల మాత్రమే తమ సామాన్లను ఉంచి వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. మార్కింగ్ బయట పెట్టి వ్యాపారాలు చేస్తున్న పలువురు నిర్వహకులను రోడ్డుపై నుంచి తోపుడు బండ్లను, వస్తువులను తీయించడం జరిగిందన్నారు. ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వాహనదారులకు, పాదాచారులకు, ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. తమ సిబ్బందితో ప్రతి రోజు తనిఖీలు నిర్వహిస్తామని నిబంధనలు అతిక్రమించే వారిపై జరిమానాలు విధించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు ఉమేష్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, విజయ్‌భాస్కర్, సిబ్బంది మహేష్, జగదీశ్, రాజిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, కిషన్ పాల్గొన్నారు.

మెదక్‌లో త్వరలో క్యాన్సర్ ఆస్పత్రి

- జిల్లా ప్రజలకు క్యాన్సర్ వైద్య సేవలు
- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- సంక్షేమ పథకాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం
- మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 19: మెదక్ జిల్లాలో త్వరలో క్యాన్సర్ ఆస్పత్రి నిర్మించి, జిల్లా వ్యాప్తంగా ప్రజలకు క్యాన్సర్ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు అన్నారు. మెదక్ జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు మానిటరింగ్ కమిటీ (దిశ) సమీక్ష సమావేశం బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశానికి ఎంపీ రఘునందన్ రావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాల ప్రగతి, పథకాల అమలులో ఎదురయ్యే సమస్యలు, వీటి పరిష్కారం,బడ్జెట్ వినియోగం, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ, నిధుల వినియోగం తదితర అంశాలను సమీక్షించారు. జిల్లాలో అమలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర పథకాలు వ్యవసాయ, విద్య, ఆర్ అండ్ బీ, పీఎంఏవై, జాతీయ గ్రామీణ జీవనోపాధి ,రహదారి అభివృద్ధి, ఇతర సంక్షేమ పథకాలు ఎంపీ అధికారులను సమర్థవంతమైన అమలు, ప్రజలకు లబ్ధి చేకూరే విధంగా కార్యక్రమాలు తీర్చిదిద్దాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలపై ఫీల్డ్ లెవల్ మానిటరింగ్ పెంచాలని, ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా చూడాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి, మెదక్ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. ప్రైవేట్ సంస్థల యాజమాన్యాన్ని ఒప్పించి మొట్టమొదటిసారిగా దేశంలోనే ఏ జిల్లాలో ప్రారంభం కాని విధంగా మెదక్ జిల్లాలో 1000 గజాల స్థలంలో క్యాన్సర్ ఆస్పత్రి నిర్మించి, క్యాన్సర్‌చికిత్సలు అందించే విధంగా జిల్లా కలెక్టర్ చొరవతో త్వరితగతిన ఏర్పట్లు చేస్తామన్నారు. దేశంలోనే ఎక్కడా ప్రారంభం కానీ ప్రిలిమినరీ క్యాన్సర్ టెస్టింగ్ మెదక్లో ప్రారంభం కావడం శుభ పరిణామంగా పేర్కొన్నారు. ప్రతి వారం మండల కేంద్రంలో క్యాన్సర్ ప్రిలిమినరీ పరీక్షల కొరకు ఒక బస్సు ఏర్పటుకు భారత్ రాజ్ నిక్ సంస్థ ముందుకు వచ్చిందని, పీడీఎల్ పటాన్చెరువు వారు ఒక బస్సు కొనుగోలు చేసి ఇవ్వడానికి సీఎస్ఆర్ నిధులు కింద లెటర్ అందజేయడం జరిగింది అన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ...దిశ మీటింగ్లో చర్చించిన అంశాలను, సమస్యలను అధికారులు పష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ భుజంగరావు, డీఆర్డీఓ శ్రీనివాసరావు, జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాసవి మాత ఆలయంలో నర్సారెడ్డి పూజలు

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 19: పట్టణంలోని సీతారామ ఉమామహేశ్వర ఆలయంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని బుధవారం నాడు డీసీసీ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్ మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా సహస్ర దీపాలంకరణతో పాటు 18 వేల116 దీపాలతో కార్తీక దీపోత్సవం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తో పాటు ప్రముఖులు పాల్గొన్నందుకు సంతోషంగా ఉందని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురోహితులు శంకర్ పంతులు, సిద్ది బిక్షపతి, నంగునూరి సత్యానారాయణ, కొమరవెల్లి సుధాకర్, కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ పట్టన ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాడిపల్లి శ్రీనివాస్,ఉడెం శ్రీనివాస్ రెడ్డి, సిద్దేశ్వర్, ఆర్యవైశ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హీరో ధనుష్ పేరిట కమిట్మెంటు అడిగారు. ధనుష్ నిర్మించే సినిమాలో నటించేందుకు శ్రేయస్ అనే వ్యక్తి కాల్ చేశారు. ధనుష్ కోసమంటూ కాస్టింగ్ కౌచ్ గురించి చెప్పారు. స్క్రిప్ట్, ప్రొడక్షన్ హౌస్ లొకేషన్ పంపగా నంబర్‌ను బ్లాక్ చేశా. దీనిపై ధనుష్ మేనేజర్ పేరిట ఎవరో అమ్మాయిల్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశాం.

- తమిళ నటి మాన్య ఆనంద్

ప్రాంతీయం

రీజనల్ రింగ్ రోడ్ భూసేకరణకు రైతులు సహకరించాలి

- జిల్లా కలెక్టర్ కె హైమావతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 19: రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణంలో భూమిని కోల్పోతున్న బాధిత రైతులకు ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని, భూ సేకరణకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణంలో భూమిని కోల్పోతున్న మర్కుక్, వర్గల్ మండలాల రైతులతో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళతో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణానికి జిల్లాలో అవసరమైన భూ సేకరణ చేయాల్సి ఉందని అన్నారు. ప్రజావసరాల కోసం భూమిని త్యాగం చేస్తున్న మీకు ప్రభుత్వ తరపున దక్కాల్సిన నష్టపరిహారం త్వరగా అందేలా చూస్తామని భూమిని త్వరగా అందించేందుకు రైతులు ముందుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా సంబంధిత భూమిని కోల్పోనున్న సంబంధిత గ్రామాల రైతులు వారికి చెల్లించాల్సిన నష్టపరిహారంపై జిల్లా కలెక్టర్ కు రాతపూర్వకంగా విజ్ఞప్తి చేశారు.

ఇందిరమ్మ చీరల పంపిణీ పారదర్శకంగా జరగాలి

- జిల్లా కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 19: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ జిల్లాలో పూర్తి పారదర్శకంగా జరిగేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కే హైమావతి సూచించారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, మహిళా సమాఖ్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం పై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి మహిళా సమైక్య సభ్యులతో కలిసి వీ.సీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కే.హైమావతి జిల్లాలో చీరల పంపిణీకి ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తామని ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం పలు మహిళా సమైక్య సభ్యులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో "మహిళల ఉన్నతి తెలంగాణ ప్రగతి" కార్యక్రమం పేరుతో ఇందిరమ్మ చీరల పంపిణీకి చర్యలు తీసుకున్నామని అన్నారు. ఎలాంటి విమర్శలు, పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర పంపిణీ అయ్యేలా సమాఖ్య ప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. చీరల పంపిణీ కార్యక్రమం పర్యవేక్షణ కోసం నియోజకవర్గానికి ఒకరు చొప్పున స్పెషల్ ఆఫీసర్ ను నియమిస్తున్నామని అన్నారు. ప్రజా ప్రతినిదుల సమక్షంలో చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినిర్ణీత గడువు లోపు చీరల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ట్రైనీ, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, డీపీఓ వినోద్ కుమార్, జిల్లా మహిళా సమైక్య అధ్యక్షురాలు టి. రేణుక, మున్సిపల్ కమిషనర్లు, మహిళా సమాఖ్య ప్రతినిధులు, ఏపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధిపేట సహాయ లేబర్ అధికారిపై చర్యలు తీసుకోండి

- బీఎస్పీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 19: సిద్దిపేట సహాయ కార్మిక లేబర్ అధికారి పై తక్షణ చర్యలు తీసుకావాలని బీఎస్పీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ డిమాండ్ చేశారు. సిద్దిపేట పట్టణ కేంద్రంలో సహాయ కార్మిక లేబర్ అధికారి కార్యాలయంలో ప్రజా సమస్యలను విన్నవించడానికి బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు వెళ్లగా, అక్కడ అధికారులు అందుబాటులో లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగించింది. జిల్లా అధికారి ఫోన్ చేసినప్పటికీ, స్పందన లేకుండా ఉండటం ప్రజా సమస్యల పట్ల నిర్వాహక వ్యవస్థ నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపుతోందన్నారు. గత 15 రోజులుగా సంబంధిత అధికారిని సంప్రదించడానికి ఎన్నోసార్లు ప్రయత్నించినప్పటికీ, ఫోన్ రెస్పాన్స్ లేకపోవడం, కార్యాలయానికి వచ్చినా అక్కడ అధికారి అందుబాటులో ఉండడం లేదని ఆరోపించారు. ఈ నిర్లక్ష్యంతో రోజూ కార్యాలయానికి వచ్చే కార్మికులు, కూలీలు , సాధారణ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫిర్యాదు చేయడానికి కూడా అధికారులు లేకపోవడం పరిపాలనా వైఫల్యమని అన్నారు. తక్షణమే సంబంధిత సహాయ కార్మిక లేబర్ అధికారిపై చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో బహుజన్ సమాజ్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండనోళ్ల నరేష్, నాయకులు కనక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

ప్రతిపక్షం, మంచిర్యాల, నవంబర్ 19: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను మంచిర్యాల నియోజకవర్గం చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాలలో బుధవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత ఇందిరాగాంధీ దేశానికి ఎంతో సేవ చేయడం జరిగిందన్నారు. సీలింగ్ చట్టం పేద ప్రజలకు ఇండ్ల నిర్మాణం విద్య వైద్యం ఉద్యోగం తదితర విషయాలలో నిరుపేదలకు ఎంతో ఉపయోగపడి భారతరత్న పేరు గడించిందన్నారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి శాస్త్రీయ విజ్ఞానాన్ని రూపొందించుకోవాలి

- జిల్లా కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 19: విజ్ఞాన శాస్త్రం నిత్యజీవితంలో ఎంతో ఉపయోగపడుతుందని, ప్రతి విద్యార్థి కూడా శాస్త్రీయ విజ్ఞానాన్ని, శాస్త్రీయ వైఖరిని రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ హైమవతి తెలిపారు. బుధవారం సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి ప్రేరణ బాల వైజ్ఞానిక ప్రదర్శిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ కె హైమావతి, విశిష్ట అతిథులుగా ఎస్సీ ఎస్టీ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య, గ్రంథాలయ చైర్మన్ కెడారి లింగమూర్తి, ఆర్టీఏ మెంబర్ సూర్య వర్మ , జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస రెడ్డి , జిల్లా సైన్స్ అధికారి కల్లెపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు చిన్న వయసులోనే విషయం పట్ల అవగాహన పెంచుకోవడం సులభమని, చిన్నప్పుడు ఆలోచన చాలా ఎక్కువగా ఉంటుందని, తార్కిక ఆలోచనలు ఎక్కువ విజ్ఞానాన్ని కలగచేస్తాయని, శాస్త్రీయ విజ్ఞానంపై నిరంతరం కృషిచేసి శాస్త్రవేత్తలుగా ఎదగాలని అన్నారు. భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం రచించిన వింగ్స్ ఆఫ్ ఫైర్ పుస్తకాన్ని ప్రతి ఒక్కరు చదివి ఉన్నత కలలు కాని వాటి సాకారానికి నిరంతరం కృషి చేయాలని అన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరంలో సైన్సు రంగంలో జిల్లా సాధించిన ప్రగతిని అందరికీ వివరించారు. అనంతరం ఎస్సీ ఎస్టీ చైర్మన్ భకి వెంకటయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే విద్య బాగుంటుందని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో నిష్ణాతులలుగా ఉంటారని తెలియజేయడం జరిగింది. అనంతరం సూర్య వర్మ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలని గొప్పగా శాస్త్రవేత్తలుగా రాణించాలని తెలపడం జరిగింది. ఈరోజు ఈ జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్లో 183 ఇన్స్పైర్ ప్రాజెక్టులు ,236 బాల వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం సిద్దిపేట అర్బన్ సిద్దిపేట రూరల్ నుండి అనేక విద్యార్థులు వచ్చి ప్రాజెక్టులను సందర్శించారు.

ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి సేవలు మరువలేనివి

- దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి

ప్రతిపక్షం, తొగుట, నవంబర్ 19: తొగుట మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు అందించిన సేవలు మరువలేనివి అని దుబ్బాక ఆత్మ చేర్మెన్ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీనివాస్ రెడ్డి బదిలీపై మహబూబ్ నగర్ వెళ్తున్న సందర్భంగా ఆయనను ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తొగుట మాజీ సర్పంచ్ కొండల్ రెడ్డి, నాయకులు ఎన్నం భూపాల్ రెడ్డి,నిరంజన్ రెడ్డి ,ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా గాంధి జయంతి

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 19: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 108వ జయంతి వేడుకలను సిద్ధిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ భారత తొలి మహిళా ప్రధానిగా దేశంలోని పేదరిక నిర్మూలన కోసం గరీబీ హటావో నినాదాన్ని చేపట్టి పేదలకు, కూడు, గుడ్డ, నీడ కల్పించి ఇందిర గాంధీ పేదలందరికీ అమ్మగా మారారని కొనియాడారు. పాకిస్తాన్, బాంగ్లాదేశ్ యుద్ధంలో గెలిచి ఉక్కు మహిళగా పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెలికాని యాదగిరి, అనరాజు నాగరాజు, గౌరబోయిన సంపత్, జంగిటి శ్రీనివాస్, చేర్యాల బాలయ్య, కరెడ్ల వెంకట రెడ్డి, రాగుల కృష్ణ, జైపాల్ రెడ్డి, రాగుల కనకయ్య, తుపాకుల శ్రీనివాస్, విక్రమ్ రెడ్డి, బెదురు శ్రీశైలం, ముక్కెర లింగం ,దేవులపల్లి శ్రీకాంత్, ఆరెపల్లి సురేష్, కందికట్ల రాజు, అనరాజు శ్రీకాంత్, బడే సాంబయ్య, గౌరబోయిన రాజు, దేవులపల్లి పర్శరాములు, మహేందర్, రామకిష్టయ్య, ఎండీ బోలె పాషా పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 19: మెదక్ జిల్లా గ్రంథాలయంలో జరుగుతున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 6వ రోజు ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ, జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాత నాణేల సేకరణ ఎగ్జిబిషన్ తిలకించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ... మహిళల విజయాలను గుర్తించడం,వారికి సమానత్వం గురించి అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. అని పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించడం అనేది ఒక సంప్రదాయంగా వస్తుందని ఇది గ్రంథాలయాలలో మహిళల పాత్ర మరియు ప్రాముఖ్యతను గుర్తించడం కోసం చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, కార్యదర్శి వంశీకృష్ణ, సిబ్బంది, జె యాదగిరి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి. అశోక్, నాయకులు బొజ్జ.పవన్, ముత్యంగౌడ్, గంగాధర్, సమీయొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దేశ అభ్యున్నతి కోసం పాటుపడిన
ఉక్కు మహిళ ఇందిరాగాంధీ

- హిందుత్వ పేరుతో దేశాన్ని విభజిస్తున్న కేంద్ర ప్రభుత్వం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 19: దేశ అభ్యున్నతి కోసం పాటుపడిన ఉక్కు మహిళ మాజీ ప్రధానమంత్రి కాంగ్రెస్ పార్టీ దివంగత నాయకురాలు ఇందిరాగాంధీ అని సిద్దిపేట జిల్లా గ్రంథాలయం చైర్మన్ కెడెం లింగుమూర్తి, సిద్దిపేట నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలో ముస్తాబాద్ చౌరస్తా వద్ద ఇందిరా గాంధీ విగ్రహానికి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు ఇందిరా గాంధీ గరీబీ హఠావో నినాదంతో ముందుకు వచ్చారు అని అన్నారు. పేద ప్రజలకు అండగా ఉండేందుకు ఇందిరమ్మ ఇళ్లు తో పాటు వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేశారు అని అన్నారు. ఇందిరమ్మ ఆశయాలను కొనసాగించేందుకు రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ పాలన అందిస్తున్నాం అని అన్నారు. హిందుత్వం పేరుతో కేంద్ర మోదీ ప్రభుత్వం దేశాన్ని విభజిస్తుంది అని, దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో చీకటి ఒప్పందం స్నేహితులైన బీజేపీ, బీఆర్ఎస్ కు ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ముద్దం లక్ష్మి ఎల్లం యాదవ్ సఖీ ఆనంద్ రియాజుద్దీన్ బొమ్మల యాదగిరి కలిముద్దీన్ గ్యాదారి మధు మీసం మహేందర్ దాస అంజయ్యగయాజుద్దీన్ హర్షద్ కోమిలి బిక్షపతి చాంద్ షాబుద్దీన్ గుర్రం శ్రీనివాస్ రెడ్డి రాజేష్ ఖన్నా వహాబ్ అజ్మత్ సనా రజిని సంతోషి చోట అజ్మత్ బాలయ్య సీతా బాలు అచ్చు యాదవ్ తదితరులు సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను ప్రేమించని వారు ఎవరిని ప్రేమించరు

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- వృద్ధుల సంక్షేమం మా బాధ్యత
- జిల్లా కలెక్టర్ హైమావతి
- ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 19: తల్లిదండ్రులను ప్రేమించని వారు ఎవరిని ప్రేమించరని, కన్న తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నప్పుడు వారిని గౌరవించడం, చూసుకోవడం ప్రతి వ్యక్తి యొక్క ప్రధాన బాధ్యత అని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. కుటుంబాల్లో పెద్దలకు మరింత గౌరవం, మర్యాద పెంపొందేలా సమాజం మారాల్సిన అవసరం ఉందని తెలిపారు. అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల ముగింపు సందర్భంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని బుధవారం సిద్దిపేటలోని టిటిసీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కే. హైమవతి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ముఖ్య అతిథులుగా హాజరై పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి శారదతో పాటు, జిల్లాలోని వివిధ సీనియర్ సిటిజన్ సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు విశేషంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన 12మంది వయోవృద్ధులను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కే. హైమవతి మాట్లాడుతూ ల్లిదండ్రులు మన కోసం ఏ త్యాగానికైనా సిద్ధపడతారు. చిన్ననాటి నుంచీ పిల్లలను ఎన్నో కష్టాలు పడుతూ పెంచి పెద్దలు చేసే వారు తల్లిదండ్రులు. అలాంటి వారిని వృద్ధాప్యంలో ఒంటరిగా వదిలేయకుండా, ఇబ్బందులు కలగకుండా చూసుకోవడం ప్రతి సంతాన ధర్మమని అన్నారు. ఉమ్మడి కుటుంబాల్లో వృద్ధులకు లభించే గౌరవం, ప్రేమ, ఆదరణ ఇప్పుడు విడిపోతున్న కుటుంబ వ్యవస్థల కారణంగా తగ్గిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం, అధికారులు ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.



సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో చేస్తున్నాం. సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశాం. తానూ రైతు బిడ్డనే. నాన్నకు వ్యవసాయంలో సాయం చేసేవాడిని. అన్నదాతల కష్టాలు తెలుసు కాబట్టే అన్నదాత సుఖీభవ కింద రూ.14వేలు అందజేశాం. సాగు తీరు మారి, వ్యవసాయం లాభసాటిగా మారేందుకు పంచసూత్రాలను అమలు చేస్తున్నాం.

- కడప పెండ్లిమర్రి సభలో ఏపీ సీఎం చంద్రబాబు

హిందుత్వమే నా శ్వాస

- హుజూరాబాద్ లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 19: ఎవరేమనుకున్నా హిందుత్వం మాట్లాడుతూనే ఉంటానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుండ బద్దలు కొట్టారు. నా నోటి నుండి హిందుత్వం ఆగిపోయిందంటే అదేరోజు నా శ్వాస ఆగిపోయినట్లేనని స్పష్టం చేశారు. హిందుత్వ నినాదాన్ని గడప గడపకూ తీసుకెళ్లి తెలంగాణలో రామరాజ్యాన్ని తీసుకొచ్చి తీరుతామని స్పష్టం చేశారు. ''పహల్గాంలో అవయవాలు చూసి హిందువులను కాల్చి చంపారు. హైదరాబాద్ లో ముత్యాలమ్మ, పెద్దమ్మ ఆలయాలను కూల్చివేశారు. గోరక్షకులపై ముస్లింలు కాల్పులు జరిపారు. నిజామాబాద్ లో ముస్లిం వ్యక్తి కానిస్టేబుల్ ను చంపారు. డీసీపీ చైతన్యపై దాడి చేసింది ముస్లిం. మరి అట్లాంటప్పుడు హిందుత్వం మాట్లాడకుండా ఎందుకు ఉండాలి? తెలంగాణలో గత ఎన్నికల ముందు వరకు అధికారంలోకి దాదాపు వచ్చేసినంత వాతావరణ ఏర్పడిందంటే దానికి కారణం హిందుత్వమే. జీహెచ్ఎంసీలో 4 కార్పొరేటర్లుంటే... 48 స్థానాలను గెలిచామంటే దానికి కారణమూ హిందుత్వమే. కరీంనగర్ లో నేను ఎంపీగా గెలిచానంటే హిందుత్వమే కారణమని గల్లా ఎగరేసుకుని చెబుతా''అని తెలిపారు. నరేంద్రమోదీ ప్రభుత్వం హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అనే తేడా లేకుండా అందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. అయినప్పటికీ ఎన్నికలొస్తే మసీదుల్లో ఇమామ్, మౌలానాలంతా ముస్లింలందరితో ప్రతిజ్ఞ తీసుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఎందుకు ఓటు వేయిస్తున్నారో ఆత్మ విమర్శ చేసుకోవాలని కోరారహుజూరాబాద్ పట్టణంలోని మధువని గార్డెన్ లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి పోలింగ్ బూత్ అధ్యక్షులు ఆ పైస్థాయి నాయకుల సమావేశానికి హాజరైన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తోపాటు పార్టీ రాష్ట్ర సంఘటనా మంత్రి చంద్రశేఖర తివారీ, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కరీంనగర్ ఇంఛార్జీ గంగిడి మనోహర్ రెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ వైఫల్యాలపై రూపొందించిన 'కరపత్రం'తోపాటు సంతకాల సేకరణ పత్రాలను విడుదల చేశారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనా, బీఆర్ఎస్ పాలనా వైఫల్యాలపై ఈనెల 26న కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి సంతకాల సేకరణ చేస్తామని ప్రకటించారు.

కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్ 19: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జిల్లా కబడ్డీ అసోసిషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా జూనియర్ కబడ్డీ శిక్షణ శిబిరాన్ని,ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన కబడ్డీ మ్యాటును రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తుందని తెలిపారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడా యూనివర్సిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.రాజన్నసిరిసిల్ల జిల్లా పరిధిలో క్రీడాకారులు ముందుకు వస్తే రాష్ట్ర స్థాయిలో క్రీడలను నిర్వహించడానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.. ఇటీవల క్రికెట్ క్రీడాకారులకు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో క్రీడా మైదానాలు కేటాయించడం జరిగిందన్నారు. గతంలో కబడ్డీ క్రీడాకారులకు ఇచ్చిన మాట ప్రకారం కబడ్డీ మ్యాట్ మంజూరు చేశామని తెలిపారు.

సీఎంను కలిసిన సీపీఐ నేత చాడ

- మానేరు రివర్ ఫ్రంట్లో అక్రమాలపై విచారణ చేపట్టాలి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 19: కరీంనగర్ నగరంలోని మానేరు రివర్ ఫ్రంట్ లో అవినీతి,అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని, జిల్లాలోని ఇతర సమస్యలపై సిపిఐ సీనియర్ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి బుధవారం హైదరాబాద్ లో సీఎం ఎనుముల రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కరీంనగర్ నగరంలో మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనుల పేరుతో గత ప్రభుత్వం రివర్ ఫ్రంట్ నిర్మాణం కోసం 500 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని అందులో టూరిజం శాఖ 100 కోట్లు అలాగే నీటిపారుదల శాఖ 100 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసిందని, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మానేరు రివర్ ఫ్రంట్ పనుల నిర్మాణాన్ని చేపట్టి,ఆ నిర్మాణ పనులను పూర్తి చేయుటకు బీఆర్ఎస్ నాయకుల అనుచరులకు అప్పగించి పూర్తి చేయకపోవడం వల్ల రివర్ ఫ్రంట్ లో చేసిన పనులు నాణ్యత ప్రమాణాలు లోపించాయని ఆ పనులు పూర్తిగా దారులకు కొంత బిల్లులు చెల్లించినప్పటికీ నిర్మాణ పనుల్లో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయనే విషయాన్ని సీఎం దృష్టికి వెళ్లినట్లు వెంకటరెడ్డి తెలిపారు.రివర్ ఫ్రంట్ పరిధిలోని చెక్ డ్యాములు నిర్మిస్తే వాటిలో కూడా నాణ్యత ప్రమాణాలు పాటించకుండా వర్షాకాలంలో వర్షాలు కురిస్తే అవి కొట్టుకుపోయాయని, చెక్ డ్యాములు కొట్టుకపోయినప్పటికీ రివర్ ఫండ్ నిర్మాణ పనుల నిధులు విడుదల అయ్యాయని, ఐదు సంవత్సరాలకు పైగా సమయం గడుస్తున్న నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదని తక్షణమే రివర్ ఫండ్ పనుల్లో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడంతో సీఎం సానుకూలంగా స్పందించారని, అలాగే జిల్లాలోని సమస్యలపై కూడా వివరించడం జరిగిందని చాడ వెంకటరెడ్డి తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది

- రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- ఉచిత చేప పిల్లలను విడుదల చేసిన మంత్రి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ నవంబర్ 19: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 100% సబ్సిడీపై ఉచిత చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్గటూర్ మండలం స్థంభం పల్లి గ్రామంలోని కంపెల్లి చెరువులో 48, 500 చేప పిల్లలను నేరుగా విడుదల చేస్తూ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల)బి. రాజ గౌడ్ పాల్గొన్నారు.అనంతరం వెల్గటూర్ మండలానికి చెందిన 29 మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్ అధికారులతో కలిసి అందజేశారు. కార్యక్రమానికి ముందుగా మంత్రి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో చేపల పెంపకం కీలక పాత్ర పోషిస్తోంది. అందుకే ప్రభుత్వం 100% సబ్సిడీతో చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. చెరువుల పునరుద్ధరణ, నీటి నిల్వ సామర్థ్యాల పెంపు, మార్కెట్ సదుపాయాల విస్తరణ ఈ దిశగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. మత్స్యకార కుటుంబాల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గ్రామానికి విస్తరిస్తామని తెలిపారు.

డ్రైవర్ పై దాడి ఘటనలో చర్యలు తీసుకోవాలని ఆదేశం

- ఎస్పీతో మాట్లాడిన మంత్రి 'పొన్నం'

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్. నవంబర్ 19: రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామం వద్ద ఆర్టీసీ డ్రైవర్ పై జరిగిన దాడిని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగి పై ఉద్దేశ్యపూర్వకంగా దాడి చేయడం హేయమైన చర్య అని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ తో మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్ లో మాట్లాడారు. ఆర్టీసీ డ్రైవర్ పై దాడి చేసిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా రవాణా వ్యవస్థలో ప్రయాణికుల కోసం నిరంతరం శ్రమిస్తున్న ఆర్టీసీ సోదరులపై దాడి ఉపేక్షించేది లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకుంటామని ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ మనోధైర్యాన్ని ప్రకటించారు.

మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ దంపతుల షష్టిపూర్తి

- పెద్దసంఖ్యలో హాజరైన అభిమానులు

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, నవంబర్ 19: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పురాణం సతీష్ దంపతుల షష్టిపూర్తి వేడుకలు మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సతీష్ దంపతుల బంధువులు, కుటుంబ సభ్యులతోపాటు ఆయన అభిమానులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు వారికి ఆశీర్వాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్యాలు కూడ అలరించాయి. బంధువులతో పాటు నాయకులు, కార్యకర్తలు కూడ సతీష్‌కుమార్ దంపతులను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈసందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ తన 60 ఏళ్ల షష్టిపూర్తి వేడుకలకు పెద్ద సంఖ్యలో నాయకులు, కుటుంబ సభ్యులు హాజరుకావడం ఆనందంగా ఉందని ఇది తన జీవితంలో మరిచిపోలేనిదని తెలిపారు. తాను ఏ పదవిలో ఉన్న తాను పుట్టిన కోటపల్లికి మరిచిపోలేనని పేర్కొన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే రాజకీయ జన్మనిచ్చింది కోటపల్లి అని తెలిపారు. నిస్వార్థ లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ప్రజలతో సంబంధం లేకుండా ప్రజలకు సేవా చేస్తూనే ఉంటామని తెలిపారు. తన కుమారులు కూడ ప్రజలకు ఏదో సేవా చేయాలని సహాయసహకారాలు అందిస్తున్నారని, ఇంతకంటే తల్లిదండ్రులుగా ఏమి కోరికలు ఉండవన్నారు. ఈ వేడుకలకు వచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు ముల్కల శశిపాల్ రెడ్డి, వేముల రాజం, ఎండీ సలీం, గోనే మోహన్ రెడ్డి, పుష్పాల సతీష్, పుష్పాల సుధాకర్ , గట్టయ్య, ఆసంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మైసమ్మ గుళ్లను కూల్చిన అధికారులపై హైకోర్టు ఆగ్రహం

- క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హైకోర్ట్ ను ఆశ్రయించిన మద్దెల దినేష్

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 19: రామగుండం నగర పాలక సంస్థ అధికారులు దారి మైసమ్మ గుళ్ల కూల్చివేత పై హైకోర్ట్ లో పిటిషన్ దాఖలు అయిందని సామజిక కార్యకర్త మద్దెల దినేష్ పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవంబర్ 5న అర్ధరాత్రి గోదావరిఖనిలో రోడ్లకు అడ్డంగా దారి మైసమ్మ గుళ్లు ఉన్నాయని, జీఓ సుప్రీం కోర్ట్ ఆర్డర్ ప్రకారమే కూల్చివేసారని, స్థానిక ప్రజలు ఎంతో నమ్మకంతో భక్తి శ్రద్దలతో కొలిచే దారి మైసమ్మ గుళ్ళను పూజిస్తూ సుమారు 30 నుండి 35 ఏళ్ల క్రితం నిర్మిస్తే వాటిని సునాయసంగా కూల్చి వేయడం దుర్మార్గపు చర్య అని, మున్సిపల్ అధికారుల పై పోలీస్ యంత్రాంగంకు ఫిర్యాదు చేసినప్పటికిని ఎలాంటి చర్య తీసుకోక పోవడంతో, హైకోర్ట్ లో పిటిషన్ దాఖాలు చేయడం జరిగిందని పిటిషనర్ మద్దెల దినేష్ తెలిపారు. హైకోర్ట్ లో గుళ్ల కూల్చివేత పై బుధవారం విచారణ జరుగగా మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ హాజరై తప్పును కప్పి పుచ్చుకునే ప్రయత్నం చేయగా కోర్ట్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా, అధికార యంత్రాంగమే కూల్చివేశారని కోర్టులో ఒప్పుకున్నారని, దారికి అడ్డంగా ఉన్న 15 గుళ్లు మాత్రమే తొలగించామని హైకోర్టుకు తెలిపారని పేర్కొన్నారు. అసలు గుళ్ల కూల్చివేత పై ముందుగా ప్రజలకు చెప్పాల్సిన అవసరం? లేదా అని ప్రజల అనుమతి తీసుకున్నారా? అని హైకోర్ట్ మున్సిపల్ అధికారులను ప్రశ్నించగా అధికారులు వేరే చోట గుళ్ల నిర్మాణం కోరుకు భూమి కేటాయించామని చెప్పారని, భూమి అలాట్ మెంట్ లెటర్ ఏదని కోర్టు అడగగా అధికారులు మౌనం వహించారని పేర్కొన్నారు. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్ అరుణ శ్రీ, టౌన్ ప్లానింగ్ అధికారి నవీన్ పేర్లను పిటిషన్ నుండి తొలగించాలని కొరగా హైకోర్ట్ నిరకరించిందని తెలిపారు. కోర్ట్ రెండు వారాలు గడువు ఇస్తూ గుళ్ల ను ఎందుకు కూల్చారో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయమని ఆదేశించిందని, ఈ విషయం పై పోలీస్ డిపార్ట్మెంట్ విచారణ చేసి డీటెయిల్డ్ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయమని, జిల్లా కలెక్టర్ ని ప్రత్యేక కౌంటర్ పిటిషన్ దాఖలు చేయమని హైకోర్టు ఆదేశాలు జారి చేసిందని మద్దెల దినేష్ తెలిపారు.

స్వచ్ఛతలో హుస్నాబాద్‌ను అగ్రస్థానంలో ఉంచాలి

- మున్సిపల్‌కమిషనర్ మల్లికార్జున్
- ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా పబ్లిక్ టాయిలెట్ల పర్యవేక్షణ

-ప్రతిపక్షం,హుస్నాబాద్, నవంబర్19: ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని హుస్నాబాద్ పట్టణ పురపాలక కమిషనర్ టి. మల్లికార్జున్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సివిల్ ఆసుపత్రి సమీపంలో ఉన్న పబ్లిక్ టాయిలెట్‌ను కమిషనర్ బృందం పర్యవేక్షించింది.ఈ సందర్భంగా కమిషనర్ టి. మల్లికార్జున్ మాట్లాడుతూ... పట్టణ ప్రజలు బహిరంగ మలమూత్ర విసర్జన పూర్తిగా మానేయాలని, ప్రతి ఇంటిలో ఉన్న మరుగుదొడ్లనే తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. బయట తిరిగే సమయంలో ప్రజలు పబ్లిక్ టాయిలెట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎఫ్ఎస్టీపీ అందుబాటులో ఉంది

పరిశుభ్రతలో భాగంగా సెప్టిక్ ట్యాంకుల గురించి ప్రస్తావిస్తూ, ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి వాటిని తప్పనిసరిగా శుభ్రం చేయించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అంతేకాకుండా, పట్టణంలో మల వ్యర్థ శుద్ధి కేంద్రం(ఎఫ్ఎస్టీపీ) కూడా అందుబాటులో ఉందని, పట్టణ ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, హుస్నాబాద్ పట్టణాన్ని స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలపాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాల ఎల్లం, శంకర్, పర్యావరణ అధికారి రవికుమార్, వార్డు అధికారులు, పబ్లిక్ టాయిలెట్ కేర్ టేకర్ రాజు, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా రామగుండంను తీర్చిదిద్దుతా

- నది తీరాన గోదారిమాత ఆలయాల నిర్మాణం
- రూ.5 కోట్లతో సమ్మక్క సార్లమ్మ జాతర ప్రాంగణాల అభివృద్ధి
- ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్

ప్రతిపక్షం, ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 19 : శ్రీరామచంద్ర ప్రభు నడయాడిన రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ అన్నారు. బుధవారం రామగుండంలో 108 అడుగుల పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటుకు సంబంధించి ముందస్తుగా అంజనాద్రి గుట్టపై సామూహిక సత్యనారాయణ వ్రత మహోత్సవం అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు.తనను నమ్మిన ఈ ప్రాంత ప్రజలఆకాంక్షల మేరకు రామగుండంను అభివృద్ధి చేయడం నా కర్తవ్యం అన్నారు. పరిశ్రమలకు పుట్టినిల్లుగా ఉన్న రామగుండం గోదావరి తీర ప్రాంతం ఆధ్యాత్మికత విరజిల్లేందుకు తాను శక్తికి మించి కృషి చేస్తానని తెలిపారు.ఇదే గుట్ట పై ఎత్తైన మహాశివుని విగ్రహంతో పాటు దుర్గామాత అమ్మవారు,మానస దేవి,కామాక్షి అమ్మవారి ఎత్తైన విగ్రహాల ప్రతిష్టాపన చేస్తామన్నారు. రాముని గుండాల గుట్ట పరిసర ప్రాంతాన్ని ఆధ్యాత్మిక కేంద్రంతో పాటు ఊహించని రీతిలో ప్రత్యేక పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సన్నహాలు చేస్తున్నట్లు మక్కన్ సింగ్ పేర్కొన్నారు.అంతర్గాం మండలం మోర్ మోర్,ఎల్లంపల్లి, గోలివాడ నది తీరా ప్రాంతాల్లో గోదారి మాత ఆలయ నిర్మాణాలు చేపడతామన్నారు. గోదావరిఖని పట్టణంలోని సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంగాన్ని 5 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, గోలివాడ తక్కలపల్లి సమ్మక్క జాతర్ల ప్రాంతాలను కూడా కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.రామగుండం నియోజక వర్గ ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కాంక్షిస్తూ ఈప్రాంతాన్ని పవిత్ర పుణ్యక్షేత్రాల నిలయంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్య మని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. అలాగే అతిత్వరలో రామగుండం నుఎడ్యుకేషనల్ హబ్ గా తీర్చిదిద్దానున్నామని తెలిపారు. సనాతన ధర్మంతో పాటు ముస్లిం, క్రిస్టియన్,మైనారిటీ ల మతాలను గౌరవిస్తూ వారి ఆలయాలను,మసీదులను కూడా అభివృద్ధి చేయడం తన బాధ్యతని మక్కన్ సింగ్ నొక్కి చెప్పారు.

గోదావరి నది తీరాన వేద పాఠశాల

పవిత్ర గోదావరి నది తీరాన వేద పాఠశాల ను అతి త్వరలోనే ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే మక్కన్ సింగ్ తెలిపారు.ఈ ప్రాంతంలోని వేద పండితుల అభిలాష మేరకు వేద పాఠశాల నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.గోదావరి నది తీరాన ఒక ఎకరం స్థలంలో వేద పాఠశాల ఏర్పాటుచేస్తామని, అక్కడ పాఠశాల నిర్వహణకు సంబంధించి హాలు నిర్మాణం తన సొంత ఖర్చుతో చేపిస్తానని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

30 ఏళ్ల కిందట మాదిరిగా ఇప్పుడు పనిచేయలేం. కొత్త ప్రభుత్వాలు, ప్రత్యర్థులను ఎదుర్కొంటున్నాం. సాకులు, నిందలు లేకుండా వాస్తవాలను అంగీకరించాలి. గ్రౌండ్ రియాల్టీ తెలియని కొద్దిమంది చేతుల్లోనే అధికారం కేంద్రీకృతం అవడం వల్లే ఓటములు ఎదురవుతున్నాయి. ఇకనైనా కాంగ్రెస్‌మేలుకొని మార్పులు చేయకపోతే కష్టం.

-బిహార్ ఓటమిపై కాంగ్రెస్‌నేత అహ్మద్ పటేల్ కూతురు ముంతాజ్ పటేల్

ప్రాంతీయం

ట్యాబ్ ఎంట్రీలు వేగంగా చేయాలి

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి
- ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశం

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 19: ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలలో సకాలంలో బిల్లులు జమ అయ్యేందుకు ట్యాబ్ ఎంట్రీలను వెంటవెంటనే చేయించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. ఏర్గట్ల మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంను సందర్శించి భూభారతి దరఖాస్తుల పరిష్కారం, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక ప్రక్రియ అమలు తీరుపై సమీక్ష జరిపారు. కొనుగోలు కేంద్రం తనిఖీ చేసిన సందర్భంగా ఇప్పటి వరకు ఎంత పరిమాణంలో ధాన్యం సేకరించారు, ఎన్ని లారీల లోడ్ల ధాన్యం మిల్లులకు తరలించారు, ఇంకా ఎన్ని లోడ్ల ధాన్యం కేంద్రానికి వస్తుంది, వరి కోతలు పూర్తయ్యాయా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లులకు ధాన్యం పంపిన వెంటనే దిగుమతి చేసుకునేలా పర్యవేక్షణ జరపాలని, వెంటవెంటనే ట్రక్ షీట్లు తెప్పించుకుని ట్యాబ్ ఎంట్రీలు చేయించాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న ట్యాబ్ ఎంట్రీలన్నీ ఈ రోజే పూర్తి చేయాలని అన్నారు. అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ రెవెన్యూ అధికారులు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ అమలు కోసం 2002, 2025 ఓటరు జాబితాలను మ్యాపింగ్ చేసి రూపొందించిన వివరాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. మ్యాపింగ్ లో తప్పిదాలు లేకుండా మరోమారు పోలింగ్ కేంద్రం వారీగా క్షుణ్ణంగా పరిశీలన చేయాలన్నారు. భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని సూచించారు. సాదాబైనామా అర్జీలను తిరస్కరిస్తే, అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని అన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మల్లయ్య, స్థానిక అధికారులు ఉన్నారు.

గీత పారిశ్రమిక సహకార సంఘం సమావేశం

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 19 : జిల్లా కేంద్రంలోని గీత పారిశ్రమిక సహకార సంఘం నిజామాబాద్ నం1 సంఘంలో 72వ అఖిలభారత సహకార వారోత్సవాలలో భాగంగా బుధవారం ప్రత్యేక సమావేశం జరిగింది. జిల్లా మధ్యపాన అబ్కారి శాఖ అధికారి కే మల్లారెడ్డి, జిల్లా సహకార అధికారి, జాయింట్ రిజిస్ట్రార్ ఎన్ శ్రీనివాస్ రావు లు ఈ సమావేశానికి హాజరై సంఘ అధ్యక్ష ఇతర కార్యవర్గ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన 'సహకారం తో ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణము' అను నినాదం తో సహకార వ్యవస్థ ను వినియోగించుకొని ఆర్థిక స్వావలంబాన కల్లు గీత కార్మిక సంఘల సభ్యులు అభివృద్ధి చెందుటకు కల్లు గీత పారిశ్రమిక సహకార సంఘాల బైలాల ను అనుసరించాలని, ప్రభావవంతమైన మార్కెటింగ్ పద్ధతులు సహకార ఆధారిత వ్యాపార స్థిరత్వం పై సభ్యులకు మార్గానిర్దేశం చేశారు. మెరుగైన రికార్డుల నిర్వహణ కస్టమర్ స్నేహ పూర్వకమైన పద్ధతులను ఆవాలంభించాలని సూచించారు. ఈ వారోత్సవాలకు అబ్కారి శాఖ తరపున నిజామాబాద్ స్టేషన్ సీఐ, ఎస్సై లు, సహకారం శాఖ తరుపు నుండి కోఆపరేటివ్ ఇన్స్పెక్టర్, ఆఫీస్ సూపరింటెండెంట్స్ హాజరయ్యారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రతిపక్షం ప్రతినిధి ,నిర్మల్, నవంబర్ 18 : నిర్మల్ రూరల్ మండలం రత్నాపూర్ కాండ్లి లో ఎఫ్ ఎస్ సి ఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రంను మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీం రెడ్డి బుధవారం ప్రారంభించినారు. అదేవిదంగా సోన్ మండలంలో గంజాల్,కడ్తాల్ ,జాఫ్రాపూర్ గ్రామాలలో పిఎసిఎస్ డిఆర్డిఏ ల ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను గౌరవ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా బీమ్ రెడ్డి,ఆత్మ చైర్మన్ రాంరెడ్డి ప్రారంభించినారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ ఏ సి ఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, పాక్స్ చైర్మన్ ప్రసాద్ రెడ్డి, మాజీ సర్పంచ్ మోహినొద్దీన్, డి సి ఓ నర్సయ్య, రైతులు, గ్రామస్థులు, పిఎసిఎస్ సెక్రటరీ, సీసీ జక్కా సాయన్న కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

విలువలతో జీవిస్తేనే కుటుంబాలు బాగు

- వయో వృద్ధులను గౌరవించాలి
- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్

ప్రతిపక్షం, భూపాలపల్లి, నవంబర్ 19: విలువలతో జీవించి ముందు తరాలవారికి మార్గ నిర్దేశం చేస్తేనే కుటుంబాలు బాగుంటాయని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ ఆర్ దిలీప్ కుమార్ నాయక్ అన్నారు. వయోవృద్ధుల సంరక్షణ చట్టం, వారి సంక్షేమం అనే అంశం మీద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. తల్లిదండ్రులను వేధించేవారికి ఆస్తులపై హక్కు ఉండదని జడ్జి పేర్కొన్నారు. కుటుంబ పెద్దలు ఎలా తీర్చిదిద్దితే ఆయా కుటుంబాల్లోని సభ్యులు అలా తయారవుతారని, పెద్దలను గౌరవించే సంస్కృతి పెరుగుతుందన్నారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన పథకాలు వారికి చెందేవిధంగా కృషి చేయాలనీ జిల్లా సంక్షేమ అధికారికి, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ అధికారులకు సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సబ్ కోర్టు ప్రాంగణంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పుప్పాల శ్రీనివాస్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే.అక్షయ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, వయోవృద్ధుల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ములుగు జిల్లాలో చలి పంజా

- వణికిపోతున్న గ్రామాలు, పట్టణాలు

ప్రతిపక్షం, ప్రతినిధి, ములుగు, నవంబర్ 19: జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత అత్యధిక స్థాయికి చేరుకుంది. గత వారంనుంచే చలి ఊపందుకున్నప్పటికీ, గత మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోవడంతో ప్రజలు నిత్యజీవితంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాతావరణ శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం, ఈసారి శీతాకాలం సాధారణం కంటే ఎక్కువగా ప్రభావం చూపుతుందని అంచనా. జిల్లాలో పలు చోట్ల కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల మార్క్‌ను తాకాయి. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి పూట పరిస్థితి మరింత కఠినంగా మారింది. ఫోటోలో కనిపిస్తున్నట్లుగా, ఒకే కుటుంబం మాత్రమే కాకుండా పక్కింటి వారంతా కలిసి చిన్న మంటలు వేసుకుని వేడిని తెచ్చుకుంటున్నారు. చలి తీవ్రత కారణంగా చేతులు, కాళ్లు గట్టిపడే స్థితి రావడంతో పిల్లలు, వృద్ధులు ముఖ్యంగా ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొలి గంటల్లో భారీగా ఏర్పడుతున్న పొగమంచు వాహన రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. ప్రధాన రహదారులపై విజిబిలిటీ తీవ్రంగా తగ్గిపోవడంతో వాహనదారులు వేగం తగ్గించుకోవాల్సి వస్తోంది. రోడ్డు ప్రమాదాలు పెరిగే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తం అయ్యారు. అదే విధంగా, పల్లెబస్తీల్లో పొగమంచు మరింతగా ఉండటంతో పాఠశాలకు వెళ్లే చిన్నపిల్లలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. చలి ప్రభావంతో వ్యవసాయ పనులు దాదాపు నిలిచిపోయాయి. ఉదయం పూట పొలాల్లో పనిచేయడం రైతులకు కష్టసాధ్యమైంది. మొక్కజొన్న, పప్పుధాన్యాలు, పెసర, వేరుశనగ వంటి పంటలపై మంచు ప్రభావం పడే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ హెచ్చరించింది. "తొలి కాంతి పడే వరకు పొలాలకు వెళ్లలేం. మంచు పడితే దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది," అని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చలి తీవ్రతతో జలుబు, దగ్గు, శ్వాస సంబంధిత ఇబ్బందులు, గుండె సమస్యలతో బాధపడేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. జిల్లా ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య గత మూడు రోజుల్లో 40% పెరిగినట్లు వైద్యాధికారులు తెలిపారు. డాక్టర్లు చిన్నపిల్లలు, గర్భిణీలు, వృద్ధులు తప్పనిసరిగా వేడి దుస్తులు ధరించాలని సూచించారు. రాత్రివేళల్లో మంటల దగ్గర ఎక్కువసేపు కూర్చునేటప్పుడు జాగ్రత్తలు అవసరమని హెచ్చరించారు.

దుప్పట్ల పంపిణీ, ఆశ్రయ కేంద్రాలు సిద్ధం

చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అత్యవసర సమీక్ష నిర్వహించారు. నిరాశ్రయులు, వృద్ధులు, అంగవైకల్యంతో ఉన్నవారిని గుర్తించి వారికి దుప్పట్లు, వేడి దుస్తులు పంపిణీ చేయాలని ఆదేశించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో రాత్రిపూట చలి నుండి రక్షణ కోసం తాత్కాలిక ఆశ్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో అంగన్వాడీలు, సంఘ భవనాల్లో ప్రత్యేక హెల్ప్‌లైన్లు కూడా సిద్ధం చేశారు. ఉత్తర దిశ నుంచి వీస్తున్న చల్లని గాలుల ప్రభావంతో జిల్లాలో ఇంకా కనీసం 72 గంటలపాటు చలి ఉధృతి కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు మరో 2-3 డిగ్రీలు పడిపోయే అవకాశం ఉందని హెచ్చరించింది.

ఘనంగా ఇందిరమ్మ జయంతి వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 19: ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో 5 ఏళ్ల పదవీ కాలంలో మఖ్తల్ నియోజకవర్గానికి భారీ నిధులు తీసుకువచ్చి, అభివృద్ధి చేస్తామని మంత్రి వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారని, ఇందిరమ్మ స్ఫూర్తితో సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి అందించడమే ధ్యేయంగా పని చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, బ్యాంకుల జాతీయాకరణ, 20సూత్రాల పథకం, గరీబీ హటావో, పేదలకు ఇండ్లు లాంటి పథకాలతో పేద ప్రజలకు అండగా నిలిచారని కొనియాడారు. ఇందిరమ్మ స్ఫూర్తితో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి నాయకత్వం లో మఖ్తల్ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు, పట్టణానికి దాదాపు 300పైగా ఇండ్లు కేటాయించారని తెలిపారు. బిల్లులు రావని ప్రతి పక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ఇప్పటికే నియోజకవర్గం లో అనేక మంది లబ్ధిదారులు బిల్లులు తీసుకున్నారన్న సంగతి గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇల్లు కింద 5 లక్షల రూపాయలు ప్రభుత్వం పూర్తి ఉచితంగా అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధికారుల సమక్షంలో నూతనంగా ఇందిరమ్మ లబ్ధిదారుల ప్రొసీడింగ్స్ మంత్రి కార్యాలయంలో ఇవ్వడం జరిగింది, కార్యక్రమంలో నాయకులు మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా జయంతి

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 19: సారంగాపూర్ మండలంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దశరథ రాజేశ్వర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులుబొల్లోజీ నర్సయ్య ఇంద్ర గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఇందులో రాజ్ మహమ్మద్, బట్టు, భోజన్న, లస్మన్న, నర్సారెడ్డి, ఓలత్రి నారాయణరెడ్డి, కోర్వ నవీన్, స్వదేశ్ సోషల్ మీడియా బొమ్మెడ సత్యం పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయపేట్, నవంబర్ 19: నారాయణపేట జిల్లా మక్తల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాంలో యాసంగి వరి సాగుకు అవసరమైన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, సొసైటీ సీఈఓ రాములు తెలిపారు. విత్తనాలు పొందాలనుకునే రైతులు తమ ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదారు పాసుపుస్తకం, మరియు ఇతర అవసరమైన పత్రాలతో సంఘం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

వృద్ధులను గౌరవించుకోవడం మనందరి బాధ్యత

- జిల్లా రెవెన్యూ అధికారి వై. వి. గణేష్

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 19: వయో వృద్ధులను మనందరం గౌరవించుకోవడం బాధ్యత అని హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) వై.వి. గణేష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలు లో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఓల్డర్ పెన్షనర్స్)ను జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ నందు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా డీఆర్వో వై. వి.గణేష్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. వయో వృద్ధులను గౌరవించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి జయంతి మాట్లాడుతూ వయో వృద్ధుల సంక్షేమం కోసం డే కేర్ సెంటర్స్ ప్రారంభించడం జరిగిందన్నారు. నిరాదరణ గురవుతున్న వయోవృద్ధుల కొరకు ఓల్డేజ్ హోమ్స్ ఉన్నాయని, అలాగే తల్లి తండ్రులని పట్టించుకోని వారి పిల్లలపైన తల్లి తండ్రుల పోషణ, సంరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆర్డీవో ట్రిబ్యునల్ ద్వారా వయో వృద్ధులను పట్టించుకోని పిల్లల నుండి రూ. 10 వేల వరకు నెలవారి మెయింటెనెన్స్ ఖర్చులకు వయో వృద్ధులకు ఇచ్చే విధంగా ఉత్తర్వులు జారీ చేస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, అడిషనల్ డిఎంహెచ్ వో మదన్ మోహన్ రావు, డిస్ట్రిక్ట్ హాస్పిటల్స్ కోఆర్డినేటర్ డాక్టర్ గౌతమ్ చౌహాన్, సీడీపీఓలు విశ్వజ, స్వరూప, ఉమ, సూపర్వైజర్స్, ఎఫ్ ఆర్ వో రవికృష్ణ, ట్రిబ్యునల్ బెంచ్ మెంబర్ అనితా రెడ్డి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్.ప్రవీణ్ కుమార్, డిజేబుల్ హాస్టల్ వార్డెన్ శ్వేత, ఉష, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ తేజశ్వి, రజిత, రాజేష్,స్టాఫ్ నర్స్ సుమలత ,సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్స్ ప్రభాకర్ రెడ్డి, రామమూర్తి, నర్సయ్య,నర్సింహులు, సమ్మయ్య, అసోసియేషన్ దేవాచారి,యుగేందర్,రాజేందర్,పీఎల్ఎన్‌రావు,తదితరులు పాల్గొన్నారు.

పటేల్ కృషితోనే దేశం ఐక్యతతో ఉంది

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

ప్రతిపక్షం, భూపాలపల్లి, నవంబర్ 19: ఉక్కుమనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితోనే భారతదేశం ఐక్యంగా ఉందని ఊపర్లపల్లి ఎమ్మెల్యే గంటా సత్యనారాయణరావు అన్నారు. పటేల్ దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసారని ఆయన స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి శాసనసభ్యులు సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ భారత దేశ స్వేచ్ఛ కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ తపించే వారని అన్నారు. దేశంలో ఎన్ని భాషలు మాట్లాడినా, ఎన్ని ప్రాంతాలు ఉన్నా అందరం ఒకటేనని చాటి చెప్పారని వివరించారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత కూడా సంస్థానాలుగా విడివిడిగా ఉన్న దేశాన్ని ఒక్కటి చేయడంలో సర్దార్ పటేల్ విశేష కృషి చేశారన్నారు. భారత దేశ ప్రజల్ని చైతన్య పరిచి ఏకతాటిపై నడిపించిన మహనీయుడని కొనియాడారు. ప్రజలు ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే మన దేశాన్ని డ్రగ్స్ రహిత భారత దేశంగా తీర్చిదిద్దడానికి భారత ప్రభుత్వం చేపట్టిన నషా ముక్తి భారత్ అభియాన్ ప్రతిజ్ఞను చేయించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో కేంద్ర యువజన సర్వీసులు క్రీడ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్, ఎన్ఎస్ఎస్, ఎన్సిసి సంస్థలు సర్దార్@150 ఐక్యత పాదయాత్రను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి శాసనసభ్యులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మేరా యువభారత్ వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, సూపరిన్టెండెంట్ బానోతు దేవిలాల్, అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, యువజన క్రీడల శాఖ అధికారి చిర్రా రఘు, సంక్షేమ అధికారి శ్రీమతి మల్లేశ్వరి, ఉపాధ్యాయులు కృష్ణ మోహన్, కార్యక్రమ నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసిన సభ్యులు కన్నం యుగదీశ్వర్, తాటికొండ రవి కిరణ్, గాలిఫ్, వాలంటీర్లు, మహిళా సంఘ సభ్యులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

“



ప్రకృతి వ్యవసాయానికి అంతర్జాతీయ హబ్‌గా మారే దిశలో భారత్ పయనిస్తోంది. మన జీవవైవిధ్యం కొత్త రూపు సంతరించుకుంటోంది. దేశ యువత వ్యవసాయాన్ని ఆధునికమైన, విస్తృతి కలిగిన అవకాశంగా చూస్తున్నారు. దీనివల్ల దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింతగా బలపడుతుంది. వ్యవసాయ ఎగుమతులు దాదాపు రెండింతలయ్యాయి.

- తమిళనాడు పర్యటనలో ప్రధాని మోడీ

బిహార్ ముఖ్యమంత్రిగా నేడు నితీశ్ ప్రమాణం

- ఆయనతో పాటు పలువురు మంత్రులు కూడా

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 19: బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బుధవారం నాడు జరిగిన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో తమ నేతగా నితీశ్‌ను ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. అనంతరం గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ వద్దకు వెళ్లిన నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా సమర్పించారు. గవర్నర్ దానిని ఆమోదించారు. తరువాత నితీశ్ కుమార్, ఎన్డీయే కలిసి తమను నూతన ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌ను కోరారు. గురువారం పాట్నాలో పదోసారి బిహార్ సీఎంగా నితీశ్ కుమార్ ప్రమాణం చేస్తారు. ఆయనతో పాటు పలువురు మంత్రులు కూడా ప్రమాణం చేస్తారు. కాగా, బీజేపీ శాసనసభా పక్షనేతగా తారాపుర్ ఎమ్మెల్యే సామ్రాట్ చౌదరిని ఎన్నుకున్నారు. పాట్నాలోని గాంధీ మైదానంలో ప్రమాణ స్వీకారం జరగనుంది. స్పీకర్ పదవి సహా కీలక మంత్రి పదవుల కేటాయింపుపై ఎన్డీయే పక్షాల చర్చలు జరుగనున్నాయి. బీజేపీ, జేడీయూ పార్టీలు కూడా స్పీకర్ పదవి కోసం పట్టుబడుతున్నాయని సమాచారం. గత అసెంబ్లీలో బీజేపీకి చెందిన నందకిశోర్ యాదవ్ స్పీకర్‌గా, జేడీయూ చెందిన నరేంద్ర నారాయణ్ యాదవ్ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నారు. అయితే ఈసారి కూడా స్పీకర్ పదవిని దక్కించుకోవాలని బీజేపీ భావిస్తోంది. బీజేపీకి 15 లేదా 16, జేడీయూకు 14, ఎల్జేపీ (రామ్‌విలాస్) పార్టీకి మూడు, ఆర్ఎల్ఎం, హెచ్ఏఎంలకు ఒక్కోటి చొప్పున మంత్రిపదవులు లభించే అవకాశం ఉంది. కాగా, ఉప ముఖ్యమంత్రులు ఎందరు? ఎవరెవరికీ ఇస్తారు? అనే విషయంపై ప్రస్తుతానికి ఎటువంటి సమాచారం లేదు.

విశ్వ వీక్షణం

రాజేంద్ర ప్రసాద్‌దత్త పుత్రుడిని కలవనున్న రాష్ట్రపతి

- తగిన ఏర్పాట్లు చేసామని అధికారులు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 19 : భారతదేశ తొలి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్‌దత్త పుత్రుడు బసంత్ పాండో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలవనున్నారు. ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేసామని అధికారులు తెలిపారు. బసంత్ పాండోను రాజేంద్ర ప్రసాద్ దత్తత తీసుకున్నారనే సమాచారం ఉంది. ఈ విషయాన్ని సూర్జాపుర్ జిల్లా అధికారులు ధ్రువీకరించారు. ఈ క్రమంలో రాష్ట్రపతితో బసంత్‌ను కలిపించేందుకు ఛత్తీస్‌గఢ్ సాంస్కృతిక శాఖ మంత్రి రాజేశ్ అగర్వాల్‌చొరవ తీసుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం నాడు ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపుర్‌లో పర్యటించనున్నారు. ఈ క్రమంలో పాండో తెగకు చెందిన గిరిజనలు ఓ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇక్కడే ఆమె బసంతోను కలవనున్నారు. సర్గుజాను సందర్శించిన రెండో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. అంతకుముందు 1952లో దేశ తొలి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ సుర్గుజాను సందర్శించారు. అపుడు ఎనిమిదేండ్ల పిల్లవాడైన బసంతో పాండేను దత్తత తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన వయసు 80 యేండ్లు. రాష్ట్రపతి దత్తత తీసుకున్న తర్వాత బసంత్ పాండోకు ఆ గిరిజన తెగ 'రాష్ట్రపతి దత్త పుత్రుడి'గా గుర్తించారు. దత్తత తీసుకున్న సమయంలో ప్రభుత్వం తరఫున ఆ తెగవారికి ఎద్దులు, ఎడ్ల బండ్లు విత్తనాలు, ఎడ్ల బండ్లను అందించారు. దాదాపు 13 కాలనీలను కట్టించారు. ఇప్పుడు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తమ గ్రామాన్ని సందర్శించనున్నారని తెలిసినప్పటి నుంచి బసంత్ ఎంతో ఆనందంగా ఉన్నారు.

సింగిడి
హైదరాబాద్
గురువారం
20.11.2025

ప్రతిపక్షం
Prathipaksham.in

ఈ కాలంలో జలుబు, దగ్గు, జ్వరాలు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువ. పైగా జలుబు, దగ్గు అంటు వ్యాధులు. సులభంగా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి కూడా. ఇక ఆస్తమా ఉన్న వాళ్లకైతే చలికాలం నరకమే. వయోధికులకు చలికాలంలో ఇబ్బందులు ఎక్కువ కావటానికి రోగనిరోధకశక్తి తగ్గటం, ఎక్కువసేపు ఇంట్లోనే కూర్చొని ఉండటం వంటి రకరకాల అంశాలు దోహదం చేస్తుంటాయి. జలుబు, ఫ్లూ, న్యుమోనియా వంటివి చలికాలంలో ఎక్కువ.

బెంబేలెత్తిస్తోన్న చలి

ఆరోగ్యం జాగ్రత్త!.. ముఖ్యంగా చిన్నారులు,పెద్దలు

సూర్యుడు భూమి అక్షానికి దూరంగా ఉండే అర్ధగోళంలో ఉండటం వల్ల ఈ చల్లటి వాతావరణం ఏర్పడుతుంది. కొన్నిప్రాంతాలలో ఉష్ణోగ్రత కనిష్ట స్థాయికి పడిపోయింది. ఉదయం పది గంటలు దాటినా బయటకు రావాలంటే భయం వేస్తోంది. సాయంత్రం నాలుగు గంటలకే చలి మొదలవుతోంది. శీతాకాలం వస్తూ వస్తూ జబ్బులను కూడా మోసుకొస్తుంది. వాతవరణంలో మార్పులతో ఒంట్లోను పెను మార్పులే చోటు చేసుకుంటాయి. ఈ కాలంలో జలుబు, దగ్గు, జ్వరాలు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువ. పైగా జలుబు, దగ్గు అంటు వ్యాధులు. సులభంగా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి కూడా. ఇక ఆస్తమా ఉన్న వాళ్లకైతే చలికాలం నరకమే. వయోధికులకు చలికాలంలో ఇబ్బందులు ఎక్కువ కావటానికి రోగనిరోధకశక్తి తగ్గటం, ఎక్కువసేపు ఇంట్లోనే కూర్చొని ఉండటం వంటి రకరకాల అంశాలు దోహదం చేస్తుంటాయి. జలుబు, ఫ్లూ, న్యుమోనియా వంటివి చలికాలంలో ఎక్కువ. వృద్ధాప్యంలో సహజంగానే రోగనిరోధశక్తి తగ్గుతుంది. ఫలితంగా ఇలాంటి ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఎక్కువవుతుంది. చలి మూలంగా బయటకు వెళ్లటం కుదరదు. దీంతో చాలామంది ఇంట్లోనే ఉండిపోతుంటారు. శారీరక శ్రమ తగ్గుతుంది. ఇది కీళ్లు బిగుసుకోవటానికి, రక్త ప్రసరణ తగ్గటానికి దారితీస్తుంది. దీంతో కీళ్లనొప్పులు, మధుమేహం వంటి జబ్బులు తీవ్రమవుతాయి. వయోధికులకు మామూలు గానే దాహం అంతగా వేయదు. చలికాలంలోనైతే అసలు దాహమే వేయకపోవచ్చు. దీంతో నీళ్లు సరిగా తాగక ఒంట్లో నీటిశాతం తగ్గుతుంది (డీహైడ్రేషన్). దీని మూలంగా అప్పటి నే ఉన్న మూత్ర ఇన్ఫెక్షన్లు, కిడ్నీ సమస్యలు తీవ్రమవుతాయి. చలి, పొడి గాలి శ్వాసకోశాన్ని చికాకు పరుస్తుంది. దీంతో సీవోపీడీ, ఉబ్బసం, ఇతర ఛాతీ సమస్యలు ఉద్ధృతమవుతాయి. చలికాలంలో ఇల్లు వెచ్చగా ఉంచుకోవటం తప్పదు. కానీ ఈ క్రమంలో లోపల గాలి నాణ్యత పడిపోయే ప్రమాదముంటుంది. ఇదీ ఇబ్బందులు పెరిగేలా చేస్తుంది. ఈ కాలంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఊపిరితిత్తులపై చల్లని వాతావరణం చాలా ప్రభావం చూపుతుంది. వృద్ధులు, చంటి పిల్లలు, పిల్లల తల్లులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పసిపిల్లలు చలికి అసలు తట్టుకోలేరు. స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు తప్పనిసరిగా స్కూల్ డ్రెస్ తో పాటు జర్కిన్ లేదా కోటు వేసుకోవాలి. మంకీక్యాప్ లు ధరించాలి. రాత్రిళ్లు పొగమంచు కురిసే అవకాశం ఉంటుంది కనుక.. అత్యవసరమైతే తప్ప ఇల్లుదాటి బయటకి వెళ్లకపోవడమే ఉత్తమం. చలికాలం హార్మోన్ల నియంత్రణ మీదా

డా. కౌశల్ గోవర్ధన
7702417779
వైస్ చైర్మన్
శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
ధనుంజయ నర్సింగ్ హోమ్, హైదరాబాద్

ప్రభావం చూపుతుంది. ఉదాహరణకు కణాలు ఇన్సులిన్కు సరిగా స్పందించకపోవచ్చు. దీంతో మధుమేహం గలవారిలో రక్తంలో గ్లూకోజు మోతాదులు ఇంకాస్త పెరుగుతాయి. ప్రధానంగా శారీరక శ్రమ తగ్గటంతోనే రక్తంలో గ్లూకోజు మోతాదులు పెరుగుతుంటాయి.మరోవైపు చలిని తట్టుకోవటానికి విడుదలయ్యే ఒత్తిడి హార్మోన్లు కూడా ఇన్సులిన్ పనితీరును అడ్డుకుంటాయి. ఇవీ రక్తంలో గ్లూకోజు మోతాదులు పెరిగేలా చేస్తాయి. మధుమేహం ఎక్కువ కావటం వల్ల నాడులు దెబ్బ తినటం, పుండ్లు త్వరగా మానకపోవటం, గుండె జబ్బుల వంటి సమస్యల ముప్పు పెరుగుతుంది. మందులు క్రమం తప్పకుండా వేసుకోవాలి. ఉప్పుతో చేసే చిరుతిళ్లు, మిఠాయిలు, జంక్ ఫుడ్ కి దూరంగా ఉండాలి. ధ్యానం, ప్రాణాయామం, యోగా వంటి వాటితో ఒత్తిడిని తగ్గించుకోవాలి. ఇవి నిరంతరంగా పాటిస్తే చలికాలంలో ఆరోగ్యంగా ఉండటం సులువే.

రోజు కాస్త వ్యాయామం చాలు:

చలి కాలంలో ఎండ నెత్తిమీదకు వచ్చే వరకు చాలా మందికి బయటకు రావాలని అనిపించదు. అంతవరకు రోజూ వాకింగ్, యోగాకు వెళ్లేవారు సైతం బద్ధకిస్తారు. ఇది ఏ మాత్రం సరైన పద్ధతి కాదు. ఒకవైళ బయటకు వెళ్లలేకపోతే ఇంటిలోనైనా కనీసం అరగంట వ్యాయామం తప్పని సరిగా చేయాలి. అప్పుడు శరీరంలో చురుకుదనం, రోగ నిరోధకశక్తి పెరిగి వ్యాధులను తట్టుకునే శక్తి వస్తుంది. 5) పెంపుడు జంతువులతో కొన్ని రోజులు స్నేహం తగ్గిద్దాం: వైరస్ వ్యాప్తికి పెంపుడు జంతువులతో చెలిమి కూడా ఒక కారణమే. ఈ కాలంలో వాటిని బెడ్ రూం, వంట గదుల్లోకి రానీయకుండా చూసుకోవాలి. ఈ కాలంలో కొంచెం వాటితో స్నేహం తగ్గిస్తే మంచింది. చిన్నారులు, వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారు ఈ నియమం తప్పనిసరిగా పాటించాలి. 6) విటమిన్ డి లోపం ఎండ తగలకపోవడం వల్ల విటమిన్ డి లభించదు. ఎముకల ఆరోగ్యానికి, రోగ నిరోధకతకు విటమిన్ డి కీలకం అన్న విషయం తెలిసిందే. అందుకే ఉదయం వేళల్లో కనీసం ఓ పావు గంట ఆరుబయట సూర్యరశ్మిలో గడపడం అవసరం. దీంతో సహజసిద్ధంగా విటమిన్ డి ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. పుట్టగొడుగులు, పాలు, చేపలు ఆహారంలో భాగం చేసుకోవాలి.

చర్మ సంరక్షణ

చలికాలంలో అందరినీ చిరాకు పెట్టే అంశం చర్మం పొడిబారడం. చలి గాలులలో తేమ తక్కువగా ఉంటుంది. ఈ గాలులు తేమని లాగేయడం వల్ల చర్మం పొడిబారినట్టు అవుతుంది. వేడి నీళ్ల స్నానాలు ఈ కాలంలో హాయిగా అనిపిస్తాయి. కానీ పొడి చర్మాన్ని మరింత ప్రేరేపిస్తాయి. దీంతో కొందరిలో దురద, దద్దుర్లు మొదలవుతాయి. చర్మంలోని పైపొర పొడిబారడం వల్ల కొన్ని రకాల అనారోగ్యాలూ దరిచేరే అవకాశం ఉంది. అందుకే చలి కాలంలో చర్మ సంరక్షణ ఎంతో కీలకం. బయటికి వెళ్లిన ప్రతిసారీ సన్‌స్క్రీన్ రాసుకోవాలి. గ్లిజరిన్ ఉన్న సబ్బులు, క్రీములతో చర్మానికి రక్షణ కలిగించాలి. లిప్‌బామ్‌లు లేదా నెయ్యి పెదవులకు రాసుకుంటే మంచిది. వెచ్చని కొబ్బరి నూనెను చర్మానికి పట్టించి స్నానం చేయాలి. ఇక అంతర్గత ఆరోగ్యం కోసం ఒమేగా 3 కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలి. ముఖ్యంగా ఫ్లాక్స్‌సీడ్స్, వాల్‌నట్స్, ఆవ నూనె చర్మ పోషణకు సహాయపడతాయి. కురులకు సంబంధించి కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ సార్లు తలస్నానాలు చేయడం మానుకోవాలి.

ఏం చేయాలి?

1. మందులు క్రమం తప్పకుండా వేసుకోవాలి. ఉప్పుతో చేసే చిరుతిళ్లు, మిఠాయిలు, జంక్ ఫుడ్కు దూరంగా ఉండాలి. ధ్యానం, ప్రాణాయామం, యోగా వంటి వాటితో ఒత్తిడిని తగ్గించుకోవాలి.

2 శ్వాస సమస్యలకు : చల్లటి గాలి, ఇంట్లో కాలుష్య కారకాలు ఉబ్బసం, బ్రాంకైటిస్ ను ప్రేరేపిస్తాయి. సీవోపీడీ ఎక్కువయ్యేలా చేస్తాయి. శ్వాస సరిగా తీసుకోలేకపోవటం, ఇన్ఫెక్షన్ల మూలంగా తరచూ ఆసుపత్రిలో చేరి, చికిత్స తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఏం చేయాలి? మాస్కు, మఫ్లర్, స్కార్ఫ్ ధరిస్తే చల్లగాలి ఊపిరితిత్తుల్లోకి వెళ్లకుండా చూసుకోవచ్చు. పొగ వంటి అలర్జీ కారకాలకు దూరంగా ఉండాలి. జలుబు, దగ్గు, ఫ్లూ లక్షణాలకు తగు చికిత్స తీసుకోవాలి. లేకపోతే అవి బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లుగా మారొచ్చు,

3) గుండె జబ్బులు : చలి వాతావరణంతో రక్తనాళాల సంకోచిస్తాయి. దీంతో రక్తపోటు పెరిగి, గుండె మీద అదనపు భారం పడుతుంది. ఇది అధిక రక్తపోటు, గుండెజబ్బులు గలవారికి ప్రమాదకరంగా పరిణమిస్తుంది. ఏం చేయాలి?: బాగా చలిగా ఉన్నప్పుడు బయటకు వెళ్లకుండా చూసుకోవాలి. దీంతో గుండె మీద అనవసరంగా ఒత్తిడి పడకుండా జాగ్రత్త పడొచ్చు. ఛాతీ నొప్పి, ఆయాసం వంటి హెచ్చరికలను గమనిస్తే సత్వరం మీ వ్యక్తిగత వైద్యుని సంప్రదించాలి.



హసీనా కోసం ఇంటర్‌పోల్ సాయం

- సిద్ధపడుతున్న బంగ్లాదేశ్ ప్రభుత్వం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 19: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు 'ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె భారత్‌లో రహస్య ప్రదేశంలో ఆశ్రయం పొందుతున్నారు. ఐసీటీ తీర్పు నేపథ్యంలో బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం ఆమెను భారత్ నుంచి స్వదేశానికి రప్పించేందుకు చర్యలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే ఇంటర్‌పోల్ సాయం కోరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మానవత్వానికి వ్యతిరేకంగా క్రూర నేరాలకు పాల్పడ్డారనే కారణంతో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరణశిక్ష విధిస్తున్నట్లు ఆ దేశ ప్రత్యేక ట్రిబ్యునల్ సోమవారం తీర్పు ప్రకటించింది. షేక్ హసీనా పరోక్షంలో విచారణ జరిపిన ట్రిబ్యునల్ హసీనా ప్రభుత్వంలో హోమ్ మంత్రిగా పనిచేసిన సదుజ్జమాన్ ఖాన్ కమల్‌కు కూడా ఉరిశిక్ష విధించింది. ప్రస్తుతం వారు భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. ఈ నేపథ్యంలో వారి అప్పగింతపై యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఇంటర్‌పోల్ సాయం కోరేందుకు సిద్ధమైనట్లు బంగ్లా మీడియా నివేదించింది.

రాహుల్ గాంధీకి 272 మంది ప్రముఖుల లేఖ

- ఈసీ మీద అనవసర ఆరోపణలు వద్దని సూచన

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 19: భారత ప్రజాస్వామ్యం, దాని మూల స్తంభాల మీద దాడి జరుగుతోందంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి 272 మంది ప్రముఖులు లేఖ రాశారు. ఓట్ల చోరీ జరుగుతోందని కేంద్ర ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో, ఆయన విధానాలను విమర్శిస్తూ ఈ లేఖ వెలువడింది. ఈ లేఖపై 16 మంది రిటైర్డ్ న్యాయమూర్తులు, 123 మంది మాజీ అధికారులు, 133 మంది మాజీ సైనికాధికారులు, 14 మంది మాజీ రాయబారులు సంతకాలు చేశారు. సొంత రాజకీయ ప్రయోజనాల కోసం నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ గాంధీ ఆరోపించారని గుర్తు చేశారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. అయితే, ఈ విషయంపై రాహుల్ గాంధీపై ఎలాంటి అధికారిక ఫిర్యాదు నమోదు కాలేదని తెలిపారు. ప్రతిపక్ష నాయకుడు ఎన్నికల కమిషన్‌పై పదేపదే దాడి చేస్తూ, ఓట్ల చోరీకి సంబంధించి తన వద్ద అణుబాంబు లాంటి ఆధారాలు ఉన్నాయని చెబుతూ నమ్మశక్యం కాని, అభ్యంతరకర భాషను ఉపయోగిస్తున్నారని వారు విమర్శించారు. ఈసీలో కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఎవరినీ వదిలిపెట్టబోమని బెదిరింపులకు పాల్పడటం సరికాదని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను విమర్శించడాన్ని వారు ఖండించారు.ఎస్ఐఆర్‌పై ఈసీ ఇప్పటికే వివరణ ఇచ్చిందని, సుప్రీంకోర్టు కూడా దీనిపై మార్గదర్శకాలు జారీ చేసిందని వారు గుర్తు చేశారు.

ప్రకృతి వ్యవసాయంలో భారత్ ప్రపంచానికి కేంద్రం

- 11 యేండ్లలో ఎన్నో మార్పులు వచ్చాయన్నప్రధాని మోడీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 19 : ప్రకృతి వ్యవసాయంలో భారత్ ప్రపంచానికి కేంద్రంగా మారుతుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఇది స్వదేశీ విధానమని, సంప్రదాయంగా వస్తోందని చెప్పారు. రైతులు యేడాదికి ఒక ఎకరం చొప్పున క్రమంగా ప్రకృతి వ్యవసాయం వైపు మారాలని సూచించారు. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో బుధవారం పర్యటించిన ప్రధాని మోడీ, అక్కడ నుంచే పీఎం కిసాన్ 21వ విడత నిధులను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ వాతావరణ మార్పులు, నేల సారం సమస్యలకు ప్రకృతి వ్యవసాయం, పంటల మార్పిడే పరిష్కారమని అన్నారు. అధిక రసాయనాలు, పురుగుమందుల వాడకంతో నేలసారం దెబ్బ తింటోందన్నారు. గత పదకొండేండ్లలో వ్యవసాయ రంగంలో భారీగా మార్పులు జరిగాయన్నారు. వ్యవసాయ ఎగుమతులు దాదాపు రెండింతలయ్యాయని వివరించారు. రైతులకు సహాయం చేయడానికి అన్ని మార్గాలను ఉపయోగిస్తున్నామన్నారు. 'మన జీవవైవిధ్యం కొత్త రూపు సంతరించుకుంటోంది. దేశ యువత ఇప్పుడు వ్యవసాయాన్ని ఆధునిక, విస్తృతి కలిగిన అవకాశంగా చూస్తున్నారు. దీనివల్ల దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింతగా బలపడుతుంది.' అని ప్రధాని మోడీ అన్నారు.



ఐసీసీ వరల్డ్ కప్ అండర్ 19 షెడ్యూల్ విడుదల

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ICC) వచ్చే అండర్ 19 ప్రపంచ కప్ షెడ్యూల్‌ను బుధవారం ప్రకటించింది. ఈ టోర్నమెంట్ జనవరి 15 నుంచి ఫిబ్రవరి 6 వరకు జింబాబ్వేనమీబియా వేదికగా జరుగన్నది. ఈ టోర్నీలో 16 జట్లు పాల్గొంటాయి. ఫైనల్‌తో సహా మొత్తం 41 మ్యాచ్‌లు జరుగుతాయి. ఆసక్తికరమైన విషయం ఏంటంటే ఈ సారి భారత్‌పాకిస్తాన్ మ్యాచ్‌ను చూడలేం. రెండు వేర్వేరు గ్రూప్స్‌లో ఉన్నాయి. అండర్ 19 ప్రపంచ కప్‌లో నాలుగు గ్రూపులు ఉంటాయి. ఇందులో నాలుగు జట్లు చొప్పున ఉంటాయి. గ్రూప్ దశ తర్వాత సూపర్ సిక్స్.. అందులో నుంచి నాలుగు జట్లు సెమీ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఫైనల్ మ్యాచ్ హరారేలో జరుగుతుంది. టోర్నీలో తొలి మ్యాచ్‌ను భారత్‌యూఎస్‌ఏ మధ్య జరుగుతుంది. రెండో మ్యాచ్ జింబాబ్వేస్కాట్లాండ్‌తో తలపడుతుంది. టాంజానియా తొలిసారిగా వరల్డ్ కప్ ఆడబోతున్నది. మొదటి మ్యాచ్‌ను వెస్టిండిస్‌తో ఆడుతుంది. అండర్ 19 ప్రపంచ కప్ మ్యాచ్‌లు హరారే స్పోర్ట్స్ క్లబ్, తకాషింగా స్పోర్ట్స్ క్లబ్, జింబాబ్వేలోని క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్‌తో సహా ఐదు వేదికల్లో జరుగుగుతాయి. నమీబియాలో నమీబియా క్రికెట్ గ్రౌండ్, హెచ్‌పీ ఓవల్‌లో వరల్డ్ క్లబ్‌లో మ్యాచులు జరుగుతాయి. గ్రూప్‌ఏలో భారత్, యూఎస్‌ఏ, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ ఉన్నాయి. గ్రూప్‌బీలో జింబాబ్వే, పాకిస్తాన్, ఇంగ్లండ్, స్కాట్లాండ్.. గ్రూప్‌సీలో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా, ఐర్లాండ్, జపాన్, శ్రీలంక జట్లు ఉన్నాయి. గ్రూప్‌డీలో టాంజానియా, వెస్టిండిస్, ఆఫ్ఘనిస్తాన్, దక్షిణాఫ్రికా ఉన్నాయి. ఐసీసీ వెబ్‌సైట్‌లో టోర్నమెంట్ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ టోర్నమెంట్‌లో టాంజానియా అరంగేట్రం చేస్తుండగా.. జపాన్ 2020 తర్వాత మళ్లీ టోర్నీలో అడుగుపడుతున్నది. భారత్ తొలి మ్యాచ్‌ను 15న అమెరికాతో, 17న బంగ్లాదేశ్‌తో, జనవరి 24న న్యూజిలాండ్‌తో తలపడుతుంది. భారత్ మ్యాచులన్నీ బులవాయో వేదికగా జరుగుతాయి. మొదటి రౌండ్‌లో గ్రూప్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ సిక్స్‌లో ఆడుతాయి. ఇందులో ఆరు జట్లను రెండు గ్రూపులుగా విడిపోతాయి.

సొంత గడ్డపై తగ్గుతున్న టీమిండియా ఆధిపత్యం

- ఆస్ట్రేలియా కెప్టెన్ అలిస్సా హీలీ సంచలన వ్యాఖ్యలు

స్వదేశంలో టెస్టుల్లో భారత జట్టు ఆధిపత్యం తగ్గుతున్నది. ఇటీవల వరుస సిరీస్‌లో ఓటమిపాలైంది. తాజాగా పిచ్‌లపై దేశీయంగా, విదేశాల్లోనూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోల్‌కతా ఈడెన్ గార్డెన్ వేదికగా జరిగిన టెస్ట్‌లో భారత జట్టు టర్నింగ్ పిచ్‌ను సిద్ధం చేసింది. స్పిన్‌తో ఆతిథ్య జట్టు దక్షిణాఫ్రికాను బోల్తా కట్టించాలనుకున్న టీమిండియా వ్యూహం బెడిసికొట్టింది. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేకపోయి ఓటమిపాలైంది. అయితే, భారత వికెట్లపై ఆస్ట్రేలియా వుమెన్ క్రికెట్ జట్టు కెప్టెన్ అలిస్సా హీలీ స్పందించారు. తొలిరోజు నుంచే తీవ్రమైన టర్న్ ఇస్తున్న ఇలాంటి పిచ్‌లు భారత్‌కే ఇబ్బందులు తెస్తాయన్నారు. సౌతాఫ్రికాతో జరిగిన ఈడెన్ టెస్టులో భారత్ 30 పరుగుల తేడాతో ఓడిపోవడాన్ని ఉదాహరణగా పేర్కొన్న హీలీ.. స్వదేశంలో బ్యాటర్లు సైతం నిలబడలేని వికెట్లు సిద్ధం చేయడం భారత వ్యూహంలో లోపంగా అభిప్రాయపడ్డారు. 'ఇలాంటి పిచ్‌లపై ఆడటం ప్రపంచవ్యాప్తంగా ఎవరికైనా కష్టం. చిన్నప్పటి నుంచే స్పిన్ పిచ్‌లపై ఆడిన భారత ఆటగాళ్లకే ఇప్పుడు సవాలుగా మారుతోంది. అప్పుడు ఇలాంటి తీవ్రమైన టర్నింగ్ వికెట్లు ఎందుకు?' అంటూ ఆమె ప్రశ్నించారు. 'విలో టాక్ క్రికెట్' పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన హీలీ, నేటి క్రికెట్‌లో స్పిన్‌ను ఎదుర్కోవడం మరింత క్లిష్టమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో భారత్ స్పిన్‌కు అతిగా సహకరించే పిచ్‌లు సిద్ధం చేస్తే, దాని ప్రభావం వారి జట్టుపైనే పడుతోందని ఆమె హెచ్చరించారు. న్యూజిలాండ్‌తో జరిగిన టర్నింగ్ పిచ్‌లపై జరిగిన టెస్టుల్లో కూడా భారత బ్యాటర్లు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని గుర్తుచేసిన హీలీ.. 'ఫ్లాట్ వికెట్లు ఉంటే భారత జట్టు వరుస పరాజయాల నుంచి బయటపడగలదు' అని సూచించారు.

విచిత్రంగా ఔటయిన బ్యాట్స్‌మన్

- స్పందించిన సీనియర్ బౌలర్ అశ్విన్

రంజీ ట్రోఫీలో ఓ బ్యాట్స్‌మెన్ విచిత్రమైన రీతిలో అవుట్ అయ్యాడు. ఇది క్రికెట్ నిపుణులతో పాటు అభిమానులను సైతం ఆశ్చర్యానికి గురి చేసింది. మణిపూర్ బ్యాట్స్‌మన్ లామాబమ్ అజయ్ సింగ్ 'హిట్ ది బాల్ ట్వైస్ రూల్ ప్రకారం పెవిలియన్‌కు చేరాడు. ఇది డొమెస్టిక్ క్రికెట్‌లో ఇలా అవుట్ అవడం అరుదుగా కనిపిస్తుంది. ఈ మ్యాచ్‌లో మేఘాలయ ఎడమ చేతివాటం స్పిన్నర్ ఆర్యన్ బోరా వేసిన బంతిని అజయ్ సింగ్ డిఫెన్స్ ఆడాడు. కానీ, బంతి బ్యాట్‌కు తగిలి మళ్లీ స్టంప్స్ వైపు వెళ్తున్న సమయంలో.. వికెట్‌ను కాపాడుకునేందుకు బ్యాట్‌తో బంతిని ఆపేందుకు ప్రయత్నించాడు. ప్యాడ్ సహాయంతో బంతిని ఆపగలిగే అవకాశం ఉన్నా.. బ్యాట్‌ను ఉపయోగించడంతో అవుట్ అవుట్‌గా ప్రకటించారు. బంతిని రెండు సార్లు కొట్టినట్లుగా భావించి మేఘాలయ అప్పీల్ చేయగా అజయ్ పెవిలియన్‌కు చేరాడు. దీనిపై భారత మాజీ స్పిన్నర్ ఆర్ అశ్విన్ ఫన్నీగా స్పందించారు. తాను సైతం ఇదే రూల్ కింద అవుట్ అయ్యానంటూ గుర్తు చేసుకున్నాడు. కానీ, స్ట్రీట్ క్రికెట్‌లో ఇలా జరిగిందని చెప్పాడు. ఆ సమయంలో తొలి షాట్‌ను డిఫెండ్ చేశానని.. స్టంప్స్ పడకుండా ప్రయత్నించే క్రమంలో బ్యాట్‌కు బంతి తగిలిందని.. ఆ రోజున వీధి మొత్తం కేకలు వేసిందని గుర్తు చేసుకున్నాడు. రంజీలో లామాబమ్ సింగ్‌ను రెండుసార్లు బంతిని షాట్ అడినట్లుగా భావించి అవుట్ అవగ్గా.. ఈ నిర్ణయాన్ని అశ్విన్ తప్పు పట్టాడు. బ్యాట్స్‌మెన్ స్టంప్స్‌ను కాపాడుకునేందుకు రెండోసారి బ్యాట్‌తో బంతిని కొడితే అవుట్ కాదని స్పష్టం చేశాడు. ఎంసీసీ లా 34 ప్రకారం.. స్టంప్స్‌ను కాపాడుకునేందుకు కాకుండా ఉద్దేశపూర్వకంగా బ్యాట్స్‌మెన్ రెండోసారి బంతిని కొడితేనే అవుట్. సెకండ్ హిట్ వికెట్‌ను కాపాడటానికి మాత్రమే అయితే.. బ్యాట్స్‌మన్‌ను నాటౌట్‌గా పరిగణిస్తారు.

తన తప్పేం లేదు!

తొలి టెస్టులో దక్షిణాఫ్రికా చేతిలో టీమిండియా 30 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఆ తర్వాత ఈడెన్ గార్డెన్ పిచ్‌పై పెద్ద దుమారమే రేగింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన విషయం తెలిసిందే. మెడ గాయంతో ఆసుపత్రిలో చేరి మ్యాచ్ మొత్తానికి దూరమయ్యాడు. అయితే, పిచ్ తొలి రోజు నుంచే బంతి బౌన్స్‌తో పాటు టర్న్ అవడం కనిపించింది.



మ్యాచ్ ముగిసిన అనంతరం అభిమానులతో పాటు మాజీలు సైతం టీమిండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ వ్యూహాలపై తీవ్ర విమర్శలు గుప్పించడంతో పాటు ప్రశ్నలు లేవనెత్తారు. టెస్ట్ కోచ్‌గా గంభీర్‌ను తొలగించాలని డిమాండ్లు కూడా వచ్చాయి. తాజాగా బీసీసీఐ మాజీ అధ్యక్షుడు, క్యాబ్ చీఫ్ సౌరవ్ గంగూలీ గంభీర్‌ను తొలగించాలనే డిమాండ్లపై స్పందించారు. గౌతమ్ గంభీర్‌ను తొలగించే ప్రశ్నే లేదని.. శుభ్‌మన్ నేతృత్వంలోని ఇంగ్లండ్‌లో రాణించిందని గుర్తు చేశారు మాజీ కెప్టెన్. స్వదేశంలోనూ గొప్పగా రాణిస్తారన్న నమ్మకం తనకు ఉందన్నారు. ఈడెన్ గార్డెన్స్ పిచ్‌ను ఇలా ఎందుకు తయారు చేశారనే దానిపై చర్చ సాగుతుండగా.. ఓ చర్చలో ఈ విషయంలో మిమ్మల్ని సంప్రదించారా? అని ప్రశ్నించగా.. గంగూలీ మాట్లాడుతూ ఇందులో తన ప్రమేయం ఏమీ లేదన్నారు. టెస్టు మ్యాచుకు నాలుగు రోజుల ముందు వికెట్ తయారీ పనిని బీసీసీఐ క్యూరేటర్లు చేపడుతారని.. క్యాబ్‌కు సొంత క్యూరేటర్ బృందం ఉంటుందన్నారు. కానీ, టీమిండియా మేనేజ్‌మెంట్ నుంచి రిక్వెస్ట్‌లు వస్తాయని.. వారి అభ్యర్థలన మేరకు పిచ్ తయారు చేస్తారన్నారు. ఈడెన్ గార్డెన్స్ భారత బ్యాట్స్‌మెన్‌కు పిచ్ అనుకూలంగా లేదని బీసీసీఐ మాజీ చైర్మన్ అంగీకరించారు. ఈడెన్ గార్డన్ క్యూరేటర్ సుజన్ ముఖర్జీ సైతం స్పందించారు. టీమ్ మేనేజ్‌మెంట్, కోచ్ కోరిక మేరకు పిచ్ తయారు చేసినట్లు సుజన్ స్పష్టం చేశారు.

ఒడియమ్మ..

సుడిగాలి సుధీర్ మూవీ నుండి పాట విడుదల

జైశ్నవ్ ప్రొడక్షన్ , మాహాతేజ క్రియేషన్స్ లో అద్భుతం, టేనంట్ వంటి అద్భుతమైన చిత్రాలని నిర్మించిన మొగుళ్ళ చంద్రశేఖర్ గారి నిర్మాణంలో... క్రికెట్ నేపథ్యం లోనే కామెడీ ప్రధాన అంశంగా సుడిగాలి సుధీర్, దివ్యభారతి ప్రధాన పాత్రధారులుగా మూవీ G.O.A.T. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశకి చేరుకుంది. బుధవారం మేకర్స్ ఫస్ట్ సింగిల్ ఒడియమ్మ సాంగ్ ని రిలీజ్ చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. ఈ సాంగ్ ని మ్యూజిక్ డైరెక్టర్ జీవి ప్రకాష్ లాంచ్ చేశారు. లియోన్ జేమ్స్ ఈ పాటని అదిరిపోయే లవ్ మెలోడీ గా కంపోజ్ చేశారు. అనురాగ్ కులకర్ణి ఎనర్జిటిక్ వాయిస్ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. సురేష్ బనిసెట్టి లిరిక్స్ హీరో ఎమోషన్స్ ని అద్భుతంగా ప్రజెంట్ చేశాయి. ఈ సాంగ్ లో సుధీర్, దివ్యభారతి కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజువల్స్ ప్లజెంట్ గా వున్నాయి. ఈ లవ్ ట్రాక్ అందరికీ ఇన్స్టంట్ గా కనెక్ట్ అయ్యింది. ఈ ఆల్బమ్ పై అంచనాలని మరింతగా పెంచింది. త్వరలోనే సినిమా రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేయనున్నారు మేకర్స్.

ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో డిఫరెంట్ జోనర్

'12A రైల్వే కాలనీ'

మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో

హీరో అల్లరి నరేష్ అప్ కమింగ్ థ్రిల్లర్ '12A రైల్వే కాలనీ' ఎక్సయిటింగ్ ప్రమోషనల్ కంటెంట్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. నూతన దర్శకుడు నాని కాసరగడ్డ దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. పవన్ కుమార్ సమర్పణలో పోలిమేర మూవీ సిరీస్ తో పాపులరైన డాక్టర్ అనిల్ విశ్వనాథ్ షోరన్నర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ రాశారు. కామాక్షి భాస్కర్ల హీరోయిన్ గా నటిస్తున్నారు. నవంబర్ 21న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

'12A రైల్వే కాలనీ' మీ ఫిల్మోగ్రఫీ లో డిఫరెంట్ గా కనిపిస్తుంది. ఫస్ట్ ఫస్ట్ టైం ఇలాంటి థ్రిల్లర్ సినిమాకి మ్యూజిక్ చేస్తున్నారు కదా..ఎలాంటి కొత్తదనం ఉండబోతుంది?

మ్యూజిక్ చేసిన నాకే కొత్తగా ఉంది. నేనే మ్యూజిక్ చేశానా అనిపించింది. ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో ఇది డిఫరెంట్ జోనర్ సినిమా. కొత్తగా పరిచయం అయిన వ్యక్తులతో కొత్తగా ప్రయాణం చేసిన అనుభూతి కలిగింది. నన్ను ఈ జోనర్ లో ఉండే మూవీస్ కి ఈ సినిమా తీసుకెళ్తుందని నమ్ముతున్నాను. నిన్ననే డిటిఎస్ లో సినిమా చూసుకున్నాను. ఎక్సైటింగ్ గా ఉంది.

ఈ ప్రాజెక్టు మీ దగ్గరికి ఎలా వచ్చింది?

నిర్మాత శ్రీనివాస ముందుగా అప్రోచ్ అయ్యారు. సినిమా మన కాంబినేషన్ చేస్తే బాగుంటుందని చెప్పారు. పొలిమేర నాకు ఇష్టమైన సినిమాలు. ఆ సినిమాలో దర్శకుడు ఈ సినిమాకి రచయితగా షోరన్నర్ గా పనిచేయడం ఇంకా ఆనందాన్ని ఇచ్చింది. ఇలాంటి జానర్ లో నేను సినిమా చేయగలను నమ్మకాన్ని ఈ ప్రాజెక్టు కల్పించింది. సినిమా చూసిన తర్వాత కూడా ఆడియన్స్ అదే ఫీల్ అవుతారని నమ్ముతున్నాను.

నరేష్ కి మీరు గుర్తుండిపోయే పాటలు ఇచ్చారు కదా ఈ సినిమాలో అలాంటి పాటలకు స్కోప్ ఉందా?

ఇందులో రెండు మెలోడీ సాంగ్స్ ఉన్నాయి. ఆ రెండు పాటలు కూడా కథ నుంచే పుడతాయి. నేను చేసిన బలగం, మాస్ జాతర, ధమాకా, మ్యాడ్, టిల్లు స్క్వేర్, సం

క్రాంతికి వస్తున్నాం.. ఇవన్నీ ఒకటి గ్రామీణ నేపథ్యం, మరొకటి, మాస్ , యూత్ ఫుల్ మరొకటి ఫ్యామిలీ ఇలా డిఫరెంట్ జోనర్ సినిమాలు చేసే అవకాశం నాకు దొరికింది. ఇన్ని వేరియేషన్స్ ఉన్న సినిమాలు ఒకేసారి రావడం నా అదృష్టం. ఇందులో రైల్వే కాలనీ ఇంకా స్పెషల్. సినిమా విషయంలో చాలా సంతృప్తిగా ఉన్నాను. అందరూ మ్యూజిక్ బాగుంటుందని చెప్తున్నారు. నిర్మాత శ్రీనివాస గారు నమ్మడం వల్లే ఇది సాధ్యమైంది.

తెలుగు సినిమా పాటల నేటివిటీ మిస్ అవుతుందనే ఫీలింగ్ మీకుందా?

దర్శకుడు ఒక కథను రాసుకుని వస్తే ఆ కథకు తగ్గట్టు మ్యూజిక్ ఇవ్వాల్సిన బాధ్యత మాపై ఉంటుంది. నా వరకు నేను చేసే పాటల్లో జనంతో అనుబంధం ఉండే పాటలే ఉంటాయి. ఈ సినిమా పాటలు విన్నప్పుడు కూడా ఒక అందమైన పాట విన్న అనుభూతి కలుగుతుంది.

ఇతర భాషల నుంచి గాయకులని తీసుకురావడంతో తెలుగు భాషను ఖూనీ చేస్తున్నారనే విమర్శ ఉంటుంది.. దాన్ని మీరు ఎలా చూస్తారు?

ఇప్పుడు భాషకు సంబంధించిన సరిహద్దులు చెరిగిపోయాయి. మన వాళ్ళు బాలీవుడ్లో సినిమాలు చేస్తున్నారు. అక్కడ వాళ్ళు వచ్చి ఇక్కడ పనిచేస్తున్నారు అయితే పాడించుకున్నప్పుడు మన భాష యొక్క ఔన్నత్యం పోకుండా మన శ్రోతలు అసహ్యించుకోకుండా ఉంటే చాలు. ఒక పాట సరిగ్గా రాలేదంటే దానికి జవాబు చెప్పాల్సింది కూడా సంగీత దర్శకుడే. ఇప్పటివరకు నేను చేసిన పాటలు అలా నలిగిపోలేదని భావిస్తున్నాను. ఒకవేళ ఉంటే చెప్పండి. వాటిని నేను సరి చేసుకుంటాను.

ఇండస్ట్రీలో మ్యూజిక్ డైరెక్టర్స్ మధ్య కాంపిటీషన్ ఎలా ఉంటుంది?

నాకు కాంపిటీషన్ తెలీదు. నేను ఆ జోనర్ లో లేను. నన్ను నమ్మి సినిమా ఇస్తే నమ్మకంగా పనిచేయాలి. డబ్బు ఇస్తే దానికి జవాబు దారిగా ఉండాలి. నాకు ఒక సినిమా ఇస్తే దాన్ని చక్కగా తీర్చిదిద్ది పంపించాలి. నాపై పెట్టుకున్న నమ్మకం నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తాను.

ప్రస్తుతం చేస్తున్న ప్రాజెక్ట్స్ గురించి?

రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి, మన శంకర వరప్రసాద్ గారు, డెకాయిట్ , బైసన్ నాయుడు, సంపత్ నంది గారి భోగి, విశ్వక్సేన్ గారి ఫంకీ చిత్రాలు చేస్తున్నాను.

రచ్చ చేసిన 'గోపిగాళ్ల గోవా ట్రిప్' టీం

- సందడి చేసిన చిత్ర యూనిట్
- లోకలోళ్ళు కావటంతో జోష్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 19: సినిమా అంటేనే రంగుల ప్రపంచం. ఆ ప్రపంచంలో తాము భాగం కావాలని భావించేవాళ్ళు ఎందరో. కొందరు అనుకున్న లక్ష్యం కోసం ఎన్నో అవస్థలు ఎదుర్కొని ఒక్కసారి అయినా బిగ్ స్క్రీన్ పై కనిపించాలనే కసితో ముందుకు సాగుతుంటారు. ఈ కోవాలోకి వస్తాడు సిద్దిపేట పట్టణం ఇమాంబాద్ కు చెందిన శివరాత్రి రాజు. అత్యంత పేద కుటుంబం, సినిమాకు సంబంధించిన ఆనవాళ్లు శూన్యం అయినా ఎనిమిదేళ్ల గా పడుతున్న కష్టం గోపిగాళ్ళతో గోవా ట్రిప్ సినిమాతో తీరింది. సినిమా తీశారు అంతా బాగానే ఉంది అయినప్పటికీ ఏదో వెలితి కన్న తల్లిదండ్రులు, బంధువులు, చిన్నప్పటినుండి కలిసి తిరిగిన ఆత్మీయుల మధ్య సినిమా చూడాలన్న ఆశతో అత్యంత కష్టం మీద చిత్ర యూనిట్ సిద్దిపేటలోని శ్రీ శ్రీనివాస్ థియేటర్ లో సినిమాను రిలీజ్ చేయించింది. ఇంకేముంది ఆశ పడ్డట్టుగానే పుట్టిపెరిగిన మనుషుల మధ్య సినిమా ప్రదర్శన మొదలు కావటం... అంతా శభాష్ రా అంటూ భుజం తట్టడంతో చిత్ర యూనిట్ సంతోషానికి అవధులు లేకుండా పోయింది.

యూనిట్ సందడి..

గోపి గాళ్ళ గోవా ట్రిప్ చిత్ర యూనిట్ బుధవారం నాడు సిద్దిపేటలో సందడి చేశారు. అవంతి బ్యానర్ పై వచ్చిన ఈ సినిమాలోని నటి నటులు శివరాత్రి రాజు, అజిత్ మోహన్, పవన్ రమేష్, విజయ్, నిర్మాత సాయి కుమార్, డైరెక్టర్ రోహిత్,దివ్య, డిఓపి శశాంక్ లు చిత్రం ప్రదర్శితమవుతున్న శ్రీ శ్రీనివాస్ థియేటర్ లో ప్రేక్షకులతో కలిసి సినిమా వీక్షించి సందడి చేశారు. ఎలాంటి బేషజం లేకుండా అందరితో ఆత్మీయంగా మాట్లాడుతూ సినిమా ఎలా ఉందంటూ ఫీడ్ బాక్ తీసుకున్నారు. కష్టంతో వచ్చిన మమ్మల్ని ఆదరించండి.. మున్ముందు అలరిస్తామంటూ వారు కోరగా ప్రేక్షకులు అంతా చప్పట్లతో వారిని అభినందించారు.

ఆనందంలో ఇమాంబాద్ ప్రజలు..

అత్యంత సామాన్య కుటుంబంలో పుట్టిన శివరాత్రి రాజు బిగ్ స్క్రీన్ పై కనిపించేస్తాయికి ఎదిగాడని తెలుసుకున్న ఇమాంబాద్ వాసులంతా సినిమా చూసి రాజును అభినందించారు. వార్డు కౌన్సిలర్ పాతూరి శ్రీనివాస్ రెడ్డి , గ్రామ పెద్దలు నాయిని సంజీవరెడ్డి, మెడిశెట్టి శ్రీనివాస్, ఉప్పెన గౌరీ శంకర్, గూడ సత్తిరెడ్డి,పుల్లూరు కుంటయ్య, అనుముల మల్లేశం,గూడ అమరెందర్ రెడ్డి ,మార్క వెంకటేష్, పుల్లూరి రాజు, మెడిశెట్టి రంజిత్, నటుడు రాజు తల్లితండ్రులు పెద్ద సంఖ్యలో వార్డు ప్రజలు హాజరై సినిమా తిలకించారు.

టికెట్లు అందించిన నటుడు రాజు..

సినిమాలో ప్రధాన పాత్రను పోషించిన శివరాత్రి రాజు సినిమా చూడడానికి వచ్చిన ప్రేక్షకులకు స్వయంగా టికెట్లు అందించారు. తన సినిమాకు తానే టికెట్లు ఇవ్వటమనే గొప్ప అనుభూతిని ఎప్పటికి మరిచిపోలేనని రాజు పేర్కొన్నారు.

మద్దతుగా నిలిచిన జర్నలిస్టులు

సిద్దిపేట ప్రాంతానికి చెందిన రాజు, విజయ్ లు ప్రధాన పాత్రల్లో నటించగా వారికి సిద్దిపేట జర్నలిస్టులు అండగా నిలిచారు. జర్నలిస్టులు నాయిని సంజీవ రెడ్డి, రంగదాంపల్లి శ్రీనివాస్, పల్లెటూరు ప్రసాద్, ఫొటో జర్నలిస్టులు చందు, సతీష్, బాబురాజు, శ్రవణ్ కుమార్, రాదారం రాజు తదితరులు సినిమా వీక్షించి అభినందించారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200